# వివేక చూడామణి

## శ్రీ గోవింద చైతన్యగారిచే చెప్పబడిన సత్సంగ సారాంశం



అక్షరీకరణ

శ్రీమతి ద్విభాష్యం కామేశ్వరి రాణి

శాంతా వసంతా ట్రస్టు
హైదరాబాద్


# వివేక చూడామణి

శ్రీ గోవింద చైతన్యగారిచే

చెప్పబడిన సత్సంగ సారాంశం

## అక్షరీకరణ

శ్రీమతి ద్విభాష్యం కామేశ్వరి రాణి




**శాంతా-వసంతా ట్రస్టు**

ప్లాట్ నెం : **16 & 17**, గ్రీన్ వాక్ వేస్,

రాజేంద్రనగర్, హైదరాబాద్

# VIVEKA CHOODAMANI

*by :*
*Smt Dwibhasyam Kameswari Rani*


ముద్రణ : **17 నవంబర్, 2024**

ప్రతులు : 1000

ముఖచిత్రం, డిటిపి &
లే -అవుట్ : తొడుపునూరి నవీన్

ముద్రణ : రెయిన్ బో ప్రింట్ ప్యాక్, హైదరాబాద్

వెల : అమూల్యం

ప్రచురణ :


**శాంతా - వసంతా ట్రస్ట్**

**ప్లాట్ నెం.16, 17, గ్రీన్ వాక్‌వేస్**

**రాజేంద్ర నగర్,**

**హైదరాబాద్-500 030**

**email : svcthyd@gmail.com**
**www.shanthavasanthatrust.org**



పూజ్య గురుదేవులు

స్వామి చిద్రూపానంద

(శ్రీ గోవింద చైతన్య)గారికి

ప్రణామాలతో...

# ‘వివేక చూడామణి’ నుంచి చిలికి తీసిన వెన్న

శ్రీ ఆదిశంకరాచార్యుల వారి రచనల్లో ‘వివేక చూడామణి’ ఒక అణిముత్యం. ఆధ్యాత్మిక సాధనలో ప్రధానంగా తోడ్పడేవి, మన ప్రాచీన వాఙ్మయం, పురాణేతిహాసాలు, వేదవేదాంగాలు, ఉపనిషత్‌సారాలు, మహామహులు పైవాటిపై చేసిన వ్యాఖ్యాన వివరణలు. యుక్తాయుక్త విచక్షణ బుద్ధికి ఉండవలసిన ప్రధాన లక్షణం. ఇహానికి, పరానికి కూడా బుద్ధి శక్తిని యోగం ద్వారా పటిష్టం చేయడం ప్రధానం. అందుకు ఉపయుక్తంగా మన వాఙ్మయం ద్వారా బహు సాధనాల్ని ఆవిష్కరించారు. ధ్యానం, యోగాభ్యాసం, జపం, తపస్సు, వేదాంత విచారణ ఇవన్నీ బుద్ధిని సంస్కరించడానికి ఏర్పరచినవే. బుద్ధి శక్తిని పటిష్ట పరుచుకోవడానికి సత్సాంగత్యం అవసరం. సద్గ్రంధాల పరిశీలనం, పఠనం చేయడం కూడా అవసరం. జీవనయాత్రలో తగిన పరిమితులతో, అనవసర ఆకర్షణలకు విముఖంగా సంతృప్త సంసార జీవనం చేసిన వారికి ‘సంగం’ దోషం అంటదు. తత్కారణంగా కామ, క్రోధ, లోభ, మదమోహాదుల వలయం నుంచి విముక్తులు కావచ్చు.

సత్సాంగత్యం నిస్సాంగత్యానికి, నిస్సాంగత్యం నిర్మోహత్వానికి, నిర్మోహత్వం పరతత్వ జ్ఞానానికి, జ్ఞానం జీవనముక్తికి హేతువులవుతాయి.

‘సత్’ వస్తువుతో సంపర్కమే సత్సాంగత్యం !

ఆ ‘సత్’ వస్తువే పరమాత్మ !!

సద్విషయ పరంపరయే భగవంతునిపై మనకున్న అపారమైన

వాఙ్మయం. పరమాత్మను చింతన చేయడానికి మన మహర్షులు, శ్రీరామాయణం, భారత, భాగవతాది ఇతిహాసాలను, అష్టాదశ పురాణాలను, వేదవేదాంగాలను, ఉపనిషత్తులను సృజించి మనకు వరదానం చేశారు. ఆ పురాణేతిహాసాల వేదోపనిషత్తుల సారాలను క్రోడీకరించి, సంక్షిప్తీకరించి అపర శివావతార స్వరూపులు 'శ్రీ ఆదిశంకరులు' అనేకానేక రచనలు చేసి భగవన్నుతికి, స్తుతికి పూల వంతెన వేశారు.

అలాంటి పూలవంతెన 'వివేక చూడామణి'. భక్తుడ్ని, భగవంతుడ్ని చేరువ చేసేదే ఈ పూలవంతెన. ఆ 'వివేక చూడామణి'లోని అర్థం పరమార్థం సాధారణ పాఠకులకు ఇసుమంత తాత్వికత, ఆధ్మాత్మికతా ప్రయాణంలో వున్నవారికి మాత్రం సుబోధకంగా ఉంటుంది. అంతటి భావసాంద్రత, విషయ విశేషం కలిగిన జ్ఞానాన్ని శ్రీ గోవింద చైతన్య గారు తమ అనుగ్రహ భాషణంతో ఎందరో జిజ్ఞాసవులకు సరళమైనరీతిలో అందించారు.

ఆ అమృతధారను ఒడిసిపట్టుకొన్న జిజ్ఞాసువుల్లో శ్రీమతి కామేశ్వరి రాణి వారు ఒకరు. గోవింద చైతన్య గారి ద్వారా విన్న జ్ఞానమధువును తాను ఆస్వాదించడమే కాక, అది కేవలం తనకే పరిమితం చేసుకోకుండా మనలాంటి సగటు జీవులకు, ఆధ్యాత్మికత పట్ల ప్రీతికలిగి, సాధన మొదలుపెడ్తున్న ఆర్తి పరాయణులకు ఇది ఒక కరదీపికగా అందించారు.

నేనూ ఆధ్యాత్మికతా సాధనలో తొలిమెట్టులోనే పారాడుతున్న శిశువును. అలాంటి నాకు శ్రీమతి కామేశ్వరి రాణి వారి వివరణతో దోగాడడం నుంచి బుడిబుడి నడకలు వేయగలనన్న మనోధైర్యం వచ్చింది. పారాడే శిశువుకు నడిపించే చైతన్యాన్ని ప్రసాదించిన శ్రీమతి కామేశ్వరి రాణి వారికి శిరసాభివందనం చేసుకుంటూ....

ఇలాంటి సరళీకృత రచనలు మరిన్ని చేసి సాధకుల బాధలను నివృత్తి చేసి తరింపచేయాలని వారిని ప్రార్థిస్తూ....

**– వరప్రసాద్ రెడ్డి,**
**ప్రచురణ కర్త**

# మనవి

శ్రీ ఆదిశంకరాచార్యుల వారిచే రచించబడిన ఈ గ్రంథం పట్ల నాకు ఇసుమంతయినా అవగాహన లేదు. శ్రీ ఆది శంకరాచార్యుల వారి కృపాకటాక్షముల వల్ల అయితేనేం నా పూర్వజన్మ సుకృతం వల్ల, మా తల్లి తండ్రుల ఆశీస్సులవల్ల మాకు చక్కటి సద్గురువు లభించారు. వారే "శ్రీ పూజ్య గురుదేవ్ చిన్మయానంద్ స్వామీజీ" గారి యొక్క అనుగ్రహం వల్ల మాకు గురుదేవ్ యొక్క శిష్యులలో ఒకరయిన శ్రీ చిద్రూపానంద (శ్రీ గోవింద చైతన్యగారు, పూర్వాశ్రమంలో) గారు మాకు గురువుగా లభించారు.

శ్రీ చిద్రూపానంద స్వామి వారి దయవల్ల మాకు ఈ వివేక చూడామణి అనే ఈ అద్భుత గ్రంథంలోని ప్రతి అంశము చాలా చక్కగా సరళమైన భాషలో మాకు వివరించి చెప్పారు.

ఇందులోని కొన్ని అద్భుతమైన శ్లోకములను ఒక చిన్న పుస్తకంలో భద్రపరుచుకోగా నా భర్తగారయిన శ్రీ ద్విభాష్యం శేష సత్యన్నారాయణ గారు చదివి దీన్ని బాగా వ్రాయమని చాలా ప్రోత్సహించారు. ఇది కేవలం నేను విని వ్రాసినది మాత్రమే. నా అజ్ఞానం వల్ల ఏమయినా తప్పులు వ్రాసినట్లయితే సహృదయంతో నన్ను క్షమించగలరని ఆశిస్తున్నాను.

ఈ గ్రంథం మోక్షసాధనకు ఎంతో ఉపయుక్తమైనది. ఈ గ్రంథం నాలాంటి వారికి కనువిప్పు కలిగించగలదని మళ్ళీ ఈ పుస్తకాన్ని చిన్న,

చిన్న మార్పులతో ముద్రించటం జరుగుతోంది.

జీవితం అంటే ఎంతో వుంది. వివేక వైరాగ్యాలు, ఆధ్యాత్మికత మనకు అవసరమా అని భావించే ప్రతివారూ ఒక్కసారయినా ఇందులోని భావాన్ని కొంతయినా గ్రహించగలరని ఆశిస్తున్నాను.

ముందుగా (1) సనాతన ధర్మం ఎప్పుడు పుట్టింది? (2) ఈశ్వరుడు ఎప్పుడు పుట్టాడు? వేదం ఎప్పుడు పుట్టింది? అంటే వీటికి సమాధానం ఎవరు చెప్పినా అనాది అనే చెప్తారు. అనాది అంటే అప్పుడు, ఇప్పుడు అనేది చెప్పలేనిది. సృష్టికర్తకు తప్ప ఇంకెవరికీ తెలియని విషయం ఇది.

ఇప్పుడు గురువు అంటే ఎలా వుండాలి? గురువు యొక్క దయ శిష్యునిపై ఎలా వుండాలి? అనేది క్లుప్తంగా తెలుసుకుందాము.

అపారమైన భక్తి కలిగిన భక్తునిపై పరమేశ్వరుని యొక్క దయ ఎలా వుంటుందో, అలాగే శిష్యుని యొక్క ఆర్తి మీదే గురువు యొక్క దయ ఆధారపడి వుంటుంది. అంతే కాకుండా గురువు వివేక, వైరాగ్యములతో పాటు ఈ సృష్టిలో అసలు నాశనం లేని వస్తువు ఏది అని శిష్యునికి అర్థం అయ్యేలా తెలియచేసి దేన్ని పట్టుకుంటే మనకు శాశ్వతమైన ఆనందం లభిస్తుందో చెప్తూనే అసలు ఆనందం అనేది మనలోనే వుంది. ఆ ఆనందం మనకి అనుభవంలోకి రావాలి అంటే ముందుగా మనకి వైరాగ్యం రావాలి. ఆ వైరాగ్యం ద్వారానే ముక్తి లభిస్తుంది అనే విషయం మనకి గురుముఖంగా మాత్రమే లభిస్తుంది. అనేది చక్కగా తెలియచేసారు శ్రీ ఆది శంకరాచార్యులవారు.

**– శ్రీమతి ద్విభాష్యం కామేశ్వరీ రాణి**

**గ్రంథ సంకలన కర్త**

# కృతజ్ఞతాంజలి

**గౌ**రవనీయులు, గురుతుల్యులు అయిన శ్రీ వరప్రసాద్ గారు విద్యుత్ నుంచి విద్వత్ నేర్చి, పరమాత్మను సంపూర్ణంగా తెలుసుకుని 'పాపిరెడ్డి పాలెపు' పద్మభూషణులై అనంతాధ్యాత్మిక ధృక్కోణం కలవారై, కొన్ని వ్యాధుల రక్కసి కోరల నుంచి అనేక మందిని కాపాడిన ప్రాణదాతకు మనసా, వాచా, కర్మణా నమస్కారములు తెలియజేయుట తప్ప ఏ రీతి తెలిపేది నేను ధన్యవాదములు.

శ్రీ వరప్రసాద్ గారి పరిచయం అనుకోకుండా, అద్భుతంగా మా శాంతి గారి ద్వారా జరిగింది. శాంతి గారు నాకు అత్యంత ఆత్మీయురాలు, మార్గదర్శికూడా. శాంతి గారు వారి యొక్క గొప్ప మనసుతో మమ్మల్ని పరిచయం చేసిన కొద్ది సమయంలోనే వరప్రసాద్ గారి ద్వారా ఎన్నో అద్భుతమైన విషయాలు వినటం ద్వారా వారి యొక్క నిష్కల్మషమైన మనస్సు, క్రమశిక్షణ, నీతినియమాలు పాటించటమే కాకుండా సమయపాలనకు కూడా అంతే విలువను ఇచ్చే గొప్ప వ్యక్తిని కలిసినందుకు మాకు ఎంతో సంతోషం, ఆనందం కలిగాయి.

అంతకన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే సముద్రంలోని ఇసుక రేణువు వంటి నేను వ్రాసుకున్న ఈ పుస్తకాన్ని వారు ప్రచురిస్తానని చెప్పగానే మా కుటుంబ సభ్యులందరికీ ఆనందం అంబరాన్ని అంటినంత

సంబరం కలిగించింది. ఇంతటి సంతోష సమయంలో శ్రీ వరప్రసాద్ రెడ్డి గారికి శిరస్సు వంచి హృదయ పూర్వక నమస్కారములు తెలియచేసుకుంటూ....

ఈ గ్రంథంలో అచ్చు తప్పులు, అన్వయ దోషాలు లేకుండా సాధ్యమైనంత వరకు సరిదిద్దే ప్రయత్నం చేశాను. అయినా, అక్కడక్కడా అవి కనిపించి పాఠకులకు అసౌకర్యం కలిగిస్తే అన్యథా భావించవద్దని మనవి.

**– శ్రీమతి ద్విభాష్యం కామేశ్వరీ రాణి**

# గ్రంథ పరిచయం

**శ్రీ** ఆదిశంకరాచార్యుల వారిచే రచించబడి అనేక గ్రంథములలో **"వివేక చూడామణి"** అను ఈ గ్రంథం, అన్ని గ్రంథములకన్నా (శ్రీ శంకరాచార్యుల వారిచే రచించబడిన) ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది.

వివేకము అంటే విచక్షణ అని చూడామణి అంటే శిరోభూషణం అని అర్థం. వివేకచూడామణి అనే ఈ గ్రంథంలో బంధ, మోక్షాలు మాయాకల్పితాలని, సంసార బంధాలు, అహంకార, మమకారాలు జీవుణ్ణి బంధించే శత్రువులని వాటి నుంచి విముక్తి పొంది నేను కేవలం ఆత్మను మాత్రమే అని ఎలా తెలుసుకోవాలో తెలియచేసే అపురూపమైన మహద్గ్రంథం ఈ వివేకచూడామణి.

అన్ని జన్మలలోనూ ఉత్తమమయినది మానవజన్మ. కన్ను తెరిస్తే జననం, కన్ను మూస్తే మరణం మధ్యలో కనురెప్పపాటు కాలమే జీవితం.

ఒక జీవితం ముగిస్తూ మళ్ళీ పుట్టడమే జన్మ. (పాతచొక్కా విప్పి కొత్త చొక్కా తొడుక్కున్నట్టుగా). అలాగని మళ్ళీ జన్మ ఎత్తినపుడు మానవ జన్మలభిస్తుంది అనేది వారు ఇంతకు ముందు (జీవుడు) చేసుకున్న కర్మల మీద ఆధారపడి వుంది.

మానవుడు పుట్టిన దగ్గర్నుంచి మరణించే వరకు ఎన్నోరకాలయిన కర్మలు చేస్తూ సంసార సాగరాన్ని ఈదటంలోనే కాలం గడిచిపోతోంది. మనం చేసిన ప్రతి కర్మకు ఫలితం అనుభవించి తీరాలి. వీటినే కర్మఫలాలు అంటారు.

అనేక జన్మలుగా చేసుకున్న కర్మఫలాలు జీవుడితో పాటుగా ప్రయాణిస్తూ వుంటాయి. ఆ పుణ్యఫలాలను అనుభవించటానికి (దేవతా లోకం) పుణ్యలోకాలలో పుట్టటం జరుగుతుంది. ఆ పుణ్యఫలాల కారణంగా అనేకభోగాలు అనుభవించటం జరుగుతుంది. దేవలోకాలలో దేవతా జన్మ తీసుకున్న వారికి కర్మను ఆచరించటానికి స్థూలశరీరం వుండదు. శరీరం వుంటేనే కర్మలు చేయగలరు. దానికి తోడు ఈ దేవ జన్మలో మనోబుద్ధులు మాత్రమే వుంటాయి. ఈ భోగాలన్నీ అనుభవించేసాక మర్త్యలోకమయిన ఈ మానవలోకానికి రావటం జరుగుతుంది.

మళ్ళీ జన్మ అయితే వస్తుంది కానీ అదిమానవ జన్మే అనే గ్యారంటీ లేదు. మన పూర్వ కర్మల ఫలితంగా జంతువులు, క్రిమికీటకాలు, పశు పక్ష్యాదులు ఇలా ఎన్నో నీచయోనులలో పుట్టటం జరుగుతుంది. ఇలా పుట్టిన జీవులు ఎన్నో రకాల బాధలు, దు:ఖాలు, కష్టాలు అనుభవిస్తాయి. అవి కర్మలు చేస్తున్నా బుద్ధిపరంగా కాకుండా ప్రకృతిపరంగా చేస్తాయి. ఇవి పాపకర్మల యొక్క అనుభవాలు. ఈ జన్మలో కూడా భగవంతుణ్ణి చేరే అవకాశం వుండదు.

ఇవన్నీ తెలిసిన వారై శ్రీ ఆదిశంకరాచార్యుల వారు మోక్షసాధనకు మానవులు ఏరకంగా ప్రయత్నించాలి అనే విషయం తెలియ చేయటానికే వివేక చూడామణి అను ఈ గ్రంథాన్ని ఒక అమృతభాండంగా మనకు అందించారు. ఈ సృష్టిలో ఏది సత్యం? ఏది అసత్యం? ఏది అశాశ్వితం, ఏది శాశ్వతం అనేది స్పష్టంగా తెలియచేసి ఇప్పట్నుంచీ ఈ వైరాగ్యం, ఆధ్యాత్మికత అవసరమా? అని భావించి అజ్ఞానం అనే పడవలో ప్రయాణించే ప్రతివారికి కనువిప్పు కలుగజేస్తాయి. ఇందులోని అద్భుతమైన విషయాలు.

భగవంతుడు మనకు ప్రసాదించిన ఈ శరీరం ఒక రథం లాంటిది.

ఆ రథానికి సారధి ఆత్మ. ఇంద్రియాలు రథానికి కట్టిన గుఱ్ఱాలవంటివి. గుఱ్ఱాలవంటి ఇంద్రియాలను అదుపు చేయాలంటే వివేక, వైరాగ్యాల ద్వారా మాత్రమే సాధ్యం అవుతుంది. దీనికి సాధన చాలా అవసరం. ఒక్కసారి కనుక జీవుడు శరీరాన్ని వదిలినట్లయితే ఇంక సాధన సాధ్యం కాదు.

పైన మనం పాప, పుణ్య కర్మల గురించి చాలా క్లుప్తంగా తెలుసు కున్నాము.

ఇప్పుడు జీవుడు జన్మ ఎలా తీసుకుంటాడో తెలుసుకుందాము.

ముందుగా జీవుడు (సోల్) తల్లి గర్భంలో ప్రవేశించి శుక్రశోణితముల ద్రవముగా ఒక రాత్రి గడిపి 5 రోజులకి ఒక బుడగలా ఏర్పడి పది రోజులు గడిచేసరికి రేగుపండు సైజులో పిండంలా మారతాడు. తరువాత మాంసం ముద్దగా మారి దానిపై కొన్ని పొరలు ఏర్పడతాయి.

మొదటినెలలో తల, రెండవ నెలలో కాళ్ళూ చేతులు, మూడవనెలలో గోళ్ళు, చర్మము, జుట్టు, నవరంధ్రాలు ఏర్పడతాయి. సప్తధాతువులు (రసం, రక్తం, మాంసం, అస్థి, మేధస్సు, మజ్జ, శుక్రం అనే 7 ధాతువులు) 5,6 నెలలో ఆకలి, దాహం కలిగి ఆ పిండం చుట్టూ ఒక మావి ఏర్పడుతుంది. అంతే కాకుండా బిడ్డ యొక్క కదలికలు కూడా తెలుస్తాయి.

ఇక 7వ నెల వచ్చేసరికి బిడ్డకు జ్ఞానం కలిగి తాను వున్న ప్రదేశం (మలమూత్రాలతో నిండి వుండటం వల్ల) శుభ్రంగా లేదని తెలుసు కుంటుంది. ఇలా 8వ నెల, 9వ నెల వచ్చేసరికి తానువున్న ప్రదేశం ఇరుకుగా అనిపించి బిడ్డ తల్లి గర్భం నుంచి ఎలా బయటపడాలా అని ఎదురు చూస్తూవుంటుంది.

ఇలా తొమ్మిది నెలల మూడువారాలకు బిడ్డ భూమ్మీదకు దిగ్విజయంగా రావటం జరుగుతుంది.

మొత్తం సృష్టిలో 84లక్షల జీవరాసులు వున్నాయని మన పురాణాలు

చెప్తున్నాయి. వీటిలో మానవ జాతి మాత్రం ప్రత్యేక స్థానం సంతరించుకుంది.

నిజానికి మానవ శరీరానికి అధిదేవత మనస్సు – ఈ మనస్సు మనలోని కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాల యొక్క అనుభవాలన్నింటినీ తనలోనే వుంచుకుని తనకు ఇష్టమైన విధంగా అనేక రకాలయిన ఆదేశాలను జారీ చేస్తూ వుంటుంది. వాటి వల్ల కలిగే కష్ట, సుఖాలు కూడా మనసు యొక్క కార్యకర్తలే. అలాగే మనలో కలిగే భావోద్రేకాలు కూడా మనస్సు ద్వారా సంక్రమించినవే.

మనః ఏవ మనుష్యాణాం, కారణం బంధమోక్షయోః

ఒక సమస్య వచ్చింది అంటే అది మనస్సులో నుంచే వస్తుంది. దానికి పరిష్కారం కూడా మనస్సులో నుంచే వస్తుంది. అయితే మనిషి మనస్సును నియంత్రించాలా లేక మనస్సే మనిషిని నియంత్రిస్తుందా? అనేది ఒక సందేహం.

నిజానికి మనిషే మనస్సును నియంత్రించటం ధర్మం. కానీ నూటికి 99 మంది మనస్సు చెప్పినట్టే విని అది ఆడమన్నట్టల్లా ఆడి వీరు ఆ మనసు ఆధీనంలోనే బ్రతికి వేయటం జరుగుతోంది. దీనివల్ల మానవుని యొక్క జీవితకాలం వ్యర్థమవుతోంది. గాలి కన్నా వేగంగా ప్రయాణించేది మనస్సు. ఈ మనస్సును నియంత్రించటం కష్టమే. కానీ ఇష్టంగా ప్రయత్నిస్తే అది కష్టమేమీకాదు.

మనస్సు, బుద్ధి, ఇంద్రియాలతో పాటు మన యొక్క నాలుకను అదుపు చేసుకుంటూ మంచి మాటలు, మంచి పూజలు, మంచి భజనలు, మంచి ప్రవచనాలు వీటిని వినటం, ఆచరించటం ద్వారా విన్న వాటిని పదిమందికి వినిపించటం ద్వారా పరమాత్మతో బంధం బలపరచుకుంటూ సన్మార్గంలో ప్రయాణించినట్లయితే భగవంతుణ్ణి దర్శించే మార్గం సుగమమవుతుంది.

అలాగ కాకుండా నాస్తికులమని చెప్పుకునే కొందరు మేధావులు నేను దేవుణ్ణి నమ్మను. నేను పొందాలనకున్న దాని కోసం ఎన్ని అడ్డదారులయినా తొక్కుతాను కర్మాలేదు, జన్మాలేదు, పునర్జన్మ అంతకంటా లేదు అనే మూర్ఖులు ఆఖరి దశలో పశ్చాత్తాప పడినా ప్రయోజనం ఉండదు.

ఉదా : 1. ఈ సృష్టి మొత్తం పరమాత్మ యొక్క స్వరూపమే. మనం అజ్ఞానమనే ముసుగులో వుండటం వల్ల పరమాత్మకి దూరమవటం జరుగుతోంది. అందువల్ల చెడుకు దగ్గరవటం కూడా జరుగుతోంది.

ఈ భూమ్మీద పుట్టిన ప్రతి వ్యక్తి ఏదో ఒక రోజున మరణించక తప్పదు. అలా శరీరం వదిలాక జీవుణ్ణి వుద్దేశించి పైలోకంలో మనం చేసిన తప్పు, ఒప్పులకు సాక్ష్యం చెప్పమని మనల్నే అడుగుతాడు భగవంతుడు. (ఇది ఎలా సాధ్యం అని అనుకుంటాం, భగవంతునికి సాధ్యం కానిది అంటూ ఏమీ వుండదు కదా?)

ఆ! మనతో పాటు మనకు తెలిసిన వాళ్ళెవరూ రాలేదు కదా! మనకి ఎవరు సాక్ష్యం చెప్తార్లే అనుకోవటం కూడా పొరపాటే. మన ఇంద్రియాలే మనకి సాక్ష్యం చెప్తాయట.

ఉదా : ముందుగా కళ్ళు అంటాయట ఓ భగవాన్! ఈ జీవుడు చేసిన పాపాలన్నీ నా కళ్ళతో నేను అనేకం చూసాను అంటాయట.

అలాగే చెవులు: ఓ భగవాన్ నేను కూడా జీవులు మాట్లాడే అవాకులూ, చవాకులూ, ఉన్నవీ, లేనివి, వినకూడనవి ఎన్నో మాటలు ఈ చెవులతో నేను అనేకం విన్నాను అంటాయట.

అప్పుడు మనసు చెప్తుందట ఓ దేవా! నన్ను మనిషి నియంత్రించాలి. కానీ నేను అహంకారంతో కూడినదానై నేను తెలిసి, తెలియక చేసిన పనులన్నింటినీ తనకు అనుకూలంగా మార్చుకుంటూ నన్ను ఒక కీలుబొమ్మని చేసి ఆటాడుకున్నాడు ఈ మనిషి. వీళ్ళు ఆడే నాటకాలు

చూస్తూ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఎంతక్షోభ అనుభవించానో తెలుసా అని వెక్కి వెక్కి ఏడుస్తుందట మనసు.

ఉదా : మనం ఒక నిర్మానుష్యమైన ప్రదేశంలో మసక చీకట్లో నడుస్తున్నాడు. కొంచెం దూరంలో ఒక పెద్ద భయంకరమైన ఆకారం కనిపిస్తోంది. దాని నుంచి ఈలలు వేస్తున్నట్టుగా వింత శబ్దాలు వస్తున్నాయి. ఆ ఆకారం అటూ ఇటూ వూగుతూ మనమీదకు వస్తున్నట్టుగా వుంది. (మనం ముందుకు వెళ్తుంటే అది మనకి దగ్గరవుతోంది అన్న భావన కలగలేదు) ఆ ఆకారం చూసే సరికి గుండె దడ, దడా కొట్టుకుంటోంది. గొంతు తడారిపోతోంది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

అదే సమయంలో ఆకాశంలో ఒక మెరుపు మెరిసింది. ఆ వెలుగులో మనకు దగ్గర్లో వున్నది. ఒక మహావృక్షమని తెలిసి ఒక్కసారిగా ప్రాణం లేచి వచ్చినట్లయింది. మన ఊహకు మనకే నవ్వు వచ్చింది. ఇది నిజమా అంటే కాదు అబద్ధం అన్నది పచ్చినిజం. ఈ మనస్సు మన కంటికి కనిపించకపోయినా ఇంద్రియాలన్నింటినీ తన అధీనంలో వుంచుకుని మనల్ని నడిపిస్తూ వుంటుంది.

మనిషి యొక్క దుఃఖానికి, అశాంతికి, ఘర్షణలకి కారణం మనస్సే. మోహానికి, ఆశలకి, కోరికలకి కారణం మనస్సే, లాభ, నష్టాలకి, బంధ, మోక్షాలకి, పాప, పుణ్యాలకి, స్వర్గ, నరకాలకి, శాంతి, అశాంతులకి, జ్ఞాన, అజ్ఞానాలకి, సంసారం అనే నాటక రంగానికి, భగవంతునికి, భక్తునికి మధ్య తెర మన మనస్సే. ఈ జనన మరణాలు వున్నంత వరకూ తప్పనిసరిగా మనస్సు వుంటుంది.

వీటి నుంచి మనం బయటపడాలి అంటే ఒక చక్కటి గురువును ఆశ్రయించాలి. ఆ సద్గురువు ద్వారా సంసారమనే విష సర్పం బారి నుంచి మనల్ని మనం రక్షించుకునేలా గురువును మార్గాన్వేషణ చేయమని ప్రార్థించాలి.

జీవితం అంటే ఎంతో వుంది. ఇప్పట్నుంచీ వైరాగ్యం, ఆధ్యాత్మికత అవసరమా? అని భావించే ప్రతివారూ ఒక్కసారయినా ఇందులోని భావాన్ని కొంతయినా గ్రహించగలరని ఆశిస్తున్నాను.

అసలు సనాతనధర్మం ఎప్పుడు పుట్టింది? ఈశ్వరుడు ఎప్పుడు పుట్టాడు. వేదం ఎప్పుడు పుట్టింది? అనేది మనలో చాలామందికి వచ్చే సందేహం. అలాగే గురువు అనేవారు ఎలా వుండాలి? ఎలాటి గురువును మనం ఎంచుకోవాలి? అసలు వివేక, వైరాగ్యాలు అంటే ఏమటి? మోక్షం కావాలంటే ఏం చేయాలి? అనేది మనం తెలుసుకోవాలి అంటే తప్పని సరిగా ఈ వివేక చూడామణి గురించి తెలుసుకోవలసిందే.

ముందుగా సనాతన ధర్మం అంటే ఏమిటి? వేదం ఎప్పుడు పుట్టింది? ఈశ్వరుడు ఎప్పుడు పుట్టాడు అంటే వీటికి సమాధానం ఎవరు చెప్పినా అనాది అనే చెప్తారు. అనాది అంటే అప్పుడు, ఇప్పుడు అనేది చెప్పలేనిది.

ముందుగా మనం పాపకర్మలు, పుణ్యకర్మలు గురించి తెలుసు కుందాము. అలాగే బంధమోక్షాల గురించి తెలుసుకుందాం (క్లుప్తంగా) పాపకర్మలు ఇనుపసంకెళ్లయితే, పుణ్యకర్మలు బంగారు సంకెళ్ళు. యదార్థమైన భగవంతుణ్ణి విడిచి విషయవస్తువుల వెంటపడి యదార్థమైన భగవంతుణ్ణి మర్చిపోతున్నాము. ఏ ఫలితాలయినా మనమే అనుభవించాలి.

కుటుంబ సభ్యులు కానీ, బంధుమిత్రులుకానీ, స్నేహితులు కానీ ఎవ్వరూ కూడా ఈ ఫలితాలను అనుభవించలేరు. ఎవరి ప్రారబ్ధం వారిదే.

ఉదాహరణ : ఒక దుర్మార్గుడైన హంతకుడి దగ్గర అనేకమంది కిరాయి హంతకులు పనిచేసేవారు. కానీ ఒక భయంకరమైన హత్యకేసులో అతన్ని మెస్మర్ పద్ధతి ద్వారా చంపటం జరిగింది. అతను హత్య చేసేటప్పుడు అవతలి వ్యక్తి పడే బాధను చూసి పరమానందాన్ని అనుభవించేవాడు. అది అతని వికృతానందం. కొంతకాలం తరువాత ఆ హంతకుని పాపం పండే రోజురానే వచ్చింది.

పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి ముందుగా హంతకుడి కళ్ళకు గంతలు కట్టి ఒకగదిలోకి తీసుకువచ్చి ఒక కుర్చీలో కూర్చోపెట్టి అతని శరీరం మీద మామూలు సూదులతో గుచ్చి 'ఇప్పుడు నీ శరీరంలోని రక్తాన్నంతా సిరంజీల ద్వారా తీసేస్తున్నాం నీ శరీరంలోని రక్తం అంతా బొట్లు బొట్లుగా బయటకు పోతుంది' అని చెప్పి నీరు బొట్లు, బొట్లుగా పడేలా అతని వెనకనున్న 5 కుళాయిలను తిప్పారు.

కళ్ళకు గంతలు వున్నందువల్ల ఆ హంతకుడు అ శబ్దం విని అది తన శరీరంలోని రక్తమే బొట్లు బొట్లుగా పడుతోందని భావించి తన శరీరం క్షణక్షణానికీ క్షీణించి పోతున్నట్లుగా ఊహించుకుంటూ నరకం అనుభవించసాగాడు.

దానికి తోడు అక్కడ వున్న పోలీసు ఆఫీసర్లు అరే చాలా రక్తం పోయిందే. ఇంకో పది, పదిహేను నిమిషాల్లో ప్రాణం పోయేలా వుందే అంటూ భయపెట్టడం సజెషన్స్ ఇవ్వటం ప్రారంభిస్తారు.

ఆ సమయంలో అతను అనుభవించిన మానసిక క్షోభ అంతా, ఇంతా కాదు. తను కిరాతకంగా చేసిన హత్యలన్నీ గుర్తుకు వస్తాయి. ఫలితం అనుభవంలోకి వచ్చేసరికి ఒంట్లో వణుకు వచ్చి భయం ఆవహించింది. అంతే మరో పది నిమిషాల్లో అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

చెడు కర్మ యొక్క ఫలితం ఎంత భయంకరంగా ఉంటుందో చావుతో కానీ అతనికి తెలియలేదు. అతని చుట్టూ వున్న కిరాయి హంతకులు కానీ, అతని భార్యా పిల్లలు కానీ, బంధుగణం కానీ ఎవ్వరూ ఆ సమయంలో అతన్ని ఆదుకోలేకపోయారు.

మరి ఇప్పుడు మనం మంచి కర్మ యొక్క ఫలితం కూడా తెలుసుకుందాం !

ఒక ఊర్లో ఓ రాజు గారు ఉండేవారు. ఆయన పాలనలో దౌర్జన్యం కానీ, హింస, మోసం కానీ ఏమీ వుండేవీ కావు. ఆ రాజ్యం అంతా రామరాజ్యంలా సశ్యశ్యామలంగా వుండేది.

ఆ రాజ్యంలోని ప్రజలందరూ ఎంతో వినయ విధేయతలు కలిగి ఆనందంగా జీవించేవారు. కొంతకాలానికి ఆయన కాలం చేసారు. ఆయనచేసిన పుణ్యకర్మల వల్ల ఆయనకి స్వర్గప్రాప్తి లభించింది.

ఆయన కొన్ని వేల సంవత్సరాలు స్వర్గభోగాలు అనుభవించారు.

ఒకరోజు ఆయన దగ్గరకు ఒక దేవదూత వచ్చి రాజా! మరి కొద్దిరోజుల్లో మీ పుణ్యఫలం అయిపోవచ్చింది. అందువల్ల మళ్ళీ మీరు భూలోకంలో పుట్టవలసి వస్తుంది. కాబట్టి మీరు సిద్ధంగా వుండండి అని చెప్పి వెళ్ళిపోయారు.

పాపం అంతవరకూ దైవసన్నిధిలో స్వర్గభోగాలు అనుభవించిన రాజు గారికి ఒక్కసారిగా విపరీతమైన బాధ కలిగింది. ఆ రోజు నుంచి రాజుగారు ఎవ్వరితోనూ కలవకుండా ఒంటరిగా శూన్యంలోకి చూస్తూ గడపసాగారు.

ఆదే సమయంలో నారదమహర్షి రాజుగారి దగ్గరకు వచ్చి రాజా! నువ్వు ఎందుకంత విచారంగా వున్నావు. నీలోని వుత్సాహం అంతా ఏమయింది. ఆని అడిగారు నారదమహర్షి.

అప్పుడు మహారాజు! నారదమహర్షీ నా విచారానికి కారణం నా పుణ్యకాలం ముగిసిందట. కొద్దిరోజుల్లో నేను మళ్ళీ భూలోకానికి వెళ్ళాలని చెప్పారు. నేను మహారాజుగా అన్ని భోగాలు అనుభవించిన వాణ్ణే. ఇవి నాకు కొత్త కాదు. ఈ దైవసన్నిధిలో ప్రశాంతంగా బ్రతుకుతున్న నాకు మళ్ళీ ఆ మురికికూపంలోకి వెళ్ళే ధైర్యం లేదు. దీని నుంచి నన్ను మీరే గట్టెక్కించండి అని వేడుకున్నాడు.

దానికి వెంటనే నారదమహర్షి! రాజా నువ్వు దిగులు పడకు అని

రాజుకి చెప్పి, ఇద్దరు దేవదూతల్ని పిలిచి ఈ మహారాజు పాలించిన రాజ్యానికి వెళ్ళి ఈ రాజు గారి గురించి రాజ్యంలో ఎవరయినా మాట్లాడు కుంటున్నారో లేదో చూసివచ్చి నాతో చెప్పండి అన్నారు.

నారదమహర్షి నోటివెంట ఆ మాటరాగానే రాజుగారిపై అపారమైన ప్రేమ కలిగిన ఆ దూతలు వెంటనే భూలోకానికి వెళ్ళి రాజ్యం మొత్తం గాలించారు. ఎక్కడా వారికి ఎలాంటి ఆచూకీ దొరకలేదు. (అప్పటికే కొన్ని వందల సంవత్సరాలు గడిచిపోయాయి). దేవదూతలు ఇద్దరూ నిరాశగా ఒక పెద్ద మహావృక్షం క్రింద అలిసిపోయి కూర్చున్నారు. ఇద్దరూ కూడా రాజుగార్ని ఎలా కాపాడాలా అని ఆలోచిస్తున్నారు.

ఇంతలో చెట్టుపై నివాసముంటున్న రెండు పక్షులు మాట్లాడుకోవటం వినిపించింది ఆ దూతలకి. ఆ పక్షులు తమ పిల్లలు బయటకు వెళ్ళి ఇంకా రాలేదని బాధగా ఎదురుచూస్తూ మాట్లాడుకుంటున్నాయి. ఇంత పొద్దుపోయింది. దారి తప్పాయో ఏమో పిల్లలు ఇంతవరకూ గూటికి చేరలేదు అని మాట్లాడుకుంటున్నాయి.

ఈలోగా రెండు పక్షిపిల్లలు కిలకిల రావాలు చేసుకుంటూ అక్కడికి వచ్చాయి. అప్పుడు తల్లి పక్షి పిల్లల్ని దగ్గరకు తీసుకుని అమ్మా! మీరు ఎంతకూ రాకపోయే సరికి మాకు భయం వేసింది. మీరేమైపోయరా అని అంది.

ఆ మాటలకి పిల్లపక్షులు అమ్మా! ఇలా దగ్గర్లోనే తిరిగి వద్దామని బయల్దేరాం! అలా కబుర్లలో పడి దారిమర్చిపోయాం. దిక్కుతోచక మేం అరుస్తుంటే ఒకసాధువు మమ్మల్ని పిలిచి ఎందుకు అరుస్తున్నారు అని అడిగారు. మేం జరిగిందంతా చెప్పాం. ఈ చెట్టు యొక్క గుర్తులు కూడా చెప్పాం. అప్పుడు ఆ సాధువుగారు ఆలోచించి ఈ వృక్షం ఫలానా రాజుగారు నాటించిన వృక్షమని చెప్పి ఈ దిక్కుగా వెళ్ళమని చెప్పారు. ఆయన చెప్పిన ప్రకారం వచ్చేసాము.. అన్నాయి.

అంతే చెట్టుక్రింద కూర్చున్న దేవదూతలిద్దరికీ అమృతం త్రాగినంత ఆనందంగా అనిపించింది. వెంటనే వారిద్దరూ స్వర్గానికి చేరుకుని నారదమహర్షికి జరిగినదంతా చెప్పారు.

వెంటనే నారదమహర్షి బ్రహ్మ, విష్ణు మహేశ్వరులకు చెప్పటం, అప్పుడు వారు. రాజుగారికి తిరిగి మళ్ళీ కొన్ని వేల సంవత్సరాలు స్వర్గప్రాప్తిని కల్పించటం జరిగింది.

దీనిని బట్టి మనకు ఏం తెలుస్తోంది అంటే మంచి పనుల యొక్క ఫలితం యుగయుగాలకీ మనల్ని రక్షిస్తూనే వుంటుంది.

ఇదేవిధంగా చెడు కర్మలయొక్క ఫలితం కూడా జన్మ, జన్మలకి వెంటాడుతూనే వుంటుంది. అందువల్ల పిల్లలుగా వున్నపుడే వారికి పాపపుణ్యాల గురించి, మంచీ చెడుల గురించి చెప్పి వారిని మంచి మార్గంలో నడిపించటం ఎంత అవసరమో ప్రతీవారూ ఆలోచించండి.

ఇక్కడ ఒక మహాకవి చెప్పిన కొన్ని జీవితసత్యాల గురించి తెలుసుకుందాం!

మానవుని యొక్క జీవితాన్ని ఏడుదశలుగా విభజించి ఒక్కొక్క దశలో ఆ వ్యక్తి ప్రవర్తన ఎలా వుంటుందో అద్భుతంగా చెప్పారు.

1) శిశుదశ : ఇది పురిటి బిడ్డ దగ్గర నుంచి మూడువారాలదాకా వుంటుంది.

2) శైశవం : ఇది మూడవ వారం నుంచి మూడు సంవత్సరాల వరకూ వుంటుంది.

3) పూర్వ బాల్యదశ : ఇది మూడు సంవత్సరములు నుంచి ఐదు సంవత్సరముల వరకూ వుంటుంది.

పై మూడుదశలూ మానవుని జీవితంలో ఏ ఇబ్బందీ లేని దశలు హాయిగా తల్లితండ్రుల పొత్తిళ్ళలో కాలం గడిచిపోతుంది.

ఇక ఉత్తర బాల్యదశ : ఇది 6 సంవత్సరముల నుంచి 10 సంవత్సరములు వచ్చేవరకూ వుంటుంది. ఇది చాలా ముఖ్యమైన దశ. ఈ దశలో జరిగే అనుభవాలు జీవితాంతం గుర్తుండిపోతాయి. ఈ దశ దాటేంత వరకూ పెద్దవారు, తల్లితండ్రులు వీరిని గాజుబొమ్మల్లా కాపాడుకోవాలి.

ఈ వయసులో పిల్లల్ని కొట్టటం, తిట్టటం, ఎదుటి వారితో పోల్చిహీనంగా చూడటం, సూటి, పోటి మాటలతో అవమానపరచటం, చెయ్యని తప్పులు వీరి మీద రుద్దటం ఇలాంటివి చేస్తే వారి పసివయసులో వారి మనసు గాయపడి వారిని బలహీనులుగా భయస్తులుగా, పిరికివారిగా, మొండివారిగా తయారుచేస్తాయి.

ఇక 15సం॥ల నుంచి 16 సం॥ల వరకు వయసు పిల్లలలో శారీరకంగానూ, మానసికంగానూ ఎన్నో మార్పులు వస్తాయి. ఈ వయసులో పిల్లలు ఎక్కువగా తల్లితండ్రులను, తమకన్నా పెద్దవారినీ గమనిస్తూ వారిని అనుకరించటానికి ప్రయత్నిస్తూ వుంటారు.

ఇది పిల్లల యొక్క జీవితంలో అత్యంత అమూల్యమైన దశ. అందువల్ల పెద్దవారు పిల్లలెదురుగుండా తిట్టుకోవటం, కొట్టుకోవటం, తరచూ బంధువులతోను, ఇరుగు పొరుగు వారితోనూ గొడవలు పడటం, వారికున్న వ్యసనాలను పిల్లలెదురుగా బహిర్గతం చేయటం, లేదా అతిగా కట్టడి చేయటం, అతిగా గారాబం చేయకూడదు. అలాంటి వాటి వల్ల పిల్లల జీవితంలో 90% ఈ సంఘటనలే వారిని దుష్టభావానికి గురిచేస్తాయి అన్నది నిజం. అంతేకాకుండా పిల్లలు మంచివారిగా తయారయినా, దుర్మార్గులుగా తయారయినా ఈ వయసులోనే జరుగుతుంది.

యవ్వనదశ : 11 నుంచి 13 సంవత్సరాలు

పూర్వ కౌమారదశ : 14 నుంచి 17 సంవత్సరాలు

ఉత్తర కౌమారదశ : 18 నుంచి 21 సంవత్సరాలు

వయోజన దశ : 21 నుంచి 40 సంవత్సరాలు

మధ్య వయసు : 40 నుంచి 60 సంవత్సరాలు

వృద్ధాప్యం : 60 నుంచి ఆఖరి మజిలీ వరకు

దీనికి సంబంధించి సరదాగా ఒక చిన్న కథ చెప్పుకుని సబ్జెక్టులోకి వెళ్ళిపోదాం !

బ్రహ్మదేవుడు సృష్టిని సృష్టిస్తూ ముందుగా ఒక గాడిదను పుట్టించాడట. ఆయన గాడిదను పిలిచి ఓ గాడిదా! నీకు 40 సంవత్సరాలు వయసు ఇచ్చాను. వెళ్ళిపో అన్నారట.

వెంటనే గాడిద తనయొక్క జీవితం ఎలా వుంటుందో అడిగి తెలుసుకుని అయ్యా! ఈ గాడిద బ్రతుకు చాలా దుర్భరంగా వుంది. 40 సంవత్సరాలంటే నాకు భరించే ఓపికలేదు. అందులో 40 ఏళ్ళంటే ఇంకా నరకం. అందువల్ల నాకు 20 ఏళ్ళు చాలు తండ్రీ అందట.

పాపం బ్రహ్మగారు గాడిదకేసి బాధగాచూసి ఓ గాడిదా! నీ కర్మఫలం కొద్దీ నీకీ జన్మ లభించింది. నేను మాత్రం ఏం చేయగలను అని చెప్పి, నెక్స్ట్ అనగానే ఒక కుక్క పరిగెత్తుకుంటూ వచ్చి లైన్‌లో నిలబడింది తోక వూపుకుంటూ.

ఓ కుక్కా నీకు 40 ఏళ్ళ వయసు ఇచ్చాను. హాయిగా బ్రతుకుపో అన్నారట.

కుక్కకూడా తన గురించి అడిగి తెలుసుకుని నాయనా నాకు ఈ కుక్క జన్మ ఏ పాపాల వల్ల వచ్చిందో తెలియదు కానీ ఎవరు ఏ పాడుపని చేసినా నీది కుక్కబుద్ధి, కుక్కతోకలా ఎప్పుడూ వంకరగానే వుంటుంది. ఛీ నీదీ ఓ బ్రతుకేనా అంటూ తిట్టిపోస్తారు. అందులో 40 ఏళ్ళు అస్సలు వద్దు. 20ఏళ్ళు చాలు అని బ్రతిమాలగానే బ్రహ్మగారు సరే 20ఏళ్ళు ఇస్తున్నాను ఫో అన్నారట.

మళ్ళీ నెక్స్ట్ అనగానే ఒక పెద్ద కోతి కుప్పిగంతులు వేస్తూ వచ్చి

నిలబడిందట. ఇప్పుడు బ్రహ్మగారు కోతి అడక్కుండానే దాని చరిత్ర మొత్తం చెప్పేసారు.

అదంతా విన్న కోతి ఓ బ్రహ్మదేవుడా! నా మీద ఎంతకోపం వుంటే మాత్రం నన్ను ఇలా పుట్టించటమే కాకుండా 40 ఏళ్ళ వయసు ఇస్తావా? చాల్లే నాయనా! నాకోతి బ్రతుకే ఘోరం. ఎవరు ఏ పని పనిచేసినా (అల్లరి) అది నచ్చకపోతే ఓరి కోతివెధవా! ఏంట్రా ఆ కోతి పనులూ, నువ్వూనూ, తోక ఒక్కటే తక్కువ వెధవకి స్థిరం లేదు అని తిట్టిపోస్తారు. అందువల్ల నాకు 20 ఏళ్ళు చాలు అన్న కోతితో సరే అన్నారు బ్రహ్మగారు.

అప్పుడు బ్రహ్మగారు కోతి వెళ్ళిపోగానే మహా అనందంగా ఆహ ఈ రోజు 60 ఏళ్ళు ఆదా చేయగలిగాను అని ఆనందపడిపోతూ నెక్స్ట అన్నారు పెద్దగా.

వెంటనే అక్కడ ఒక హుషారయిన మనిషి వచ్చి విలాసంగా నిలబడ్డాడు.

అతన్ని చూడగానే బ్రహ్మగారు మనిషి యొక్క చరిత్రను షార్ట్‌ఫిలింలా లైవ్‌లో చూపించారు.

మనిషి చూడటం అయిపోగానే బ్రహ్మగారు ఓ మనిషీ నీకు 40ఏళ్ళు వయసు ఇచ్చాను వెళ్ళిరా అన్నారు.

వెంటనే మనిషి బ్రహ్మగార్ని వుద్దేశించి అయ్యయ్యో బ్రహ్మయ్య అన్యాయం చేసావేమయ్యా అంటూ పాడటం మొదలు పెట్టాడు.

ఇప్పుడు షాకవటం బ్రహ్మగారి వంతయింది. మానవా ఏమయింది నీకు, అలా కుప్పిగంతులు వేస్తున్నావెందుకు అని అడిగారు ఖంగారుగా.

ఆ మాటకి మనిషి కనుబొమ్మలు ఎగరేస్తూ ఓయ్ బ్రహ్మ! ఎవరను కుంటున్నావ్. ఇక్కడ వున్నది మనిషి. మనిషి అంటే ఏంటనుకుంటున్నావ్. నాకు బుద్ధిని, జ్ఞానాన్ని ఇచ్చావ్. మంచి జ్ఞాపక శక్తిని ఇచ్చావ్. నేను ఎన్ని సాధించాలి. ఎంత దోచాలి. ఎంత దాచాలి. అంటూ ఆవేశంలో

మనిషి ఏవేవో నిజాలు మాట్లాడేస్తుంటే ఆశ్చర్యపోయిన బ్రహ్మగారు బాబోయ్ వీణ్ణి సృష్టించి నాకు నేనే ఎసరు పెట్టుకున్నానా ఏంటి అనుకుని..

ఓయ్ మానవా! ఇంకచాలు ఆపు, ఈ రోజు నేను 60 ఏళ్ళు ఆదా చేసాను అని ఆనందించేలోపే నా ఆనందాన్ని ఆవిరి చేసేసావ్. ఇదిగో నీకు ఇచ్చిన 40 ఏళ్ళకి ఈ 60 కూడా కలుపుతున్నాను. వెళ్ళు నాయనా వెళ్ళు అన్నారు బాధగా!

ఈ విధంగా భూమ్మీదకు వచ్చిన మానవుల జీవితం ఎలా వుంటుందంటే 1 నుంచి 25 వరకూ ఎవరో ఒకరి మీద ఆధారపడి హాయిగా బ్రతికేయవచ్చు.

25 నుంచి 40 ఏళ్ళ వరకూ ఉద్యోగాల వేట, సెటిలవటం. పెళ్ళి, గిళ్ళీ అంటూ గడిపేస్తాం.

మరి 40 నుంచి 60 వరకూ గాడిద జీవితం. అంటే ఉద్యోగంలో నిలదొక్కుకోవటం ఇల్లుకొనుక్కుని, పిల్లల్నికని ప్రమోషన్లు, ఎమోషన్లే కాకుండా పిల్లల చదువులు, కాలేజీ ఫీజులు, ఇంట్లో ఖర్చులు ఇలా ఎన్నో ఎన్నెన్నో సమస్యలతో సతమతమౌతూ పూర్తిగా సంసార భారాన్ని మీద వేసుకుని గాడిద చాకిరీ చేస్తూ గాడిదలా బ్రతుకుతాం.

మరి 60 నుంచి 80 వరకూ కుక్క జీవితం. ఎలాగంటే 60 ఏళ్ళ వయసు వచ్చేసరికి రిటైర్మెంట్ వచ్చేస్తుంది. ఆఫీసులో అందరూ కలిసి ఒక దండ వేసి ఒక శాలువా కప్పి ఒక బొకే ఇచ్చి నాయనా ఈ రోజు నుంచి హాయిగా ఇంట్లో విశ్రాంతి తీసుకో అని పంపేస్తారు.

నీరసంగా మొహం వేళ్ళాడేసుకుని ఇంటికి వచ్చేసరికి హాల్లో పడక కుర్చీ సిద్ధంగా వుంటుంది. ఇంక మర్నాటి నుంచి మొదలు కుక్క కాపలా.

నాన్నా! అమ్మా మేమూ బయటకు వెళ్ళి వస్తాం, ఆ పనిమనిషి వస్తే కొంచెం పని మనిషి చేత పనిచేయించేయ్ పాలవాడు పాలు తెస్తే

పోయించుకుని ఫ్రిజ్‌లో పెట్టెయ్. చాకలి బట్టలకి వస్తే రేపు రమ్మని చెప్పు. మా కోసం ఎవరయినా వస్తే బయటకు వెళ్ళారు... ఎప్పుడు వస్తారో తెలియదని చెప్పు అంటూ బయటకి వెళ్ళిపోతారు.

ఈరకంగా 60 నుంచి 80 వరకూ (ఇంకా ఎన్నోరకాలుగా) మనిషి బ్రతుకు కుక్క బ్రతుకేమరి. రిటైర్డ్ లైప్ కుక్క కాపలాకే సరిపోతుంది పాపం.

మరి 80 నుంచి ఆఖరిదాకా కోతిలాగే జీవిస్తాము. ఎలాగంటే పళ్ళన్నీ ఊడిపోతాయి. జీర్ణశక్తి నశిస్తుంది. శరీరం నుంచి దుర్గంధం వస్తూ వుంటుంది. నోటి నుంచి లావాకారుతూ ఒకచోట స్థిరంగా కూర్చోలేక, ఏ బాధ చెప్పుకోవాలన్నా వినేవారు లేక మనస్సంతా గందరగోళంగా వుంటుంది.

ఇంతటితో అయిపోలేదు. వీరికోసం ఓ మూల వేరే గది ఏర్పాటు చేస్తారు. అది తాతగది, మామ్మగది అంటారు. కొడుకులూ, కోడళ్ళూ, మనవల కోసం వచ్చే స్నేహితులుకి వీరు కనిపించకూడదు. పిల్లలప్పుడు తల్లితండ్రులు మా అమ్మాయి, మా అబ్బాయి, మా మనవలు, మా కోడళ్ళు, మా అల్లుళ్ళు అంటూ అడిగినా అడక్కపోయినా అందరికీ వీరిని పరిచయం చేసి వారు పొగుడుతుంటే వీరు భుజాలు గజాలు చేసుకుని ఆనందపడుతుంటారు.

అదే పిల్లలు పెద్దవారు ముసలివారయ్యే సరికి పరిచయాలు అవసరం లేకపోయినా, ఎవరయినా వచ్చినప్పుడు గదిలోంచి బయటకు వస్తే ఈసడింపుగా చూస్తూ వారు విసుక్కుంటుంటే ఆ జీవుడు అనుభవించే నరకం... ఎంత భయంకరంగా వుంటుందో మానవుడు వంద సంవత్సరాలు ఆయుర్దాయం అడిగినప్పుడు తెలుసుకోలేకపోవటం అనేది దురదృష్టమే కదా! హతవిధీ. ఎంత బాధ, ఎంత బాధ.

ఇదీ... మేధావిని అని చెప్పుకునే మానవుని యొక్క జీవితం.

ఇంతటి నీచమైన, భారమైన, ఘోరమైన బ్రతుకు, బ్రతుకుతూ కూడా కుడితిలో పడ్డ ఎలుకలా, సంసారమనే మహామురికి కూపంలో బ్రతుకుతూ క్షణాలూ, రోజులు, నెలలూ, సంవత్సరాలు వృథా చేసుకుంటూ పోతున్న మానవులను వీటి నుండి రక్షించటానికి వీరికి ఎలాంటి జీవితం అనుభవిస్తే మానవులు తరిస్తారో అటువంటి భక్తి, జ్ఞాన వైరాగ్యాలు మనకు ప్రసాదించటానికే శ్రీ శంకరాచార్యుల వారు మనకు ఈ జ్ఞాన సంపదను అందించారు.

మానవుని యొక్క ఈ శరీరం పంచేంద్రియములు, కర్మేంద్రియములు, జ్ఞానేంద్రియములతోను, చర్మము, రక్తము, మాంసము మొదలైన ధాతువులతోను తయారయింది.

ఈ శరీరం మట్టిలో నుంచి వస్తోంది. (మనం తినే ఆహారం మట్టిలోనే పుడుతోంది) మట్టిలోనే కలిసిపోతుంది. రక్త, మాంసాలు, చీమునెత్తురు, మలమూత్రాలతో తయారయిన ఈ శరీరం అందం అనీ ఆకర్షణ అనీ, తెలుపూ, నలుపు అనీ, లావూ, సన్నం, పేద, ధనిక, అసూయ, ద్వేషం, రాగం, మోహం, భోగం, కామం వంటి ఎన్నో మోహాలు కల్పించుకుంటూ వీటి ఆకర్షణలో పడి ఎన్నో పాపకర్మలు చేస్తూ దీపపు పురుగు మంటల్లోపడి ఎలా మరణిస్తుందో అదే చందాన మనల్ని మనం నాశనం చేసుకుంటున్నాము.

మన జీవితం చంచలంగానూ, క్షణికంగానూ, బాధాకరంగానూ వుంటుంది. మనం బ్రతకాలి అంటే డబ్బు చాలా అవసరం. కానీ డబ్బు సంపాదనే లక్ష్యంగా బ్రతకకూడదు. అసలు ఈ ధనాశ అనేది మనసులో ప్రారంభమైతే అది మనిషిని ఎంతకయినా దిగజారుస్తుంది. రక్తం రుచి మరిగిన పులిలా ధనాశ అనేది అందులోంచి బయటపడ నివ్వదు మనుష్యులను.

ఒక వ్యక్తి సంపాదించ కలిగిన స్థితిలో వున్నంత వరకూ చుట్టూ వున్న వారిని రంజింప చేస్తారు. అదే దేహం ముసలిదై జవసత్వాలూ కోల్పోయిన రోజున అందరూ చాకచక్యంగా తప్పుకుంటారు. మనల్ని ఏ రోజుయితే ముసలితనం అనే మొసలి పట్టుకుందో ఆ రోజు నుంచీ మనల్ని ఎవ్వరూ కుశలం కూడా అడుగరు.

శ్రీ ఆదిశంకరాచార్యుల వారు ఈ విషయం తెలిసినవారై ఈ విధంగా అన్నారు.

ఒక వ్యక్తి ఎవరికయినా ప్రియులు అవుతున్నారంటే అది కేవలం వారి దగ్గర వున్న ధనం, పలుకుబడి వల్ల మాత్రమే మనం ఈ విషయాన్ని ముందుగానే గ్రహించి నిరంతరం భగవన్నామాన్ని సాధన చేస్తూ భజనపరుల నుండి తప్పించుకుంటూ వుండాలి. ఎందువల్ల అంటే ఇలా సాధన చేసిన వారు మాత్రమే అంతిమ క్షణాలను విజయవంతంగా కాపాడుకోగలరు. అంటే మృత్యువు మన దగ్గర అపాయింటుమెంటు తీసుకునిరాదు కాబట్టి.

కనురెప్పపాటు కాలాన్ని మనం తిరిగి తీసుకురాలేము, గడిచిన కాలం తిరిగిరాదు. అలాగే ఈ వున్న సమయాన్ని వృథా చేసుకుంటే ఈ మానవ జీవితం వ్యర్థమైనట్టే. మనం ఈ జన్మలో చేసుకున్న సాధన పైనే మళ్ళీ జన్మ ఆధారపడి వుంటుంది.

చాలా మంది మనిషి జన్మతో సరి. ఇంక జన్మలు వుండవు అంటారు. కానీ ఆదిశంకరాచార్యులవారు కర్మలను అనుభవించటానికి అనేక జన్మలు ఎత్తాలి. అవి (కర్మలు) పూర్తిగా నశించాలి అంటే ముక్తి, మోక్షం ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది అని చెప్పారు.

వివేక వైరాగ్యముల ద్వారా మాత్రమే మోక్షం అనేది సాధ్యం. ఈ మోక్షసాధన మనకు కలగాలి అంటే ఆత్మే పరమాత్మ, జీవుడే దేవుడు, దేహమే దేవాలయం అని భావించి నిరంతరం భగవత్ చింతనలో

గడిపేవారికి మాత్రమే ఇది సాధ్యం కావచ్చు. ఇది శరీరంతో వుండగానే సాధ్యం కావచ్చు. అది కూడా శరీరం ఉన్నంత వరకే. ఒకసారి మృత్యువు ఒళ్ళోకి వెళ్తే ఇంక సాధన అనేది సాధ్యం కాదు.

పైగా మృత్యువు ఏ క్షణం ఎవర్ని వెంబడిస్తుందో ఎవరికీ తెలియదు కదా!

**ఉదా :** ఒక ప్రదేశంలో హోరున వాన పడుతోంది. ఒక చెఱువులోంచి ఒక బోదురు కప్ప బయటకు వచ్చింది. అది చాలా ఆనందంగా గెంతుతోంది.

ఆ కప్పను చూసి ఒక పాము కన్నంలోంచి బయటకు వచ్చింది. అబ్బ ఈ కప్ప ఎంత ఆరోగ్యంగా వుంది. ఈ రోజు నాకు పండగే అనుకుంది.

అలా కప్పను అనుసరిస్తున్న పామును చూసి ఒక ముంగిస అబ్బ ఈ రోజు దేవుడు నాకు ఎంత మంచి ఆహారాన్ని అందించాడు అనుకుంది. అలా అనుకుంటూ పామును వెంబడించింది.

ఆ ముంగిసను చూసిన నక్క మహా ఆనందపడుతూ దాని వెనుకే వెళ్ళ సాగింది.

ఇలా వెళ్తున్న నక్కను చూసి ఆకలితో నకనకలాడుతున్న ఒకపులి ఆబగా దాన్ని అనుసరించసాగింది.

ఆ పులిని చూసిన ఒక వేటగాడు తన పంట పండిందనుకుని బాణం ఎక్కుపెట్టి పులిని అనుసరించాడు.

ఇలా ఒకదాని వెనక ఒకటి వాటి ఆహారం గురించి అవి ఆరాటపడుతూ వెళ్తున్నాయి అని మాత్రమే మనకు అర్థం అయింది.

కానీ, ఇందులో మనకు అర్థం కాని విషయం ఒకటి వుంది. అలా కప్ప, పాము, ముంగిస, నక్క, పులి, వేటగాడు ఇవన్నీ ఒకదాని వెన్నంట ఒకటి మృత్యువుగా వెళ్తున్నాయి. దీనిని బట్టి మనకు తెలుస్తున్నది

ఏమిటంటే మృత్యువు మన దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకుని కానీ, మనకి చెప్పికానీ రాదు. మృత్యువు సమీపించే సమయం అసన్నమయితే ఆ వ్యక్తి వుండే ప్రదేశాన్ని కానీ, అతని పదివిని కానీ అతని ఐశ్వర్యాన్ని కానీ లెక్కచేయదు.

ఇది తెలుసుకున్న ప్రతివారూ ఎరుకతో వ్యవహరిస్తూ ఏ మంచిపని చెయ్యాలన్నా తిథి, వార, నక్షత్రాలు చూడకుండా వెంటనే ఆచరించటం చాలా మంచిది.

శ్రీ అది శంకరాచార్యులవారు ఈ గ్రంథములో కర్మ మార్గము, జ్ఞానమార్గము అనేవి రెండూ రాత్రీ పగలులాగ పరస్పర విరుద్ధములు అని తెలియచేసారు.

కాగా సాధన సంపత్తి కలిగిన జ్ఞానులకే ఈ జ్ఞానమార్గము అనగా సన్యాసులు, యోగులు, మొదలైనవారు.

(1) ప్రజ్ఞానం బ్రహ్మ (జ్ఞానమే బ్రహ్మ)

(2) అయం ఆత్మ బ్రహ్మ (నాలో ఉన్నది బ్రహ్మ)

(3) తత్వమసి (అది ఎవరో కాదు నువ్వే)

(4) అహం బ్రహ్మాస్మి (నేనే బ్రహ్మని)

ఇక మిగిలిన వారికి కర్మయోగము. ఏది ఏమయినా మనకర్మలను బట్టే మనకు జన్మలు కలుగుతాయి.

నిజానికి ఆత్మమాత్రమే నిత్యమైనదీ, సత్యమైనదీ, శుద్ధమైనదీ, స్వచ్ఛమైనదీ అనేది ఎవరయితే తెలుసుకుంటారో వారే జ్ఞానులు. ఈ ఆత్మకు జనన మరణాలతో సంబంధమే లేదు. ఇది శరీరం యొక్క వికారం మాత్రమే. ఈ తత్వాన్ని ఎవరయితే తెలుసుకుంటారో వారు మాత్రమే రాగ ద్వేషాలను సుఖదు:ఖాలను సమంగా స్వీకరించగలగుతారు.

అలాంటివారు జనన, మరణాలను అస్సలు లెక్కచేయరు.

మనం పాతబట్టలు విడిచి క్రొత్త బట్టలు ఎలా ధరిస్తున్నామో అలాగే శిథిలమైన ఈ శరీరాన్ని వదిలి క్రొత్త శరీరం ధరించటం కూడా వీరికి సహజంగా అనిపిస్తుంది.

**ఉదా :** మాళవదేశాన్ని ఒకరాజు అద్భుతంగా పాలించేవాడు. ఆయన పాలనలో రాజ్యం సస్యశ్యామలంగా వుండేది. అయితే ఆ రాజుగారికి సంతానం లేకపోవటం ఒక పెద్దలోటుగా వుండేది. ఒకరోజు ఆ దేశానికి ఒక మునిగారు వచ్చారు. రాజుగారు మునిగార్కి సకల మర్యాదలూ చేసి నమస్కారం చేసారు.

అప్పుడు మునిగారు రాజుగారితో రాజా మీరు ఏదో అశాంతితో బాధపడుతున్నారు అందరూ కుశలమేనా అని అడిగారు.

దానికి రాజుగారు మునీంద్రా! సకల సౌభాగ్యాలూ వున్నా నేను పుత్రభాగ్యానికి నోచుకోలేదు అని ఆవేదన వ్యక్తం చేసారు.

రాజా! మీరు రాజ్యాన్ని ఇంత బాగా నీతివంతంగా పాలిస్తున్నారు. మీ రాజ్యం ఇలాగే ఎప్పుడూ సస్యశ్యామలంగా వుండాలంటే మీ కోరిక తీరాలి. కాబట్టి మీరు పుత్రకామేష్టియాగం చేసి ఆ ప్రసాదాన్ని రాణీగారికి ఇవ్వండి. తప్పక మీకు పుత్రసంతానం కలుగుతుంది అని చెప్పారు.

మునిగారు చెప్పినవన్నీ క్షణాలమీద ఆచరించారు. రాణీగారు గర్భం ధరించారు. పండంటి మగబిడ్డ పుట్టాడు. ఆ ఆనందంలో రాజుగారు మిగిలిన ఇద్దరి భార్యల్ని అశ్రద్ధ చేసారు.

అది సహించలేని ఇద్దరు భార్యలూ ఆ పసిబిడ్డకు విషం పెట్టి చంపేసారు. రాజుగారు, రాణిగారూ శోకసముద్రంలో మునిగిపోయారు.

అదే సమయంలో ఆ రాజ్యానికి నారదమహర్షి వచ్చారు. రాజా! ఎందుకు ఇంత శోకంతో వున్నావు అని రాజుగార్ని అడిగారు నారదమహర్షి. రాజా భగవంతునిపై అచంచల భక్తి విశ్వాసాలూ, కలిగిన నువ్వు ఇలా విలపించటం తగదు. నువ్వు చాలా రోజులు సంతానం

లేరని దుఃఖించావు. ఈ రోజు ఆ దు:ఖానికి కారణం ఆ బిడ్డే కదా... పుత్రుడు లేని నాడూ దుఃఖమే, ఆ పుత్రుడు పోయాకా దుఃఖమే. ఈ మధ్యలో కొద్దిరోజులు మాత్రమే సంతోషం.

ప్రవాహంలో కొట్టుకుపోతున్న ఇసుకరేణువులు ఒక్క క్షణం కలుసుకుని ఎలా విడిపోతున్నాయో, ఈ చావు పుట్టుకలు కూడా అంతే. ఈ విషయాన్ని ఇప్పటికయినా గ్రహించి శోకం విడిచిపెట్టు అన్నారు నారదమహర్షి. అయినా రాజు యొక్క శోకం తీరలేదు. రాణీ గారి పరిస్థితి చెప్పనలవి కాదు.

అప్పుడు నారదమహర్షి ఒక అద్భుతం చేసారు. తన యొక్క తపో బలంతో ఆ శిశువు యొక్క జీవాత్మను తెప్పించి ఆ జీవాత్మతో నారద మహర్షి 'ఓ జీవాత్మా! ఇలా చూడు నీ తల్లితండ్రులు నువ్వు ఈ శరీరాన్ని వదిలి వెళ్ళినందుకు ఎంత శోకిస్తున్నారో. నీవు మళ్ళీ ఈ శరీరంలో ప్రవేశించి నీ తల్లితండ్రులను సంతోషపరచి ఈ రాజభోగాలన్నీ అనుభవించు' అన్నారు.

ఈ మాటలన్నీ విన్న జీవాత్మ! 'అయ్యా! నారదమహర్షీ.. మీకు నమస్కారములు. దేవయోనులలోనూ, మానవయోనులలోనూ, తిర్యక్ యోనులలోనూ ఎన్నో జన్మలు ఎత్తాను. ప్రతి జన్మలోనూ పుడుతూ చస్తూ వచ్చాను. ఏ జన్మలో ఎవరు తల్లితండ్రులో, ఎవరు బంధువులో ఎవరు అయినవారో ఎవరు కానివారో ఎవరికి తెలుసు. బంగారు ఆభరణాలు కొని అమ్మటంలో ఎలాగయితే చేతులు మారుతున్నాయో అలాగే ఈ జీవుడు కూడా నిత్య, శుద్ధ, ముక్త, స్వభావుడు.

ఈ జీవుడు ఎప్పుడూ వృదాశీనుడుగానే వుంటాడు. ఎలాంటి కర్మలు స్వీకరించడు. సుఖ, దు:ఖాలలో పాల్గొనడు. కాబట్టి మునీంద్రా! ఈ జనన మరణాల ఆటలో చాలా అలసిపోయాను. మీ తపోమహిమతో నన్ను రప్పించారు. అదే మహిమతో నాకు జన్మరాహిత్యాన్ని ప్రసాదించి

సెలవిప్పించండి' అని జీవాత్మ వెళ్ళిపోయింది.

ఈ అద్భుతాన్ని తిలకించిన రాజు, రాణిలకు కూడా జ్ఞానోదయం అయింది.

ప్రతివ్యక్తి నేను కష్టాలు పడుతున్నాను అని వాపోతూవుంటారు.

మనల్ని ఎవరయినా, ఏమయినా అంటే వాటిని తలుచుకుని పదే, పదే ఆలోచించి బాధపడకుండా మనం చేసిన పాప కర్మల పాపఫలం నశించిపోయింది అని, ఒక కష్టం తొలగిపోయిందని ఆనందించాలి.

ప్రతీవారూ తమ కష్టాలను ఇష్టాలుగా స్వీకరించటం మొదలుపెడితే అసలు కష్టం, కష్టంగానే అనిపించదు.

కాబట్టి వీటన్నిటి ద్వారా మనం తెలుసుకోవలసింది ఏమిటంటే నేను (అహం) అనే భావం విడిచిపెట్టి ఆత్మే పరమాత్మ అనేభావంతో పరిశీలిస్తే అంతా ఆత్మమయమే అనుభవంలోకి వస్తుంది. అది ఎలా అన్నది తెలుసుకోవాలంటే ఈ వివేక చూడామణిలోని కొన్ని ముఖ్యాంశాలు తెలుసుకుందాం!

వివేకము అంటే విచక్షణ అనియు చూడామణి అంటే పాపిటబిళ్ళ అని అర్థం. మనం భగవంతుణ్ణి దర్శించాలి అంటే విచక్షణ అనే జ్ఞానాన్ని చూడామణిగా ధరించాలి. శ్రీ ఆదిశంకరాచార్యుల వారు 153 గ్రంథాలు రచించారు. అందులో 72 స్తోత్రాలు, 24 భాష్యాలు, 57 ప్రకరణ గ్రంథాలు రచించారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలపై వ్యాఖ్యానాలు వ్రాసి ఆగిపోకుండా సాధనదశలో వున్న ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా అత్యద్భుతంగా రచించిన గ్రంథాలలో ఈ వివేక చూడామణి ఒకటి. ఇది చాలా ప్రసిద్ధిగాంచిన గ్రంథం.

మన యొక్క దు:ఖానికి మూలం మనలోని అజ్ఞానమే. అలాంటి అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానం పొందటం చాలా గొప్ప విషయం. అని తెలియచేసే గ్రంథమే ఈ 'వివేక చుడామణి' ద్వారా మనం తెలుసుకోవచ్చు.

ఏది ఆత్మ, ఏది అనాత్మ, ఏది శాశ్వతం, ఏది ఆశాశ్వతం అనేది తెలుసుకోవాలంటే తప్పనిసరిగా ఈ వివేకచూడామణి ప్రతివారూ తప్పకుండా చదవాలి.

మన అజ్ఞానానికి కారణం కేవలం ఇంద్రియాలు మాత్రమే. ఈ ఇంద్రియాలు ఎలాంటి వారినయినా సర్వనాశనం చేయకలవు. మనం చేయలేని పనిని ఎవరి చేతనయినా చేయించుకోవచ్చు. కానీ మన ఆకలి తీరాలంటే మనమే కడుపునిండా తినాలి కదా? అలాగే మనం జ్ఞానం పొందాలి అంటే దానికి తగ్గ కృషి మనమే చేయాలి. దీనికి వయస్సుతో కానీ, డబ్బుతో కానీ హెూదాతో కానీ, రికమెండేషన్లతో కానీ ఎటువంటి పనీలేదు. మన ప్రయత్నమే మనకు ముక్తి మార్గాన్ని ప్రసాదించే బంగారు బాట. ఇంతకు మించి వేరే దారీ, తెన్నూ లేదు అని ఖచ్చితంగా తేల్చి చెప్పారు శ్రీ ఆదిశంకరాచార్యుల వారు.

(అదే మనం చక్కటి గురువును ఆశ్రయించి వారి బోధనల ద్వారా మనలో వున్న ఆత్మను దర్శించగలిగితే పరమాత్మ సాక్షాత్కారం మనకు చక్కగా లభిస్తుంది).

❖ ❖ ❖

# వివేక చూడామణి

## శ్రీ గోవింద చైతన్యగారిచే చెప్పబడిన సత్సంగ సారాంశం

**వి**వేక చూడామణి అనే ఈ అమృతభాండం గురించి పూర్వజన్మ సుకృతం ఎంతో వుంటేనే కానీ ఇసుమంత భాగం కూడా మనకు అర్థంకాదు. ఇది ఒక మహాసముద్రమే కాదు. ఆదిశంకరాచార్యుల వారు ప్రసాదించిన పెద్ద నిధి.

ఈ వేదాంతము అనేది జీవనశాస్త్రం. ఈ వేదాంతసారాన్ని అపారమైనటువంటి ప్రజ్ఞా ప్రాభవాలతో మనకు అందించిన జ్ఞాననిధి శ్రీ ఆదిశంకరాచార్యులవారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతల మీద వ్యాఖ్యానాలు వ్రాసి ఆగిపోకుండా సాధన దశలో వున్న ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యేలా అద్భుతంగా రచించిన గ్రంథాలలో ఈ వివేక చూడామణి ఒకటి. ఇది ఎంతో గొప్ప పేరును కూడా సంతరించుకుంది. పేరుకు తగినట్టుగానే నిత్యా నిత్య వివేక జ్ఞానాన్ని కూడా మనకి అందించింది.

**ఉదా:** ఒక దీపం వెలిగించాలి అంటే కుంది, వత్తి, నూనే, అగ్గిపెట్టె వుంటేచాలు అనుకుంటాము. ఇది కేవలం మనం అనుకునేది మాత్రమే. నిజంగా మనం దీపం వెలిగించాలి అంటే భక్తి, వివేకం కలిగిన (కలిసిన) తైలం కావాలి. ఆ తరువాత సాధన, సంస్కారాల వల్ల దృఢపడిన వత్తి కావాలి. వత్తి కదలటానికి శుద్ధమైన గాలి కావాలి. ఇవన్నీ వుంటే సరిపోదు. ఇప్పుడు వైరాగ్యమనే దీపపు సెమ్మెకావాలి. ఇవన్నీ మనకు

దొరికినప్పుడు దీపం వెలిగించాలి అంటే రాగద్వేషాలు లేనటువంటి వాటివల్ల చిత్తం చెదిరిపోకుండా వుంటుందో అక్కడ మాత్రమే ఈ దీపం ప్రశాంతంగా  వెలుగుతుంది.

ఇంతటి సంస్కారవంతమైన దీపాన్ని మనం వెలిగించాలి అంటే భావంతో సహా ఈ శ్లోకాలను మనం అర్థం చేసుకోగలిగితే వేదాంతం అందించే అద్వైతసిద్ధాంతం అంతా, వలిచిన అరటిపండు తినటానికి ఎంత సులభంగా వుంటుందో అంత చక్కగా, సులువుగా అర్థం అవుతుంది.

అంతేకాకుండా సాధకులను తీర్చిదిద్దుతూ జీవితం మీద వారికి ఒక నిర్దిష్టమయిన క్రొత్త ధృక్పథాన్ని మనకు ప్రసాదిస్తుంది. మన జీవిత లక్ష్యము, మార్గము కూడా ఆదిశంకరాచార్యులవారు ఇక్కడ ఎంతో చక్కగా అద్భుతంగా, స్పష్టంగా మనకు అందించారు. దీనిని ఆచరించి నట్లయితే ఆధ్యాత్మిక జీవన విధానంలో ప్రగతిని సాధించటానికి మరే విధమైన సహాయ సహకారాలూ అవసరం లేదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

దీపం యొక్క లక్షణమేమిటంటే ఒక దీపం ద్వారా అనేక దీపాలను వెలిగించవచ్చు. కానీ ఒక బల్బు ద్వారా ఇంకో బల్బును వెలిగించలేం కదా? మన చుట్టూ వున్న చీకటిని తొలగించి వెలుగును ప్రసరింప చేసేదే దీపం. అలాగే మనలోని అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని బయటకు తీసే గురువు కూడా దీపమే అని. వివేక చూడామణిలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారు.  అద్భుతంగా  తెలియచేసారు.

# ఓమ్ శ్రీ గురుభ్యోనమ: !

సమస్త జన కళ్యాణే, నిరతం కరుణామయం !
నమామి చిన్మయం దేవం, సద్గురుం ప్రణతోస్మహం ॥

**(1) శ్లో॥ సర్వవేదాన్త సిద్ధాన్త గోచరంతమగోచరం !**
**గోవిన్దం పరమానందం సద్గురుం ప్రణతోస్మహమ్ ॥**

ఇంద్రియములకు గోచరించని వాడునూ, మనస్సుకు అందినటు వంటివాడును, వేదాంతమనబడే ఉపనిషత్తుల యొక్క సిద్ధాంతములచే తెలియబడేటి వంటివారునూ, అయిన సద్గురువు శ్రీ గోవింద భగవత్ పాదుల వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. శ్రీ శంకరుల వారుకూడా ఆయన గురువు అయిన భగవత్ పాదుల వారికి నమస్కరించటం జరిగింది.

ఈ నమస్కారాలు ముఖ్యంగా మూడు రకాలుగా చెప్పబడ్డాయి.

(1) నమస్కారము (2) ఆశీర్వాదము (3) వస్తునిర్దేశ్యము

ఒక వ్యక్తి మహామనిషి అయిన తన గురుదేవునికి నమస్కరించటం ఇప్పుడే చూసాము.

పూర్తిగా సంపూర్ణ జ్ఞానం కలిగినటువంటి వ్యక్తి అనంత సత్యమైన స్వరూపానికి నమస్కరించుట వల్ల మనుషులకు మార్గం చూపిస్తున్నారని కూడా చెప్పుకోవచ్చు.

ఈ విధంగా మనం అర్థం చేసుకున్నప్పుడు ఈ "అహం" అనే పదాన్ని మనస్సుకు, శరీరానికి అతీతంగా అపారంగా వున్న ఆత్మగా భావించాలి.

ఈ మనస్సు ద్వారా, శరీరం ద్వారా బయటకు చూస్తూ అహంకారంగా గుర్తింపబడే అహమే నేను అని అర్థం చేసుకోవాలి.

❖ ❖ ❖

**(2) జంతూనాం నరజన్మ దుర్లభమతః పుంస్త్వంతతో విప్రతా**
**తస్మాద్వైదిక ధర్మమార్గ పరతా విద్వత్వ మస్మాత్పరమ్**
**ఆత్మానాత్మ వివేచనం స్వనుభవో బ్రహ్మాత్మనాసంస్తితి ।**
**ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః పుణ్యై ర్వినా లభ్యతే ॥**

ఈ సృష్టిలోని అన్ని ప్రాణులలోకి మనుష్య జన్మ అనేది చాలా చాలా పుణ్యం వుంటే తప్ప లభించదు. ఈ మానవ జన్మలో కూడా పురుషుడుగా పుట్టటం అందులోనూ బ్రాహ్మణుడుగా పుట్టటం, బ్రాహ్మణ జన్మ ఎత్తటమే కాకుండా వైదిక ధర్మాచరణ కలిగి వుండటం మరీ ప్రయాసకరమైనది. వైదిక ధర్మం ఆచరించినా పరోక్ష జ్ఞానం కలిగి వుండటం, పాండిత్యం కలిగి వుండటం ఇంకా దుర్లభం.

నిజానికి ఈ మానవ జన్మ చాలా వుత్తమమైనది. ఎందుకంటే 84 లక్షల జన్మల తరువాత ఈ మానవ జన్మ అనేది లభిస్తుంది. అయితే ఈ జన్మలో మనం భగవంతుని తెలుసుకోవాలి అనే ప్రయత్నం చేయకుండా ఏదో సాధించాలి. ఎంతో గొప్పగా పేరు, ప్రతిష్టలతో బ్రతకాలి అని అంతులేని కోరికలతో ఉన్న ఈ సమయాన్ని వృథా చేసుకోవడం జరుగుతోంది.

ఈ ప్రపంచంలోని ప్రతి అణువూ మాయతో కప్పబడింది. ఇది అశాశ్వతమైనదే కాకుండా ఈ జనన, మరణాలతో కూడిన జీవితం అబద్ధం. ఇది సుఖ, దు:ఖాలకు నిలయం అనే విషయాన్ని మరచి పరస్పర విరుద్ధ భావాలతో, సంఘర్షణలతో కాలయాపన చేయటం జరుగుతోంది.

ఈ మానవజీవితంలో ఎన్నోరకాలయిన ఒడిదుడుకులు వస్తూ వుంటాయి. దానికి కారణం అశాశ్వతమైన విషయ వస్తువు మాత్రమే, శాశ్వతం అని భావించి వాటి వెంట పరుగులు పెట్టటమే కారణం.

ఏ ఒడిదుడుకులూ లేకుండా ప్రశాంతమైన జీవనం సాగించాలి

అన్నది ముందుగా తెలుసుకోవాలి. అంటే ఏది మనకు అవసరం ఏది పట్టుకుంటే మనం భగవదనుగ్రహం పొందగలం అనేది తెలుసుకోవాలంటే ఇందులోని మూలసూత్రాలు మనకు ఎంతో వుపయోగపడతాయి.

ఇవన్నీ ఇలా వుండగా ఏ ప్రాణికోటికయినా అధిష్టానం ఒక్కటే. అన్నింటి స్వభావము కూడా సత్యమే. అన్నీ కూడా ఆత్మమయమే. ఉదాహరణకి ఏ స్పర్శా, కదలికా లేని జడమయినటువంటి రాయిలో కూడా ఈ సత్యం అనేది వ్యక్తం అవుతూనే వుంటుంది. అయితే ఆ రాయి మాత్రం దీనిని తెలుసుకోలేకపోతోంది.

ఇంకా చెప్పాలంటే మనం ఒక గుడికి వెళ్ళాము అంటే ఆ గుడిలోని విగ్రహం ఒకరాయిచే చెక్కబడి వుంటుంది. అది కేవలం జడము అని మనకు తెలుసు. కానీ మనం గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని మనం మన యొక్క కోరికలు తీర్చమని మ్రొక్కుకుని వస్తాము. అవి ఖచ్చితంగా నెరవేరటం జరుగుతుంది.

ఇది ఎలా జరుగుతోంది. విగ్రహం జడం కదా అని మనకు ఒక సందేహం రావటం సహజం.

అయితే ఇక్కడ మనం ఒక నిజాన్ని గ్రహించాలి. ఏమిటంటే విగ్రహం పాదాల వద్ద బాణాలు అనేవి పెడతారు. ఈ బాణాలను వేదపండితులు వేదమంత్రోచ్ఛారణతో శాస్త్రోక్తంగా అనేక రకాలయిన పూజలు జరిపి ఆవాహన చేసి ప్రాణప్రతిష్ట చేయటం వల్ల ఆ విగ్రహాలకి ఆ శక్తి ఏర్పడటం జరుగుతోంది. దాని వల్ల మనకు ఎన్నో ప్రయోజనాలు కనిపిస్తున్నాయి.

జడమయిన రాయిలో కంటే కూడా జంతువులు, వృక్షాల దగ్గరకు వచ్చేసరికి చాలా తేడాలు కనిపిస్తాయి.

ఇలా రకరకాలుగా ఉన్న ప్రాణులన్నింటిలోకి ఒక్క మనిషి మాత్రమే

స్వతంత్రంగా ఆలోచించి బుద్ధిపరంగా తన నిర్ణయాలను తాను తీసుకోగలుగుతున్నాడు. ఇలా ఎందుకు జరుగుతోంది అంటే భగవంతుడు ఒక్క మనిషికి మాత్రమే పంచేంద్రియాలను ప్రసాదించి వాటితో పాటు బుద్ధి, జ్ఞానాన్ని మనం అనుభవించడానికి ఎన్నో భోగభాగ్యాలను అందించాడు.

భగవంతుడు ఇచ్చిన ఈ మేధాశక్తితో ఎన్నో వస్తువులను కనిపెట్టి, ఎంతో ప్రగతిని సాధించడమే కాకుండా సుఖాలకు సోపానాలు వేసాడు. తార్కికంగా ఆలోచించి బుద్ధి ద్వారా నిర్ణయాలు తీసుకోవడం వల్ల మనలో కలుగుతున్న మానసిక వుద్రేకాలను అదుపులోకి తెచ్చుకొని ఎంతో వుపయోగకరమైన సత్యాన్ని తెలుసుకోగలుగుతున్నాము.

మనం ఎన్ని సాధించినా, ఎంత ప్రగతి పథంలో నడిచినా, ఎన్ని సుఖదుఃఖాలు అనుభవించినా ఆ భగవంతుడు వ్రాసిన రాతను మాత్రం తప్పించుకోలేము, జీవుడు ఏదో ఒక రోజు ఈ శరీరాన్ని వదిలి వెళ్లటం తప్పదు అనేది జగమెరిగిన సత్యం దీన్ని మనం మర్చిపోతున్నాము.

మనం ప్రతిదినం, ప్రతిక్షణం, ప్రతి సెకనూ కూడా మనకు తెలిసీ తెలియక ఎన్నో కర్మలు చేస్తూ వుంటాము.

అందులో మంచి కర్మలు, చెడు కర్మలు అనేకం వుంటాయి. ఆయితే చాలామంది మనతో వచ్చేవి కేవలం కర్మలు మాత్రమే. అని చెప్తూ వుంటారు. కానీ చాలామందికి తెలియని విషయం ఏమిటంటే ఈ పాపపుణ్యాలతో పాటు పంచేంద్రియాలు కూడా మనవెంట వస్తాయి అనే విషయం తెలియదు.

మనయొక్క కర్మలను బట్టిరూపాలు మారినా పంచేంద్రియాలు మాత్రం మారవు. ఈ కారణాల వల్లే మానవ జన్మ చాలా ఉత్తమమైనది, పవిత్రమైనదీ అని మన మహర్షులు చెప్పటం జరిగింది.

ఈ మానవ జన్మే చాలా వుత్తమమైనది అనుకుంటే అందులో

బ్రాహ్మణుడుగా పుట్టడం అనేది ఇంకా వుత్తమమైనది. అయితే బ్రహ్మణుడుగా పుట్టినంత మాత్రాన కాదు.

మనోబుద్ధులకు వుండవలసిన ప్రత్యేక అర్హతలు కలిగి వుండటం, సంతోషం, సమాధానం, శాంతం ఈ మూడుగుణాలూ సత్వగుణంతో తాదాప్యం చెంది మనో, బుద్ధులతో వ్యక్తం అవటంచేత వీటిని మానవత్వ లక్షణాలు అనటం జరుగుతోంది.

ఈ మానవత్వ లక్షణాలు కలిగి సర్వవ్యాప్తి అయిన పరమాత్మయే సర్వస్వం అని తెలుసుకుని ఆ పరమాత్మను ఎవరయితే ఆరాధిస్తారో?, ఆ పరమాత్మ కోసం ఎవరయితే నిరంతరం శ్రమిస్తారో వారు మాత్రమే బ్రాహ్మణత్వానికి అర్హులు.

సర్వకాలసర్వావస్తల యందు మనం ఈ మనుష్యుల్ని పరిశీలించి చూసినట్లయితే వీరు మూడురకాలుగా కనిపిస్తారు.

(1) జంతు స్వభావం ప్రధానంగా కల మనుషులు.

(2) మానవత్వంతో మనుష్యులుగా అర్హత కలిగిన వారు.

(3) దైవత్వం అంటే ఇదేనేమో అనిపించే మహానుభావులు. వీరి గురించి మనం కొంచెం క్లుప్తంగా తెలుసుకుందాం!

(1) జంతు స్వభావం ప్రధానంగా గల మనుష్యులు : మనస్సును తమోగుణం పూర్తిగా కప్పివేస్తే అంతులేని వ్యసనాలకు (కోరికలకు) బానిసలై విచక్షణ లేకుండా ప్రవర్తించే వాళ్ళే వీళ్ళు. వీళ్ళే జంతువులతో సమానమైనవారు.

(2) మానవత్వంతో మనుష్యులుగా అర్హత కలవారు : వివేక విచక్షణలతో తమ స్వభావాన్ని అదుపులో పెట్టుకోగలిగిన వారిలో బ్రాహ్మణత్వం వున్నట్టే, వీళ్ళని నిస్సంకోచంగా మానవులు అనవచ్చు. ఈ వివేక, విచక్షణలు బాగా కనిపించాలి అంటే మనస్సు, బుద్ధి కూడా సత్వగుణం ద్వారా ప్రభావితం కావాలి. ఈ లక్షణాలు కలిగి వుండటాన్నే

బ్రాహ్మణత్వము అంటారు.

ఎవరయితే ఈ బ్రాహ్మణత్వాన్ని కలిగి వుంటారో వారికి మాత్రమే ఈ బ్రాహ్మణత్వాన్ని కలిగి వుంటారో వారు మాత్రమే. ఈ వేదాంతాన్ని సాధన చేయటానికి అర్హులు.

(3) దైవత్వం అంటే ఇదేనేమో అనిపించే మహానుభావులు : నిస్వార్ధ మయిన కర్మలు ఆచరించటం ద్వారా ఏకాగ్రతను పెంచుకుని సరయిన మార్గంలో శాస్త్రాన్ని బాగా అర్థం చేసుకుని ఏది నిత్యమో, ఏది అనిత్యమో తెలుసుకోగలిగిన వారు మాత్రమే మహానుభావులు అనబడుదురు.

వీరు జగత్ అంతా తనలో వున్న పరబ్రహ్మస్వరూపంగా గుర్తిస్తారు.

ఇవన్నీ ఇలా వుండగా మోక్షం కలగాలి అంటే 100కోట్ల జన్మలలో ఎంతో భక్తి, శ్రద్ధలతో చేయబడిన పుణ్యకర్మలచే తప్ప ఒక్కసారిగా మాత్రం ఎవ్వరికీ సాధ్యం కాదు.

❖ ❖ ❖

**(3) దుర్లభం త్రయమేవై తద్దే వానుగ్రహ హేతుకమ్ ।**
**మనుష్యత్వం, ముక్షుత్వం మహాపురుష సంశ్రయః ॥**

పైన మనం మనుష్యజన్మ చాలా అరుదుగా లభిస్తుంది. అది లభించాలంటే చాలా కష్టం అని తెలుసుకున్నాము.

ఎన్నో జన్మల పుణ్యఫలం వుంటేనే కానీ మానవ జన్మరాదు. ఈ మనిషి జన్మే గొప్పదనుకుంటే అందులో పురుషుడుగా పుట్టటం ఇంకా అదృష్టం. ఇంతటి మహత్తరమయిన జన్మ లభించటం వల్ల మనకు మహాపురుషుల యొక్క దర్శనభాగ్యం కలగటమే కాకుండా గొప్ప గొప్ప అవదూతలు, సిద్ధపురుషులు, మహాయోగుల గురించి తెలుసుకుని వారిని ఆశ్రయించి నట్టయితే మనకు ముక్తి, మోక్షం లభించటానికి మార్గం లభిస్తుంది.

నిజానికి ఇవన్నీ మనకు లభించాలి అంటే భగవంతుని యొక్క

అనుగ్రహం, కృప చాలా అవసరం అనేది నిజం (సత్యం) అని మనం తెలుసుకోవాలి. మరి ఇంత అద్భుతమైన మానవ జన్మ లభించినపుడు శాశ్వతం కానీ, క్షణికమైనటువంటి విషయ వస్తువుల మీద కోరికల్ని అదుపులో పెట్టుకుని క్షణికమూ, అశాశ్వతమూ అయిన ఈ జీవితపు పరిధి నుండి బయటపడాలని తీవ్రమైన కాంక్ష ఏకాగ్రత కలిగి జీవించా లనుకోవటం పై సాధన ప్రారంభించాలి.

ముఖ్యంగా ఈ ఆధ్యాత్మిక మార్గంలో మనం ప్రయాణించాలి అంటే ముందుగా మనలోని దురలవాట్లను పూర్తిగా వదిలెయ్యాలి. ఇలా వదలక పోయినట్లయితే ఓ ప్రక్క చేసే సాధన ద్వారా దుష్కర్మలు వదులుతుంటే మరో ప్రక్క ఆ అలవాట్ల ద్వారా అవి తిరిగి పేరుకుంటూ వుంటాయి.

**ఉదా:** ఓ పడవ నీళ్ళలో వున్నంత వరకూ అది క్షేమంగానే వుంటుంది. ఎప్పుడయితే ఆ పడవకి కన్నంపడి పడవలోకి నీరు రావటం మొదల వుతుందో. వెంటనే ఆ పడవ ప్రమాదంలో పడిపోతుంది. ఎప్పుడయినా సరే నీటిలో పడవ వుండాలి కానీ పడవలో నీరు వుండకూడదు. అలాగే మనిషి కూడా విషయవస్తువులపై పరిమితిని మించి ప్రేమని పెంచుకుంటూ పోతే పైవిధంగానే సంసారమనే సముద్రంలో మునిగిపోక తప్పదు.

కాబట్టి ఈ జీవితం యొక్క అర్థాన్ని మనం గ్రహించి ఆత్మజ్ఞానానికి ముక్తికి కనుక మనం ప్రయత్నించినట్లయితే జ్ఞాన స్వరూపుడయిన సద్గురువు మనకు లభిస్తారు. ఇలా సద్గురువు లభించాలన్నా కూడా దైవం యొక్క అనుగ్రహం మనకు పుష్కలంగా వుండాలి. దానికి తోడుగా శిష్యుని యొక్క సంకల్పబలం కూడా గట్టిగా వుండాలి.

ఇక్కడ దైవానుగ్రహం అంటే మనం చూడనటువంటి స్వర్గంలో కానీ, ఆకాశంలో కానీ, దేముడు తనకు ఇష్టమైన వాళ్ళకు ఇచ్చే వరాలు అర్థం చేసుకోకూడదు.

❖ ❖ ❖

**(4) లబ్ధ్వాకథంచిన్నర జన్మ దుర్లభం,**
**తత్రాపిపుం స్త్వం శ్రుతిపార దర్శనమ్ ।**
**యఃస్వాత్మముక్తౌన యతేతమూఢ ధీః,**
**సహ్యాత్మహాస్వం వినిహంత్యసద్గ్రహాత్ ॥**

పూర్వజన్మ పుణ్యఫలం అయితేనేం, భగవంతుని యొక్క అనుగ్రహం వల్ల అయితేనేం మానవులుగా పుట్టాం అనుకోండి. అంతమాత్రం చేత మనం ఎంతో అదృష్టవంతులం అనుకోవటం కేవలం మన అపోహమాత్రమే. ఈ మానవ జన్మ సార్థకం కావాలి అంటే శాస్త్రజ్ఞానాన్ని తెలుసుకుని మోక్షం కోసం సాధన చెయ్యాలి.

అలా కాకుండా ఈ బంధాలన్నీ శాశ్వతం మన చుట్టూ వున్న ఈ రంగుల ప్రపంచం అంతా శాశ్వతం అనుకొని ఈ సంసారమనే మహాసముద్రంలో ఎవరయితే కొట్టుకుపోతూ వుంటారో అలాంటి వారి జన్మ నిరర్థకం అంటారు శంకరాచార్యులు.

సంసార బంధాలు అనగానే కేవలం భార్యభర్తలు, పిల్లలు అనుకోకూడదు. బంధం అనేది దేనిమీదా కూడా వుండకూడదు. దేని మీద మనం బంధం పెంచుకున్నా మళ్ళీ అందులో మనం ఇరుక్కుపోవడం ఖాయం.

భగవంతుని దయవల్ల ఇంతచక్కటి అవకాశాన్ని, వరాన్ని పొందిన మనం ఈ మానవ జన్మ ఎత్తి ముక్తి, మోక్షం కోసం వుపయోగించుకోకుండా వున్న వారిని శ్రీ ఆదిశంకరాచార్యుల వారు మూఢదీ:, అన్నారు, (మూర్ఖులు అనటం ఎంతో అర్ధవంతంగా, సమంజసంగా వుంది అనటంలో అతిశయోక్తి ఇసుమంతయినా లేదు).

ఇలాటి అవకాశాలు మనకు పదేపదే లభించినా వాటిని మనం వుపయోగించుకోకుండా నిష్ప్రయోజనమైన ఈ జీవితాన్ని ఎందుకు గడుపుతున్నట్టు?

విషయవస్తువులు వ్యామోహం ఒక కారణమైతే, దివ్యమూ, పవిత్రమూ, సర్వవ్యాప్తమూ అయిన ఆత్మచైతన్యమే తాను అనే నిజాన్ని మర్చిపోయి, కొంతవరకూ పరిమితమైన, శరీరమూ, మనస్సు తను అనుకుని బ్రతకటం ఇంకొక పెద్దకారణం. అందరిలో సమానంగా ఉండేది. ఏమిటి అంటే, ఆత్మ మాత్రమే! అందరిలోనూ సమానంగా వుంటుంది అని చెప్పగలం అనేది సత్యం.

పైరెండు విషయాలతో పాటు అహంకార, మమకారాలు కలిసి అసలు నేను ఎవర్ని? నేను చేస్తున్నది ఏమిటి? అనే విషయాన్ని వదిలి ఈ విషయ వస్తువులు నిజం అనే భ్రమలో బ్రతుకుతున్నాం.

**ఉదా:** మన ఎదురుగా వున్న అద్దంలో వస్తువుల యొక్క ప్రతిబింబాలను చూసి ఆ వస్తువులు అక్కడ వున్నాయనే భ్రమలో వుంటాము. అలాగే మనస్సు, శరీరాల ద్వారా బయటకు చూస్తున్నపుడు మనవాసనలకి అనుగుణంగా అనేకమైన రూపాలు, అనంతమైన నామాలు మన మనసులో గుర్తించబడుతున్నాయి.

ఇలా గుర్తించబడిన నామరూపాలు మన ఇంద్రియాలకు తాత్కాలికమైన సుఖాలను అందిస్తున్నాయి. మన మనస్సుకు నచ్చిన వస్తువు వస్తే ఆనందం. అది అందకపోతే దు:ఖం! ఇలాంటి భ్రమను మనలో కలిగించి మనల్ని ఈ విషయ వస్తువులు మోహపరవశుల్ని చేస్తున్నాయి. ఇలాటి భ్రమలో పడి మనమనస్సుకు నచ్చిన వాటిని మన మనస్సు కోరుకుంటున్న వాటిని అందిస్తూ మన జీవితకాలం వృథా చేసుకుంటున్నాము.

ఇదంతా మిథ్య, మాయ అని తెలిసి కూడా మనం ఎండమావుల వెంట పరుగులు పెడుతున్నాం. ఆ తత్వం ఒక్కటే నిజమైనది. శాశ్వతమైనది ఆని తెలుసుకోకుండా అహంకార, మమకారాలతో భయంకరమైన జీవితాన్ని గడపడం ఆత్మహత్యేకదా?

నిజంగా ఆత్మను హత్యచేయటం కుదురుతుందా? కుదరదు. ఎందువల్ల అంటే.......

**ఉదా:** నేను గాఢనిద్రలో వుండగా ఒక కలగన్నాను. ఆ కలలో నేను ఒక మారుతీ కారు కొన్నాను. నాకు సరిగ్గా డ్రైవింగ్ రాకుండానే ఆ కారును హైవే మీదకు తీసుకువెళ్తే ఒక లారీ వేగంగా వచ్చి నా కారును గుద్దేసింది. యాక్సిడెంట్‌లో ఆ కారుతో పాటు నేను కూడా నుజ్జునుజ్జయి పోయాను. అంతే....

ఒకసారిగా మెలుక వచ్చి చూస్తే నేను నేనుగా హాయిగా వున్నాను. అంటే దీన్ని బట్టి మనకు అర్థం అయింది. ఏమిటంటే ఈ భయాలు, బాధలూ అన్నీ కూడా మన మనస్సు కల్పించే మాయాజాలం అనే విషయం మనకి తెలిసింది.

నిజానికి అసలు ఆత్మకు జననమరణాలతో సంబంధమే లేదు. అహంకారం మనకళ్ళకు పొరలా కప్పబడినప్పుడే కష్ట,సుఖాలు, భయాలు, బాధలూ అన్నీ అనుభవమవుతున్నాయి.

ఏ పనయినా మనకు అనుకూలంగా జరగకపోతే సమయం కలిసి రాలేదు. జాతకం బాలేదు అనుకుంటాము. ఒకవేళ అన్నీబాగున్నా ఏదయినా కొంచెం తేడావస్తే టైమ్ కలిసిరావటంలేదు అంటాము.

మంచికర్మలు (పుణ్యకార్యాలు) ఫలితం మంచిగానూ చెడుకర్మలు (పాపకర్మలు) యొక్క ఫలితం బాధాకరంగాను వుంటాయి. మంచికర్మల యొక్క ఫలితం బంగారు సంకెళ్ళుగానూ, చెడుకర్మల యొక్క ఫలితం ఇనపసంకెళ్ళు గానూ వుంటాయి.

అందుకే గురువులు చెప్తారు. మంచి కర్మ చేసే ముందు పదిసెకన్లు కూడా వృథాచేయకు. అదే ఏదయినా చెడు కర్మ చేసేటప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించు అంటారు.

అంతే కాకుండా శ్రీకృష్ణ భగవానుడు కర్మ నువ్వు చెయ్యి.. ఫలితం

నాకు వదిలెయ్యి అన్నారు. ఎవరయినా భగవంతుణ్ణి తలుచుకుని చెడు చేయలేరు కదా?

కొందరు వితండవాదం చేస్తూ వుంటారు. బ్రతికివుండగా తిండిపెడితే చాలు, మనిషిపోయాక ఈ కర్మలూ, గిర్మలూ ఎందుకు చేయటం అని.

పోయిన వారు ఇంకో జన్మ ఎత్తినా ఈ కర్మయొక్క ఫలం ఏ శరీరంలో (జీవుడు) వున్నా వారికి ముడుతుంది. అందువల్ల వారు ఆనందపడుతూ వుంటారు. అంతే కాకుండా ఎవరయితే ఈ కర్మకాండను నియమ, నిష్టలతో ఆచరిస్తారో వారికి, వారి కుటుంబ సభ్యులకు అందరికీ కూడా పుణ్యఫలం లభిస్తుంది. ఈ కర్మ ఆచరించటం వల్ల వారు చేసుకున్న కర్మల మూలంగా వారికి ఏ ఇబ్బంది ఎదురయినా మనం పెట్టిన ఈ కర్మ యొక్క ఫలితంగా వారికి ఆపూట ఏదో ఒకరి ద్వారా వారికి ఆహారం లభిస్తుంది అనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ప్రయత్నం + కాలం వుంటే సరిపోదు. ఈ రెండింటికీ అతీతమైనది ఇంకొకటి వుంది. అదే దైవశక్తి, శివుని ఆజ్ఞలేనిదే చీమయినా కుట్టదు అంటారు. దైవకృప కావాలి అంటే ప్రార్థన, భక్తి బావాలతో పాటు సంకల్పబలం కూడా ఎక్కువగా వుండాలి.

ఇవి మనకు లభించాలి అంటే ముందుగా మనయొక్క మనస్సును కంట్రోల్‌లో వుంచుకోవాలి.

❖ ❖ ❖

(5) **వదంతు శాస్త్రాణీయ జన్తుదేవాన్**
**కుర్వన్తు కర్మాణి భజన్తు దేవతాః !**
**ఆత్మైక్యభోధేనవినాపిముక్తిర్న**
**సిద్ద్యతి బ్రహ్మశతాన్తరేపి ॥**

కొంతమంది మందబుద్ధులయిన సాధకులు ఆధ్యాత్మిక సాధనలూ,

పూజలు, జపాలూ, వ్రతాలు, ఆచారాలూ, చాలా శ్రద్ధగా (పిచ్చిగా) పాటిస్తూవుంటారు. అలా కొన్నాళ్ళు చెయ్యగా, చెయ్యగా అది వారికి ఒక వ్యసనంలా మారిపోతుంది.

**ఉదా:** మందు తాగటానికి అలవాటు పడిన వ్యక్తి అది తాగకపోతే ఎలా వుండడో? అలాగే ఈ మందబుద్ధులయిన వారు కూడా వారు చేసే పనిలో ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా అవే కర్మల్ని మళ్ళీ మళ్ళీ చేస్తూ అర్థం పర్ధం లేని వ్యర్థమైన జీవితాన్ని గడుపుతూ మనకు లభించిన పుణ్యకాలాన్ని కాస్తా వ్యర్ధం చేసుకుంటూ వుంటారు.

అంతే కానీ మనం చేసే ఈ పనిలో ఏమయినా లోపాలు వున్నాఏమో ఒక్కసారి శాస్త్రం తెలిసిన గురువుగార్ని అడిగి తెలుసుకుందాం అని అనుకోరు.

మనం ఏదయినా ఒక పనికి (మంచయినా, చెడయినా) బానిసలం అయ్యామంటే మన బుద్ధి నిద్రావస్తలోకి వెళ్ళిపోతుంది. (అందుకే ఇలాంటి వారిని మందబుద్ధులు అన్నారు) ఇలా బుద్ధి ఎప్పుడయితే నిద్రావస్తలో పడిపోయిందో ఇంక మంచి, చెడులను తెలుసుకోలేదు. అందుకే బుద్ధికి ఏ మాత్రం ఏమరు పాటు కలిగినా పూజలు, వ్రతాలతో సహా అన్ని కర్మలూ యాంత్రికంగా మారిపోతాయి.

**ఉదా:** ఒక పుట్టలో ఒక పాము వుంది. పుట్టలో పామువుందని తెలుసుకుని దాన్ని చంపాలనుకుంటే పుట్టమీద కొడితే పాము చావదు కదా? పుట్టను త్రవ్వి పామునికొడితేనే కదా? పాము చనిపోయేది. (ఇక్కడ అర్థం పాముని చంపమని కాదు). మనం నోములూ, వ్రతాలూ, పూజలూ, పేరుతో ఉపవాసాలు చేస్తూ దేహాన్ని దండించినంత మాత్రాన ముక్తిరాదు. మన మనస్సులో వున్న కుళ్ళు, కుతంత్రాలను, మోసాలు, కల్మషాలను బయటకు తీసి జ్ఞానమనే కట్టతో బలమైన దెబ్బవేసినట్లయితే (ఆధ్యాత్మిక సాధన) అప్పుడు మనస్సు సన్మార్గంలో ప్రయాణించి ఓరి,

ముర్ఖుడా ఆత్మయొక్క స్వరూపాన్ని తెలుసుకో, ఆత్మవేరు, నీవు వేరు అని కాకుండా ఆత్మతత్వాన్ని అర్థం చేసుకో అని చెప్పారు శ్రీ శంకరాచార్యుల వారు.

❖ ❖ ❖

(6) **అమృతత్వస్యనాశాస్తి విత్తేనేత్యేవహిశ్రుతిః ।**
**బ్రవీతి కర్మణో ముక్తేరహేతుత్వంస్ఫుటం యతః ॥**

నిజం చెప్పాలంటే డబ్బులవల్ల కానీ, యజ్ఞయాగాదుల వల్ల కానీ నోములూ, వ్రతాలూ వంటి ఎన్నో మంచి కర్మలు చేసినా, ఎన్నివేల దేవతలను పూజించినా, ఎన్ని మతాలు మార్చినా వీటివల్ల (బంధ విమోచనం) మోక్షం మాత్రం రాదు.

మరి ముక్తి, మోక్షాలు పొందాలి అంటే కేవలం అహంకార మమకారాలు విడిచిపెట్టి మంచి మార్గంలో నడిచిన వారికి మాత్రమే మోక్షం లభిస్తుంది అనుకుంటారు. ఈ సృష్టిలో ధనం వల్ల అన్నీ లభించినా మోక్షాన్ని మాత్రం మనం డబ్బుతో కానీ, పూజలూ వగైరా కార్యక్రమాల వల్ల కానీ ఎట్టి పరిస్థితిలోను పొందలేము అన్నది మనకు ఇక్కడ స్పష్టంగా తెలుస్తోంది.

కానీ నేటి సమాజంలోని మానవులు మాత్రం మాయచే కళ్ళు కప్పబడి డబ్బులోనే సమస్తం వున్నాయనే భ్రమలో బ్రతుకుతున్నారు.

**ఉదా:** ఒకానొక సందర్భంలో భగవంతుడు మాయను పిలిచి మాయా, మాయా నీవల్ల నాకు చాలా అపకీర్తి వస్తోంది. నీవల్ల అందరూ నన్ను మాయోపాధి అంటున్నారు. కాబట్టి నువ్వు వెంటనే ఎక్కడికయినా వెళ్ళిపో, నువ్వు ఇంకెప్పుడూ నా వెంట జంటగా వుండకు, నన్ను వదిలి వెళ్ళిపో అన్నాడు.

మాయ వినయ విధేయలతో రెండు చేతులూ జోడించి మీ ఆజ్ఞ శిరసావహిస్తాను. కానీ మీరు లేనిచోటు ఎక్కడో చూపిస్తే అక్కడికి

వెళ్ళిపోతాను అంది.

ఆ మాటకు భగవంతుడు నవ్వి ఈ సృష్టిమొత్తంలో నేను లేనిచోటంటూ ఏదీ లేదు. నీవు లేని నేను లేను నేను లేని నీవు లేవు అన్నట్టుగా మనమిద్దరం జంటపక్షులం. కేవలం నీనుంచి వచ్చే సమాధానం కోసమే నీతో నేను అలా అన్నాను అన్నాడు.

ఇప్పుడు మనం మాయ అంటే ఏమిటి అన్నదాని గురించి తెలుసు కుందాం. అసలు మాయ అంటే లేనిది ఉన్నట్టు. ఉన్నది లేనట్టు తెలియ చేసేది. ఈ జగత్ అంతా మాయ ద్వారానే నడుస్తోంది. దేహాత్మ భావమే సంసార సుఖాల మీద వ్యామోహం కలిగించి రొంపిలో కూరుకుపోయేలా చేసేదే మాయ.

ఒక్కసారి ఈ మాయను తిరగవేస్తే ఏమౌతుంది?

“యమా” “య” అంటే ఏదీ “మా” అంటే లేదు. అంటే ఏదీ లేదు అని అర్థం. ఏదయితే లేదో అదేమాయ.

అయితే ఇక్కడ ఈ మాయను జయించటం ఎలా? అనే ఒక ప్రశ్న ఉద్భవిస్తుంది.

ఇది కేవలం దైవం యొక్క అనుగ్రహం వల్ల మాత్రమే మనకు లభిస్తుంది. మనలో వున్న దైవత్వాన్ని మనం తెలుసుకుని అనుభవంలోకి తెచ్చుకోవటమే మన జీవిత లక్ష్యంగా భావించి, శాశ్వతానందాన్ని ఇచ్చేది కూడా ఇదే అని తెలుసుకుంటే, వివేకం అనే నావలోనే జీవితం అనే సాగరాన్ని దాటటానికి మనం సాధన చేయాలి. అంతే కానీ ధనం లేని స్థితిని వూహించుకుని భయపడకూడదు.

**ఉదా:** ఆకాశాన్ని మేఘాలు బాగా దట్టంగా కమ్మేసి వున్నాయి. అయితే మబ్బులు ప్రక్కకు తప్పుకోగానే సూర్యుని యొక్క వెలుగు ఎలా ప్రకాశిస్తుందో అలాగే ఇదంతా మాయ అని మనం తెలుసుకోగలిగితే ఆనందమయ మయినటువంటి స్వస్వరూపం మనకు వ్యక్తం అవుతుంది.

**(7) చిత్తస్య శుద్ధయే కర్మ న తువస్తూపలబ్ధయే ।**
**వస్తు సిద్ధిర్విచారేణ న కించిత్కర్మకోటిభిః ॥**

పూజలూ, వ్రతములూ, నోములూ ఇవన్నీ కూడా అంత:కరణని శుద్ధి చేస్తున్నాయి కానీ కోట్ల కొద్దీ పుణ్యకర్మల ఫలం ఎంతవున్నా బ్రహ్మ సాక్షాత్కారం కలగదు. కర్మలవల్ల బంధాలు కలుగుతాయి. కానీ బంధ విముక్తి కలగదు. అందువల్లే అవదూతలుగా చెప్పుకునే జ్ఞానులందరూ కర్మబంధాలను శాశ్వతంగా వదిలివేస్తారు.

ఈ స్థాయికి ముక్కు మూసుకుని కూర్చుంటే చాలదు. అవిశ్రాంతమైన సాధన చాలా అవసరం.

సాధారణంగా మనలో చాలామంది ఏమనుకుంటారంటే మన కుటుంబంలోని వ్యక్తులు ఎవరయినా ఆధ్యాత్మిక విషయాల పట్ల ఎక్కువ మక్కువ (ఇష్టం) చూపిస్తున్నారు, అంటే వారు ఎక్కడ సన్యాసుల్లో కలిసిపోతారో అని భయపడిపోతూ వుంటారు.

నిజానికి ఈ వేదాంత అధ్యయనం వల్ల ముందుగా మనకు కొంత జ్ఞానం లభిస్తుంది. జ్ఞానర్జన పెరిగే కొద్దీ మనలో వున్న అహం(నేను) అనే భావన నశిస్తుంది. ఎప్పుడయితే ఈ నేను, నేను అనే భావన నశించి పోయిందో అప్పుడు వారు సన్యాసులు అవటం మాట ఎలా వున్నా "సన్నాసులు" మాత్రం కారు అన్నది నిజమైన నిజం.

**ఉదా:** ఒక రాజుగారు తన కొలువులో ఒక చక్కని సమావేసాన్ని ఏర్పాటు చేసారు. దానికి ఎందరో కవులు, పండితులు హేమాహేమీ లందరూ వచ్చారు. ఆ సభలో వేదాంత, పురాణ, ఇతిహాసాల గురించి అద్భుతంగా అందరూ చక్కగా మాట్లాడారు.

అవన్నీ శ్రద్ధగా విన్న రాజుగారికి ఒక సందేహం వచ్చి రాజుగారు! ఆ పండితోత్తముల్ని వుద్దేశించి అయ్యా! మీరందరూ మాట్లాడిన విషయాల వల్ల మీరందరూ గొప్ప జ్ఞానులని నాకు అనిపించింది.

మీరందరూ గొప్ప విషయసంపన్నులని కూడా తెలుసుకున్నాను. అయితే నాదొక సందేహం.

మీలో ఎంతమంది మోక్షాన్ని చేరుకోగలరో నాకు కొంచెం చెప్పండి అన్నారు రాజుగారు.

పండితులలో ఎవ్వరూ కూడా ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వటానికి ముందుకు రాలేదు. సభ అంతా నిశ్శబ్దంగా అయిపోయింది.

అంతటి నిశ్శబ్దాన్ని దూరం చేస్తూ సభలోని ఒక అతి సామాన్యమైన వ్యక్తి లేచి మహారాజా! 'నేను' పోతే పోవచ్చు అన్నాడు. సభలోని వారందరూ ఒకరికొకరు గుసగుసలాడుకోసాగారు.

మహారాజు ఆ వ్యక్తిని తనదగ్గరకు పిలిచి అయ్యా! మీరు ఏ ధైర్యంతో "నేను పోతే పోవచ్చు" అని పలికారు. మీరు ఆ మాట అన్నందువల్ల వీరందరూ కూడా అగౌరవ పడినట్లే కదా? అన్నారు రాజుగారు.

అప్పుడు ఆ పండితుడు లేచి రెండు చేతులూ జోడించి సవినయంగా నమస్కరిస్తూ అయ్యా! మహారాజా! నేను మాట్లాడిన మాటలోని భావం మీకు సవినయంగా వివరిస్తాను అని! మహారాజా!

నేను పోతే అంటే నాలో వున్న అహంకారం పోతే అని అర్థం. అహం ఈ దేహంతో చేరి అహంభావంగా మారుతుంది. ఎప్పుడయితే ఈ దేహాత్మభావం పోతేనే కానీ మానవులకి బంధవిముక్తి కలగదు. అందువల్ల ముందుగా మనం మనలో వున్న "నేను" (అహం) అన్న భావన పోవాలి. ఈ అహం పోయిన వారికి మాత్రమే బంధ విముక్తి లభిస్తుంది.

మనలోని అహంకార, మమకారాలవల్ల, మూర్ఖత్వం వల్ల మనం చేసే కర్మల యొక్క ఫలితాన్ని ఖచ్చితంగా అనుభవించి తీరాలి. ఏ కోరికలూ లేకుండా కర్మలు చేసేవారికి మనశ్శాంతి, ప్రసన్నత వస్తుంది ఈ వేదాంతం అనేది ఆత్మాభిమానానికి, నిష్కామ కర్మలకి ప్రత్యక్షంగా

సహాయపడదు. ఇవి మన అంతరంగాన్ని శుద్ధి చేసి అహంకార, మమకారాల నుండి ఆత్మను విడదీయకలిగే అవకాశాన్ని మాత్రమే ప్రసాదిస్తుంది అని చెప్పారు పండితులవారు.

పాపం మనలో చాలామంది పనికిమాలిన ఎన్నో విషయాలపై చూపించే శ్రద్ధ, ఆధ్యాత్మికత, వేదాంతము, అనే విషయాల దగ్గరికి వచ్చేసరికి బాబోయ్ వేదాంతమా! చాల్లే ఈ వయసు నుంచీ ఎందుకు ముందు, ముందు బోలెడు వయసుంది. ఈ వేదాంతంలో పడి ఆకులూ, అలమలూ తింటూ ముక్కు మూసుకుని కూర్చుంటే జీవితం ఏమైపోతుంది. ఎన్నో రేంకులుకొట్టాలి. దేశవిదేశాలూ తిరగాలి. రెండు చేతులా సంపాదించాలి. మనం కుడి, ఎడమ అనకుండా అనేకచోట్ల అనేకరకాల ఆస్తిపాస్తులు పోగెయ్యాలి అని పిల్లలతో పాటు తల్లి,తండ్రులు కూడా క్రిందా, మీదా పడిపోతూ వుంటారు.

ఈ ఆధ్యాత్మికత, వేదాంత ధోరణులలో మనం ఏ మార్గంలో ప్రయాణించినా మన పిల్లలు దారి తప్పకుండా సక్రమమయిన మార్గంలో వారి ప్రయాణం ఒడిదుడుకులు లేకుండా ప్రశాంతంగా సాగటానికి ఈ మార్గం ఎంతో ఉపయుక్తమైనది అనటంలో ఎటువంటి సందేహమూ అవసరం లేదు.

❖ ❖ ❖

**(8) శ్లో ॥ సమ్యగ్వి విచారతః సిద్ధారజ్జుతత్త్వావధారణా ।**
**భ్రాన్త్యోదిత మహాసర్పభయదుఃఖ వినాశనీ ॥**

మనం ఒక చీకటి ప్రదేశంలో (మసక చీకటి) అక్కడ ఒక సన్నని పొడవైన వస్తువు ఏదో గాలికి అటూ ఇటూ కదులుతూ వుంది. ఆ మసక వెలుతురులో అది మనకు పాములా కనపడింది. వెంటనే మనకు భయము. ఆ భయం ద్వారా దు:ఖము కలుగుతున్నాయి. ఇలా ఎందుకు

జరుగుతోంది అంటే మన యొక్క మనసు బుద్ధిని సరిగ్గా విచారించక పోవటం వల్ల మాత్రమే జరుగుతోంది.

ఈ మనస్సుని, బుద్ధిని కనుక మనం సరయిన మార్గంలో పెట్టి చూస్తే అది పాము కాదు తాడు మాత్రమే అనేది మనం తెలుసుకోగలుగుతాము.

ఎప్పుడయితే మనం తాడుని తాడుగా మాత్రమే చూస్తామో అప్పుడే మనలోని భయం పోతుంది.

ఏది నిజం, ఏది భ్రమ అనే నిజం తెలియని అజ్ఞానంలో పడి మనం కొట్టుకుంటున్నందు వల్ల మాత్రమే ఈ భయాలు, భ్రాంతులూ మనకు కలుగుతున్నాయి.

కాబట్టి అజ్ఞానమనే చీకటిని మనమనసులో నుంచి తొలగించి నట్లయితే ఈ నామ రూపాలూ, విషయవస్తువులు ఇవన్నీ భ్రమ, ఆత్మతత్వం మాత్రమే నిజం అని తెలుసుకోగలుగుతాం.

నిజానికి అక్కడ వున్నది పామా? కాదు, అయితే ఆ వ్యక్తికి నిజం తెలియకపోవటంతో ఆ తాడును పాముగా అనుకోవటంతో భయాన్ని, వేదననూ అనుభవించవలసి వచ్చింది.

వీటి నుంచి బయటపడాలి అంటే వివేక, వైరాగ్యాలతో నిజాన్ని (సత్యాన్ని) తెలుసుకోగలగాలి.

అంతే కాకుండా మనం నమ్మినటువంటి సద్గురువు యొక్క వుపదేశం వల్ల జనన మరణాలు, సంసారం, దు:ఖం, భయం అన్నీ తొలగిపోయి మనయొక్క యదార్ధస్థితిని బాగా తెలుసుకోవటంతో సంసారపరమైన అన్ని దు:ఖాలు నశించి బ్రహ్మసాక్షాత్కారం పొందగలుగుతాము.

❖ ❖ ❖

(9) శ్లో ॥ అర్ధస్య నిశ్చయోదృష్టో విచారేణ హితోక్తితః ।
న స్నానేన నదానేన ప్రాణాయమశతేనవా ॥

పవిత్రమైన గంగా, గోదావరి, కృష్ణా, యమునా ఇలా ఎన్నో నదులలో స్నానం చేసినా, ఎన్ని దానధర్మాలూ, యజ్ఞయాగాలూ, తపస్సులు, తీర్థయాత్రలూ చేసినా మనకు వీటివల్ల ముక్తి మాత్రం లభించదు. కేవలం స్వర్గప్రాప్తి మాత్రమే లభిస్తుంది. ఈ స్వర్గప్రాప్తి కూడా మన, శ్శరీరాలు పవిత్రంగా, నిష్కల్మషంగా వున్నప్పుడు మాత్రమే ఖచ్చితంగా లభించటానికి అవకాశం వుంది.

ఎల్.కె.జి. చదివే పిల్లలకు చెప్పే పాఠాలు యూనివర్సిటీలో చెప్తారా? చెప్పరు కదా! అలాగే సమర్ధుడయిన మంచిగురువు తనయొక్క శిష్యుల్లో వున్న పాత అలవాట్లను తెలివిగా చూపించి వాటి యొక్క పరిమితులనూ, ప్రయోజనాలనూ, గుర్తు చేసి బాగా మందలించి దురలవాట్ల నుంచి వారిని విముక్తుల్ని చేసి, స్వచ్ఛమూ, పవిత్రమూ, స్వతంత్రమూ అయిన వేదాంతపు మార్గం వైపు మళ్ళేలా చూడాలి.

**ఉదా:** ఒకసారి ఒక పశువుల కాపరి వుండేవాడు. ఆ పిల్లవాడు ప్రతిరోజూ పశువుల్ని తోలుకుని కొండ ప్రాంతానికి వెళ్ళేవాడు. ఒకరోజు ఆ పిల్లవాడికి ఏమీ తోచక ఒకపాటను పాడటం మొదలుపెట్టాడు. ఆ ప్రాంతం కొండప్రాంతం అవటం వల్ల ఆ పాట మళ్ళీ తిరిగి ప్రతిధ్వనించటం మొదలైంది.

అది తెలియని ఆ పశువుల కాపరి ఎవరో తనని అనుకరిస్తున్నారని భ్రమపడి గట్టిగా ఎవరక్కడ, ఎవరు నువ్వు అని అరిచాడు. అవే మాటలు తిరిగి మళ్ళీ వినిపించాయి.

దాంతో పశువుల కాపరి కంగారుపడి ఎవరో తనని వెక్కిరిస్తు న్నారనుకుని వాడిని పట్టుకోవటం కోసం వెతకసాగాడు.

అక్కడ ఎవరూ అతనికి కనపడలేదు. ఆ కనిపించని వాడెవరో తన

శత్రువనుకుని అందువల్లె తనని భయపెడుతున్నాడనుకుని గోవుల్ని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయాడు.

వెంటనే తన తల్లి దగ్గరకు వెళ్ళి అమ్మా! రేపట్నుంచి ఆ కొండ దగ్గరకు నేను వెళ్ళను. అక్కడ ఎవరో నేను మాట్లాడిందే మాట్లాడి నన్ను ఏడిపిస్తున్నాడు. చూద్దామంటే కనిపించటం లేదు. నాకు భయమేస్తోంది అన్నాడు.

బిడ్డ చెప్పింది అంతా తల్లికి అర్థం అయింది. అప్పుడు ఆమె కొడుకుతో నాయనా! నిన్ను ఎవరూ వెక్కిరించలేదు. తిట్టలేదు. వీటిని ప్రతిధ్వనులు అంటారు. మనం ఏ రకమైన ధ్వనులు చేస్తే ఆవే తిరిగి మనకు వినిపించటం జరుగుతుంది.

నాయనా! జీవితంలో కూడా ఏ ధ్వనులు, చర్యలు చేస్తే అవే (కర్మలు) మనకు తిరిగి వస్తాయి. వాటి ఫలితం కూడా మనం అనుభవించి తీరాలి అని నచ్చ చెప్పింది.

కాబట్టి నాయనా, నువ్వు తెలిసి కానీ తెలియక కానీ, ఎవ్వరికీ కూడా చెడు చేయటం కానీ, బాధపెట్టటం కానీ చెయ్యకు. మన జీవితంలో ఎదురయ్యే సుఖ, దు:ఖాలకు, మంచి చెడ్డలకూ కారణం మనం చేసుకున్న పనులే (కర్మలే). మన మంచి, చెడులకు ఎవరో కారణం కాదు. మనమే కారణభూతులమని మనం తెలుసుకోవాలి అంది తల్లి.

పూర్వజన్మ సుకృతం వల్ల మనకు ఈ మానవ జన్మ లభించింది. ఒక్క మానవునికి మాత్రమే ఆలోచించి నిర్ణయాలు తీసుకునే శక్తిని ఆ దేవుడు మనకు ప్రసాదించాడు.

అందువల్ల నువ్వు భగవంతుణ్ణి తలుచుకుంటూ హాయిగా నీ పని నువ్వు చేసుకో (గోవుల్ని మేపుకో)అని నచ్చచెప్పింది. వివేక వంతురాలయిన ఆ తల్లి.

❖ ❖ ❖

(10) **శ్లో ॥ అధికారణమాశాస్తే. ఫలసిద్ధిర్విశేషతః ।**
**ఉపాయా దేశకాలాద్యాః సన్త్యస్మినే సహకారిణః ॥**

ఎవరయితే బ్రహ్మజ్ఞానాన్ని సాధన చెయ్యాలనుకుంటారో వారికి వేదాంతపరమయిన అర్హత కావాలి. ఇందుకు దేశ, కాలమాన పరిస్థితులు కూడా సహకరించాలి. దీనివల్ల సాధకునికి శ్రద్ధ అర్హత లభిస్తుంది.

**ఉదా:** భర్త చేసిన పుణ్యంలో సగభాగం భార్యకు వస్తుంది. తల్లి,తండ్రులు పుణ్యం చేస్తే పిల్లలకూ వస్తుంది. అని చాలా మంది చెప్తూ వుంటారు. నిజానికి అది శుద్ధ అబద్ధం. ఎవరి పుణ్యం వారిదే, ఎవరి కర్మలూ వారివే. వాటి ఫలితాలు కూడా ఎవరికి వారే అనుభవించాలి. అంతే కానీ పెద్దవాళ్ళు చేస్తున్నారు కదా! మనకెందుకు అని భర్త చేసిన దాంట్లో మనకూ సగం వచ్చేస్తుందని భార్య మంచి కర్మలు చేయటం ఆపకూడదు. ఇంకో విషయం ఏమిటంటే మనం గురుముఖంగా నేర్చుకున్న ప్రతీ విషయాన్నీ సాధనలోకి మళ్ళించాలి. ఇలా చేసినట్లయితే బ్రహ్మజ్ఞాన్నాన్ని సాధించాలనుకునే వారి దారి పూలదారిలా హాయిగా మారుతుంది.

మన నిత్య జీవితంలో కూడా ఇదే మనకు వర్తిస్తుంది. మనం ఇష్టపడి ఒక మిషన్ కొనుక్కున్నాము. కొన్ని రోజులు బట్టలు బాగా కుట్టటానికి బాగా ఉపయోగపడింది. అనుకోకుండా ఒకరోజు దానికి రిపేరు వచ్చింది. మనకి తెలిసిన రిపేర్లన్నీ చేసాము. కానీ రిపేరవలేదు. అప్పుడు రిపేరు చేసే వ్యక్తిని పిలిచి చూపిస్తే వెంటనే అతను రిపేరు చేసి వెళ్తాడు. మళ్ళీ మనం వెంటనే కుట్టటం ప్రారంభిస్తాము.

ఇదే రకంగా సాధన చేయాలనుకున్న వ్యక్తి ధ్యానంలో కూర్చుని ఈ చోట బాలేదు, ఈ ప్రదేశం బాలేదు అని అనుకుంటూ బాధపడితే ప్రయోజనం వుండదు. అలాగే గురువుల్ని తిట్టి, శాస్త్రాన్ని బ్రష్టుపట్టిస్తే వుపయోగం వుంటుందా? అంటే ఖచ్చితంగా వుండదు. పైగా పాపం

కూడా వస్తుంది. చిత్తశుద్ధి నిజాయితీ కల సాధకులు వైరాగ్యము కలిగి నిర్మలమైన ప్రదేశములో కూర్చుని సాధన చెయ్యాలి. ఇలా సాధన చేస్తూ, చేస్తూ వుండగా బ్రహ్మజ్ఞాన ఫల ప్రాప్తి లభిస్తుంది.

❖ ❖ ❖

**(11) శ్లో ॥ అథౌ నిత్యా - అనిత్య వస్తువివేకః పరిగణ్యతే ।**
**ఇహా - అముత్ర ఫలభోగ విరాగః తదనాంతరం ।**
**శమ్ ఆది షట్క సంపత్తిః ముముక్షత్వం ఇతిస్ఫుటం ॥**

ఈ ఆధ్యాత్మికపథంలో మనం ఒక గమ్యాన్ని చేరాలి అని కనుక అనుకున్నట్టయితే ముందుగా మనం తెలుసుకోవలసింది ఏమిటి అంటే ఏది నిత్యమైనది, ఏది అనిత్యమైందో అని గ్రహించి నిత్యమైన దానిని గట్టిగా పట్టుకుంటే వైకుంఠపాళీలో నిచ్చెన్లు ఎక్కి ఏ పాము నోట్లోనూ పడకుండా జాగ్రత్తగా ఆడి గెలుస్తాము. అలాగే అనిత్యమైన అశాశ్వితమైన ఈ “అసత్”ను కనుక మనం పట్టుకున్నట్టయితే పై మెట్టు మీద నుంచి జారిపడిన బంతివలె ఒక్కొక్కమెట్టు క్రిందకు జారి పాతాళానికి జారిపోతాము అందువల్ల ముందుగా మనం ఏది నిత్యం, ఏది అనిత్యమో తెలుసుకునే వివేకాన్ని ఆశ్రయించాలి.

ఈ భూలోకంలో కానీ పరలోకంలో కానీ విషయ, వస్తువులమీద కలిగే కోరికలపై విరక్తి కలగాలి. మనకు ఈ లోకంలో మనసు దిగజార్చే విషయవస్తువులు అనేకం వున్నాయి. వాటిని చూసి భ్రమలో పడి అవన్నీ మాకు వుంటే ఎంత బాగుండును అనుకుంటాము.

**ఉదా:** మనం కొంతధనం (5 లేదా 6 లక్షలు) తీసుకుని అమెరికా వెళ్తాము. అక్కడ డబ్బులు ఖర్చుపెడుతూ అక్కడ వున్న దృశ్య ప్రపంచాన్నంతా చూసి ఆనందిస్తాము. కొన్నిరోజులకి మనం తీసుకువెళ్ళిన డబ్బులు టికెట్‌కి మాత్రం సరిపడమిగిలాయి అనుకోండి.

అప్పుడు మనం ఏం చేస్తాము మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చేస్తాము.

అలాగే మనం పుణ్యాలు చేసి స్వర్గానికి, పాపాలు చేసి నరకానికి వెళ్ళినా దాని ఫలితం కూడా ఆ పాపపుణ్యాలు ఖర్చయిపోగానే మళ్ళీ వెనక్కిరాక తప్పదు.

దీనిని బట్టి మనకు ఏం తెలుస్తోంది అంటే ఆ విషయ వస్తువుల వల్ల ఇహలోక, పరలోక సౌఖ్యాల వల్ల కలిగే అనుభవాలు అంతా అశాశ్వతం అని గ్రహించి వాటిపై విరక్తి కలిగి వుండాలి. ఈ విధంగా వివేకం నుంచి కలిగిన విరక్తినే "వైరాగ్యం" అంటారు.

నిజానికి ఈ వివేకం అనే పునాది ఎంత ధృడంగా వుంటే వైరాగ్యం అనే గోడలు అంత బలంగా వుంటాయి.

మనం ఇప్పుడు సాధనా చతుష్టయం గురించి తెలుసుకుందాము. (1) వివేకము (2) వైరాగ్యము (3) శమాదిషట్క సంపత్తి (4) ముముక్షుత్వము (5) తితిక్ష (6) సమాధానం మొదలయినవి. వీటినే శమాదిషట్క సంపత్తి అంటారు.

ఇంక ముముక్షుత్వం అంటే ఏమిటి? ఈ ముముక్షుత్వం కలగిన వారికి మోక్షం పట్ల ఆసక్తి ఎక్కువగా వుంటుంది.

మనం ఎక్కువగా కర్మలనేవి కోరికలతో చేయటం జరుగుతుంది. దానివల్ల మన అంతరంగంలో ఉద్రేకాలు, సుఖదు:ఖాలు వస్తాయి. దాంతో మన మనసంతా పాడైపోయి అల్లకల్లోలం అయిపోతుంది. దీనివల్ల మనబుద్ధి ఆందోళనకు గురవటం జరుగుతుంది. మనల్ని మనం ఒక నాలుగు రోజులు గమనించుకున్నట్లయితే ఇవన్నీ అనునిత్యములని దీని గురించి ఆందోళన అవసరం లేదని మనకే తెలుస్తుంది.

ఎప్పుడయితే ఇవన్నీ నిజాలు అని మనం తెలుసుకున్నాక చేయవలసింది ఏమిటంటే వివేక, వైరాగ్యాలు కలిగి అన్ని విషయాలనూ గమనిస్తూ దేనిమీదా కూడా రాగద్వేషాలు లేకుండా సమచిత్తం కలిగి

ఉండటం చాలా అవసరం అనేది తెలుసుకోవాలి.

ఇక్కడ ఒక చిన్న కథ చెప్పుకుందాం : ఒక కుమ్మరి కుండలు తయారు చేస్తూ ఒక కుండను అడిగాడట.

ఓ కుండా, కుండా నేను నిన్ను కేవలం మట్టితో మాత్రమే తయారు చేస్తున్నాను. నువ్వు ఎంత వేడిలో వున్నా, చలిలో వున్నా చల్లగా ప్రశాంతంగా ఎలా వుండగలుగుతున్నావ్? ఇది ఎలా సాధ్యం అని అడిగాడట.

అప్పుడు ఆ కుండ చల్లగా ఇలా అందట. నాయనా, నేను ఎప్పుడూ ఒకే విషయం గుర్తుపెట్టుకుంటాను. నేను వచ్చింది మట్టిలో నుంచి మళ్ళీ వెళ్ళేదీ మట్టిలోకే మధ్యలో ఈ అహంకారం, మమకారం, రాగద్వేషాలూ ఇవన్నీ అవసరమా అనుకుంటాను అందట.

ఈ రకమైన జీవితాన్ని గడపగలగటానికే ఈ వివేక, వైరాగ్యాలు మనకు ఎంతో వుపయోగపడతాయి.

❖ ❖ ❖

**(12) శ్లో ॥ బ్రహ్మసత్యం జగన్మిద్యేత్యేవం రూపోవినిశ్చయః ।**
**సో2యం నిత్యా నిత్యవస్తు వివేకః సముదాహృతః ॥**

ముందుగా మనం బ్రహ్మం అంటే ఏమిటో తెలుసుకుందాం! ఈ బ్రహ్మము జ్ఞాన స్వరూపము. దానితో సమానమైనదీ కానీ, ఎక్కువైనది కానీ ఏదీ లేదు. కాబట్టే ఈ బ్రహ్మము అద్వితీయమైనది. జ్ఞాన సంకోచం కలిగి వున్న జీవులకు వికాసము కలిగించేదే బ్రహ్మము. ఇది సృష్టికి పూర్వమే ఉంది.

బ్రహ్మమూ, పరమాత్మ, భగవంతుడు ఈ మూడు ఒకే తత్వాన్ని సూచించినా జీవులకు మోక్షం కలగించేది బ్రహ్మమనీ, జీవులలో ప్రవేశించి నియమించేది పరమాత్మ అనీ, దోషం లేని కళ్యాణ, గుణాలు

కలిగి వున్నది భగవంతుడు అనీ వ్యవహారంలో కనపడుతున్నాయి.

సృష్టి చేయాలనే సంకల్పం కలిగినప్పుడు దానికి అనువైన సమయంలో పరమాత్మ రజోగుణ ప్రధానమైన బ్రహ్మదేముని శరీరమందుండే జీవునితో కలిసి జగత్తుని సృష్టించటం జరుగుతుంది. అలాగే ఉపసంహారం చేయాలనుకున్నప్పుడు తమోగుణ ప్రధానమైన శివుని యందుండే జీవునితో కలిసి లయం చేస్తాడు.

మన ఋషులు జీవిత తత్వాన్ని, సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించారు. ఈ సత్యం అనేది పరిణామ రహితమయినదని గతమంతా సర్వవ్యాప్తమనీ నిర్ధారించారు. మన అంతరంగంలో సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించారు. ఎప్పుడయితే అంతరంగంలో వున్న జీవనతత్వపు సత్యాన్ని అర్థం చేసుకోవటానికి ప్రయత్నించామో అప్పుడు అదే సత్యం ఎప్పుడూ స్థిరంగా వుంటూ అనేకంగా వ్యక్తం అవుతూ వుంటుంది.

ఈ పరమ సత్యాన్నే మన వేదాంత పరిభాషలో ''బ్రహ్మం'' అంటున్నాము. బ్రహ్మం అనగా సాక్షాత్తూ ఆ పరబ్రహ్మ యొక్క స్వరూపము అని తెలుసుకుని ఆయన గురించి తెలుసుకోవటానికి ఇష్ట పడుతున్నాము. కానీ ఆయన్ని పొందటానికి ప్రయత్నం చేయటం లేదు.

నేను వేరు, భగవంతుడు వేరు అనే భావన ఉంటేగానీ మనం ముందుగా భగవంతుని గురించి సాధన చేయలేము. మనం కలగంటాము. మనకు మెలుకువ వచ్చేవరకూ అది కల అని మనకు తెలియదు. ఈ జగత్ అంతా మిధ్య, బ్రహ్మం ఒక్కడే నిజం, అనేది సాధన దశలో వున్నవారికి అర్థం అవటం కష్టం. కాబట్టి ఈ పూజలూ, వ్రతాలూ, దీక్షలూ, ఉపాసనలు, ఆరాధనలు జ్ఞానం కోసం చేసే సాధన మాత్రమే.

చాలా మంది హిందూమతంలో ఇందరు దేవుళ్ళు, ఇందరు దేవీ, దేవతలూ అవసరమా అని వెటకారిస్తూ వుంటారు?

ఒక్క దేవుణ్ణి పూజించినా అనేకమంది దేవీ, దేవతలను పూజించినా భగవంతుడు ఒక్కడే. కానీ నామ, రూపాలు మాత్రం అనేకం వున్నాయి. ఎవర్ని పూజించినా మనకు అందే ఫలితం ఒక్కటే. అది కేవలం మనం చేసుకున్న పూర్వజన్మ కర్మల యొక్క ఫలం మాత్రమే.

ఈ సాధన అనేది చిన్నవయసు నుంచీ మనం మన పిల్లలకి నేర్పించాలి. రామాయణం, మహాభారతం, భాగవతంలోని చక్కని కథలు చెప్తూ వారికి మంచీ, చెడులతో పాటు ధర్మాన్ని ఎలా ఆచరించాలి, ధర్మరక్షణ కోసం ఏం చేయాలి, కష్టాల్లో వున్నవారికి ఏ రకంగా మనం ఉపయోగ పడాలి. మానవసేవ, మాధవ సేవల వల్ల మనలో ఎలాంటి సంస్కారాలు ఏర్పడ్డాయి అనేది బాల్యం నుంచీ కూడా పిల్లలకు పెద్దవారు శ్రద్ధగా నేర్పాలి. అప్పుడే వారి జీవితం అర్ధవంతంగా సాగుతుంది. అప్పుడే భగవంతుడు మనల్ని ఇష్టపడి మంచి కర్మఫలాలను మనకు ప్రసాదిస్తాడు.

**ఉదా:** ఒక రోజు భగవంతుడు శక్తిస్వరూపిణి ఆయిన జగన్మాతతో ఇలా మొరపెట్టుకున్నాడట.

అమ్మా! ఈ భక్తులు నన్ను ఒక్క క్షణం కూడా ప్రశాంతంగా వుండనీయటం లేదు. వాళ్ళ కోరికల చిట్టా చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా గాబరాగా వుంది. పూర్వం నా భక్తులు ఎక్కువమంది ఆయురారోగ్యాలూ అడిగేవారు. ఇప్పుడు అలా కాదు. వారి కోరికలన్నీ హైటెక్ లెవెల్‌లో వుంటున్నాయి. నాకు అస్సలు విశ్రాంతి అనేదే కరువయింది. కొన్నాళ్ళు ఎక్కడికయినా దూరంగా పారిపోవాలని వుంది అని బాధపడ్డాడట.

అప్పుడు ఆ జగన్మాత! నాయనా, ఇంత చిన్న విషయానికా నువ్ ఇంత బాధపడుతున్నావ్. నువ్వు ఎంత దూరం వెళ్ళినా నీకు భద్రత లేదు. కానీ నీకు మంచి చోటు చూపిస్తాను. ఇంతకన్నా నీకు సురక్షితమైన ప్రదేశం ఎక్కడా దొరకదు. అసలు నిన్ను ఎవ్వరూ పట్టుకోలేరు. ఇది 100% నిజం అని నవ్వింది అమ్మవారు.

భగవంతుడు అమ్మమాటలకి సంతోషంతో ఉబ్బితబ్బిబై అమ్మా! ఆ చోటు ఏదో నాకు తొందరగా చూపించు అన్నాడట.

నాయనా క్షణం ఆలస్యం చేయకుండా నువ్వు వెళ్ళి మానవుల హృదయంలో దాక్కో ఈ మానవులు తమ హృదయాల్లో తప్ప అన్ని చోట్లా నీ గురించి వెతుకుతూనే వుంటారు. అదే నీకు మంచి చోటు అని చెప్పింది.

ఇది కథగా మనం చెప్పుకున్నా నూటికి నూరు శాతం పచ్చినిజం. మనం మనలోనే భగవంతుడు వున్నాడన్న విషయం మర్చిపోయి, ఏ మార్గంలో వెతికితే ఆయన దర్శనం మనకు లభిస్తుంది అన్నది వదిలేసి మితిమీరిన కోరికలతో హుండీలో ఇంత పర్సంట్ వేస్తాం, అంతపర్సంటు వేస్తాం అని లంచాలు చూపిస్తూ మనల్ని మనం మోసం చేసుకోవటమే కాకుండా ఆ భగవంతుణ్ని కూడా దూరం చేసుకుంటున్నాము.

ప్రతీ వారికి భగవద్దర్శనం కావాలి కానీ ఆయనని తెలుసుకోవాలి అని కోరుకునే వారు తక్కువ.

❖ ❖ ❖

**(13) శ్లో ॥ తద్వైరాగ్యం జహాసాయా దర్శన శ్రవణాదిభిః ।**
**దేహాది బ్రహ్మ పర్యంతే హ్యనిత్యే భోగవస్తుని ॥**

క్షణికమూ, అశాశ్వతమూ అయిన ఈ కంపుకొట్టే శరీరం మొదలు బ్రహ్మపర్యంతం వరకూ కల వస్తువులన్నీ కూడా అంటే రకరకాల మాటల్ని వినటం, విషయ వస్తువుల్ని చూడటం వాటివల్ల మనకు లభించే ఇంద్రియ సుఖాలను, దేహం దగ్గర మొదలుపెట్టి బ్రహ్మపదవి వరకూ మనకు లభించే సర్వసుఖానుభవాలు కూడా అనిత్యమే బాబూ, వాటికి బానిసకాకుండా వాటి మీద కోరిక లేకుండా చూసుకోవాలి. అప్పుడే వైరాగ్యం ఏర్పడుతుంది. వస్తువులలో ఆనందం లేదనీ, వస్తువులను చూసే

మనదృష్టిలోనే ఆనందం వుందనీ మనం తెలుసుకోగలగాలి.

**ఉదా:** (1) ఏ సారా నుంచి భయంకరమైన దుర్గంధం వచ్చునొ అది త్రాగితే ఎలాంటి సుఖం కలుగుతుందో త్రాగుబోతులకు తప్ప వేరెవరికీ తెలియదుగా.

(2) దేనినయితే మనం చూడగానే మనకు వాంతి వచ్చి అసహ్యం పుడుతుందో అలాంటి మాంసంలో ఏమి రుచివుందో జంతువుల్ని, పశుపక్ష్యాదుల్ని క్రూరంగా, నిర్ధాక్ష్యణ్యంగా చంపుకు తినే వారికి తప్ప ఇంకెవ్వరికీ ఎలాగయితే తెలీదో...

(3) అలాగే మన శరీరములో ఏ అంగముల నుండి దుర్గంధ పూరితమగు మలమూత్రాలను, అశుచిపదార్ధాలను స్రవించుచుడనో వాటి సేవనాస్పర్మాదులచే ఏ సుఖము కలుగునో దాని యొక్క అనుభవము సంసారకాముకులకు తప్ప ఇంకెవరికి తెలుస్తుంది.

అలాగే భగవంతుని గురించి ప్రతిక్షణం కథలు, పద్యాలు, గీతాలు, శ్రావ్యాలరూపంలో వినటంలోను, చదవటంలోను, పాడటంలోనూ ఎంత అద్భుతమైన ఆనందం, సుఖం కలుగుతుందో ఆ ఆనందాన్ని అనుభవించే భక్తులకు తప్ప ఇంకెవరికి తెలుస్తుంది.

ఈ విషయం తెలియని లోకులు ఏమయ్యా! విషయ వస్తువులు, ఇంద్రియభోగాలు, వివేక వైరాగ్యాలూ, ముక్తి, మోక్షం అంటూ చెప్పిందే చెప్పి తిప్పి, తిప్పి చెప్తావు. ఇవన్నీ ఒక్కసారి వింటే చాలదా? పదే, పదే వినాలి అంటావేంటి? అని ప్రశ్నిస్తే దానికి సమాధానం ఏమిటంటే....

స్వతహాగా ఎవరికి ఇష్టమైన దానిమీద వారికి ఎప్పటికీ తృప్తి అనేది వుండదు. పైగా అది వ్యసనంగా మారుతుంది. మనం రోజూ ఎంత తృప్తిగా భోజనం చేసినా మళ్ళీ సాయంత్రానికి ఆకలివేస్తుంది కదా? అలాగని తృప్తిగా తినటం మానేయలేదు కదా? ఆహార, విహారాల పట్ల మనం ఎలాగయితే శ్రద్ధ వహిస్తున్నామో అలాగే భగవంతుని పట్ల ముక్తి,

మోక్షాల పట్ల కూడా అంత శ్రద్ధ తప్పనిసరిగా చూపించాలి.

ఈ చరాచర సృష్టిలో అనేక రకాలయిన మనుష్యులు వుంటారు. డబ్బున్నవారు తమ వద్ద వున్న డబ్బుతో తృప్తిపడతారా? పడరు. వేలువున్నవారు లక్షలు, లక్షలు వున్నవారు కోట్లు కోసం తాపత్రయపడుతూ, ఆ సంపాదన కోసం పోరాటపడుతూ జీవితం ముగించుకోవటం జరుగుతోంది. ఇలాంటి సంసారిక వ్యసనపరులు అనేకమంది వుంటారు.

అయితే భగవంతుని సన్నిధియందు గడపాలన్న కాంక్షకలిగి, ఆయనను కలుసుకోవాలనే జిజ్ఞాసతో తపించేవారూ, ముక్తి, మోక్షాల కోసం నిరంతరం పోరాటం జరిపేవారూ ఆత్మే పరమాత్మ ఆ పరమాత్మను దర్శించుకోలేని నా జన్మ ఎందుకు అని ఆత్మజ్ఞాన ప్రాప్తికై పరితపించే వారు ఎవరయినా మనకు ఎదురయితే వారు కేవలం మనుష్యరూపంలో వున్న బ్రహ్మయే అని మనం తెలుసుకోవాలి.

❖ ❖ ❖

**(14) శ్లో ॥ విరజ్య విషయ వ్రాతాదోషదృష్ట్యా ముహుర్ముహుః ।**
**స్వలక్ష్యేనియతావస్థా, మనసః శమ ఉచ్యతే ॥**

మన మనస్సు యొక్క ప్రశాంతమైన స్థితిని శమము అంటారు. ఈ సంసార తాపత్రయాలకు చెందిన సమస్త ఇంద్రియ విషయములందు కలిగే అలజడుల నుండి ఈ మనస్సుకి విముక్తి కలిగినపుడు మనస్సు ప్రశాంతంగా మారిపోతుంది. ఈ మనస్సు ఎప్పుడయితే ప్రశాంతంగా మారిందో అది ధ్యానానికి అనుకూలంగా మారుతుంది. దీనినే శాంతి (శమం) అంటున్నారు.

మనం ఈ విషయ వస్తువులు ఇవన్నీ నిజం కావు అని తెలుసుకుని ఎంత దూరంగా వున్నా మన యొక్క మనస్సులో నుంచి మాత్రం ఈ ఆలోచనలు తొలగిపోవు. అంటే మన స్వభావమే నిత్యం పనికిమాలిన

ఆలోచనలతో సతమతమౌతూ వుండటం. అలాటప్పుడే ఇది ఇంతేలే, ఈ మనస్సు మనం చెప్పినట్టు వినేరకం కాదు అని వదిలివేయకుండా మనం సక్రమమైన దారిలో పెట్టుకోగలిగితే సక్రమమైన మార్గంలో ప్రయాణం చేస్తుంది.

**ఉదా:** (1) మనకు ఒక రసగుల్లా తినాలనే కోరిక బలంగా కలుగుతుంది. సరే కదా అని తింటాము. మర్నాడు మళ్ళీ తినాలనిపిస్తుంది. ఇంట్లో అవి అయిపోతాయి. ఆ రసగుల్లా మీద కోరిక పెరిగిపోతుంది.

అప్పుడు బయటకు వెళ్ళే సమయం కాదు. కానీ మనస్సు అల్లరి చేస్తోంది. కోరిక రూపంలో పదే పదే రసగుల్లా కావాలంటోంది. అలాటప్పుడు మనం మనస్సుని కంట్రోల్‌లో పెట్టుకోవాలి. ఓ మనసా రసగుల్లా కావాలంటే నువ్వు వెళ్ళి తినేసి హాయిగా వచ్చెయ్. ఈ సమయంలో నేను బయటకు రాలేను అంటే ఆ మనసు బయటకు వెళ్ళలేదు కాబట్టి చచ్చినట్టు మనం ఎలా చెప్తే అలా విని తీరుతుంది.

ఈ రకంగా దివ్యమూ, వున్నతమూ, పవిత్రమూ అయిన భావాల మీద మనస్సును నిలుపుతూ ఉన్నత లక్ష్యం వైపు మనస్సును మళ్ళించాలి. బాహ్యంగా వుండే అన్ని విషయాల నుంచి మనస్సుకి విముక్తి కలిగించాలి.

ఎప్పుడయితే ఈ బాహ్య విషయాల మీద విరక్తి కలిగిందో అప్పుడు మనయొక్క మనస్సును ఆత్మను తెలుసుకోవటమే నిరంతర ధ్యానంగా గ్రహించి మనస్సుకు శ్రవణ మననాలపై ఏకాగ్రత కలిగేలా చేయాలి.

నిజానికి ఈ విషయ వస్తువులు కన్నా విషం మింగితే నయం అంటారు. విషం అనేది మింగిన వారికి మాత్రమే హాని కలిగిస్తుంది. కానీ ఈ విషయ వస్తువులు ఎలాంటివి అంటే అవి చెప్పేవారిని, చూసేవారిని, విన్న వారినీ కూడా సర్వనాశనం చేస్తాయి.

**ఉదా:** ఒక రాజుగారు తన రాజ్యాన్ని అద్భుతంగా పాలించేవారు.

అందరూ రాజు గారి పాలన గురించి ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. ఒకసారి అనుకోకుండా వరదలు వచ్చి విపరీతమైన కరువు, కాటకాలు ఏర్పడి ప్రజలు ఎంతో ఇబ్బంది పడసాగారు.

ఆ సమయంలో రాజుగారు తన ఖజానాలోని సంపదను ఖర్చు చేసి ప్రజలందరికీ ఆశ్రయం కల్పించారు, దాతలందరూ నష్టపోయిన వారి సహాయ నిమిత్తం ఎవరికి తోచింది వారు సహాయం చేయాలని దండోరా వేయించారు.

రాజుగారి ప్రకటనకు ప్రజలు అందరూ స్పందించి ఎవరికి తోచిన సాయం వారు చేయసాగారు.

నిరంతరం అన్నదానాలు జరుగుతున్నాయి. ఎవరికి తోచినవి వారు ఇస్తున్నారు. ఒక గొల్లభామ ఒక పెద్దకుండలో పెరుగునింపి ఆ పెరుగు కుండపై ఆకును మూతవేసి తలపై పెట్టుకుని రాజుగారి ఆస్థానానికి బయలుదేరింది. సరాసరి పెరుగు తీసుకువెళ్ళి ఆమె అక్కడ పెరుగుతో వున్న గంగాళంలో పోసింది. అందరూ భోజనాలు చేసారు.

ఆ ఆహారం తిన్నవారందరూ చనిపోయారు. రాజ్యంలో కలకలం బయలుదేరింది. ఎందువల్ల ఇలా జరిగింది అంటే అర్థం కాని పరిస్థితి.

ఇదిలా వుండగా యమధర్మరాజు అయోమయంలో పడి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల దగ్గరకు పరిగెత్తుకు వచ్చి అయ్యా! బ్రహ్మయ్య జరిగింది ఇది. వీరిని (మరణించినవారిని) ఇప్పుడు నేనేం చేయను అని అడిగాడు.

అప్పుడు బ్రహ్మగారు నాయనా! నేను సృష్టికర్తను మాత్రమే. కాబట్టి విష్ణుమూర్తిని అడుగుదాం అని విష్ణుమూర్తిని అడిగితే ఆయన నేను పాలకుణ్ణే కాని, లయకారకుణ్ణి కాను కాబట్టి ఆ పరమేశ్వరుడిని అడుగుదాం అని అందరూ కలిసి తమ సమస్యని పరమేశ్వరునికి విన్నవించుకున్నారు.

అంతా విన్న పరమేశ్వరుడు జరిగినదంతా దివ్యదృష్టితో చూసి జరిగినదంతా తెలుసుకుని వారితో ఇలా అన్నాడు.

రాజు మంచి మనస్సుతో ప్రజలు ఇబ్బంది పడకుండా అన్నదానం చేసాడు. అందులో రాజు తప్పేమీ లేదు. వంటవారు అందరూ తెచ్చినవి చక్కగా రుచిగా వండి వడ్డించారు. అందులో వారి తప్పు లేదు.

గొల్లభామ తనవంతు సాయంగా పెరుగు సేకరించి అది తెచ్చిపోసింది. అందులో ఆమె తప్పులేదు. మరి ఎవరి తప్పులేనపుడు ఇది ఎలా జరిగింది. మరి ఇంతమంది ఎలా మరణించారు అనే సందేహాలు రావచ్చు. వడ్డించేవారు వారికేమీ తెలియనందువల్ల వారి పని వారు చేసారు. కాబట్టి వారి తప్పులేదు.

ఇందులో ఎవరి తప్పు లేకపోతే ఇది ఎలా జరిగింది అంటే నేను (పరమేశ్వరుడు) దివ్యదృష్టితో చూసిన దానిని బట్టి జరిగింది ఏమిటంటే..

గొల్లభామ పెరుగు తెస్తుండగా పెద్ద ఈదురుగాలి వచ్చి చల్లకుండ మీద వేసిన ఆకు ఎగిరిపోయింది. అదే సమయంలో ఆకాశంలో ఎగురుతున్న ఒక గ్రద్ధ క్రింద తిరుగుతున్న ఒకపామును చూసి క్రిందకు దిగి ఆ పాముని తనకాళ్ళ గోళ్ళతో గ్రుచ్చి పట్టుకుని ఆకాశంలోనికి ఎగిరింది. ఆ గ్రద్ధ యొక్క గోళ్ళు పాము శరీరంలో గ్రుచ్చుకోవటంతో ఆ బాధ తట్టుకోలేక పాము విషం కక్కింది. ఆ విషం అనుకోకుండా గొల్లభామ నెత్తిమీద వున్న కుండలో పడింది. అది తెలియని గొల్లభామ కుండలోని పెరుగు గంగాళంలో పోసింది.

కాబట్టి ఇందులో ఎవరి తప్పు లేదు. ఎలాగంటే గ్రద్ధ యొక్క ఆహారం పాము, భరించలేని బాధలో ఆ పాము విషం కక్కింది. ఏమీ తెలియని గొల్లభామ పెరుగు గంగాళంలో ఒంపింది అని విషయం అంతా వారందరికీ వివరించి చెప్పాడు ఆ పరమేశ్వరుడు.

అదంతా వింటున్న వారందరూ ఆ పరమేశ్వరుణ్ణి అయ్యా! పరమేశ్వరా మీరు చెప్పింది అంతా అర్థం అయింది. మరి ఈ పాపం ఎవరికి పంచమంటారు అని ఏకకంఠంతో అడిగారు. దానికి సమాధానంగా ఆ పరమేశ్వరుడు భూలోకంలో చాలామంది తిన్నది అరగక, ఉన్నది కరగక (కొవ్వు) ఎదుటి వారి గురించి లేనిపోనివన్నీ చెప్పుకుంటూ ఆనందపడిపోతూ వుంటారు. అలాటి పనికిమాలిన వారందరికీ ఈ పాపం సమంగా పంచండి అని చెప్పారు.

దీనిని బట్టి మనం తెలుసుకోవలసింది ఏమిటంటే మన వినాశనానికి కారణం మన మనస్సు, మన ఇంద్రియాలే. కాబట్టి మన మనస్సును, బుద్ధిని, ఇంద్రియాలను అదుపులో పెట్టుకుని విషయ వస్తువులనే కాకుండా, వినే విషయాలపై మాట్లాడే మాటలు కూడా స్వచ్ఛత వుండేలా చూసుకుని ప్రవర్తించాలి. రక్తం కారకుండా మనిషి ప్రాణం తీసే పదునైన కత్తి నాలుక. ఆ నాలుకని అదుపులో వుంచుకుంటే ఇలాటి శిక్షలు మన దగ్గరకు రావు.

❖ ❖ ❖

**(15) శ్లో ॥ విషయేభ్యః పరావర్త్య, స్థాపనం స్వస్వగోళకే**
**ఉభయేషా మింద్రియాణాం, సదమః పరికీర్తి తః ।**
**బాహ్యానాలంబ నం వృత్తేరేషోపరతిరుత్తమా ॥**

మనం పై శ్లోకంలో "శమము" అంటే ఏమిటో తెలుసుకున్నాము ఇప్పుడు "దమం" గురించి తెలుసుకుందాము.

ఇంద్రియాల ద్వారా బాహ్యవస్తువుల వైపు దృష్టిమరలకుండా ఎంతో జాగ్రత్తగా గమనిస్తూ మళ్ళీ ఇంద్రియాల్లోనే లయం అవటాన్నే దమము అంటారు. ఇంద్రియాలను అదుపులో వుంచుకుంటూ నిగ్రహం కలిగి

వుండటాన్నే దమము అంటారు.

అయితే ఈ మనస్సు విషయ ప్రపంచం వైపు పరుగు పెట్టకుండా లక్ష్యం గురించిన విచారణలో స్థిరంగా నిలిచినప్పుడు అనుభూతమయ్యే స్థితినే శమము అంటారు. ఈ శమదమాదుల వల్ల నిశ్చలమైన మనస్సులో సహజంగా ఉపరతి ఉదయిస్తుంది.

ఈ వుపరతి అంటే బయటవస్తువుల వల్ల వచ్చిపడే అలజడుల వల్ల మనస్సు ఎప్పుడయితే ప్రభావం అవుతుందో దానినే ఉపరతి అంటారు. ఈ జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు వాటి, వాటి వ్యవహారాలలో తమ విషయాలను వెనక్కి మళ్ళించి తమ స్థానాల యందు అంటే తమకు అధిష్ఠానమైన బ్రహ్మం మీద నిలపటాన్నే దమము అంటారు.

**ఉదా:** మనం చాలా అందమైన ఒక డైమండ్ నెక్లెస్ చూసామనుకోండి. అబ్బా.. ఇది ఎంత బాగుందో దీనిని మనం తీసుకుంటే ఎంత బాగుంటుంది అనే ఆలోచన రాకపోవటాన్నే దమము అంటారు. దీనినే మైండ్ కంట్రోల్ అంటారు. ఇందులో మళ్ళీ జ్ఞానేంద్రియాలూ, కర్మేంద్రియాలూ అని రెండు రకాలు వున్నాయి.

ఈ జ్ఞానేంద్రియాలు 5 రకాలు : శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలు ఇవి జ్ఞానేంద్రియాలు.

అలాగే కర్మేంద్రియములు కూడా 5 రకములు : 1) వాక్కు 2) పాణి 3) పాదము 4) పాయువు 5) ఉపస్థ.

ఏ పనయినా మనకి అనుకూలంగా జరిగితే ఆనందం. లేకపోతే బాధ. ఎండాకాలం పోయి వానాకాలం వచ్చినట్టుగా ఈ సుఖ, దు:ఖాలు కూడా వస్తూపోతూ వుంటాయి. కాబట్టి వీటిని మనం మనస్సుకి తీసుకోకూడదు.

శబ్దం ఈ శబ్దం చెవుల ద్వారా మనకు తెలుస్తుంది.

ఈ చెవుల ద్వారా మంచి మాటలు వినటానికి, భగవంతుని గురించి తెలుసుకోవటానికి, అనేక రకములైన విషయాలను తెలుసుకోవటానికి ఇలా ఎన్నో రకాలుగా వుపయోగపడతాయి.

**స్పర్శ :** ఈ స్పర్శ అనేది చర్మం ద్వారా తెలుస్తుంది. వేసవికాలం ఎండను, శీతాకాలం చలిని చెప్తూ వుంటుంది.

**నాలుక :** తీపి, పులుపు, వుప్పు, కారము అంటూ అనేక రుచులు తెలుసుకోవటమే కాకుండా, భగవంతుని యొక్క నామాన్ని నిరంతరం జపించాలంటే ఈ నాలుక చాలా అవసరం. ఆయన భజనలు పాడాలన్నా, మంత్రాలు జపించాలన్నా మన నాలుక మనకు శ్రీరామరక్ష.

**పాణి (చేతులు) :** భగవంతుణ్ణి పూజించటానికి, నమస్కరించటానికి, కాలకృత్యములు తీర్చుకోవటానికి, పాణిగ్రహణమునకు ఇలా ఎన్నో ముఖ్యమైన పనులకు ఈ చేతులు ఉపయోగపడతాయి.

**పాదము (కాళ్ళు) :** గుడికి వెళ్ళాలన్నా, బడికి వెళ్ళాలన్నా ఎక్కడికి ప్రయాణించాలన్నా, ఏ కార్యం మీద వెళ్ళాలన్నా ఈ కాళ్ళు చాలా ముఖ్య పాత్ర వహిస్తాయి.

**ఉపస్త, పాయువు :** ఇవి మలమూత్రాలకు, ఇతరత్రా ఉపయోగ పడతాయి.

ఈ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలను చూసి మనం మురిసి పోకండా గర్వంతో, పొగరుతో, అహంకారంతో విఱ్ఱవీగిపోకుండా వీటిని భగవంతుని కొరకు వుపయోగిస్తూ, మంచి పనులతో ఆనందపడుతూ వీటిని ఉపయోగించుకున్నట్లయితే ఈ మానవజన్మకు అర్థం, పరమార్థం లభించటానికి అవకాశం ఉంది.

❖ ❖ ❖

(16) శ్లో ॥ సహనం సర్వదుఃఖానామ, ప్రతీకార పూర్వకమ్ ।
చిన్తావిలాపరహితం, సాతితిక్ష్యా నిగద్య తే ॥

తితిక్ష : ఇతరుల వల్ల మనకి కలిగే దు:ఖాలను ఓర్చుకుంటూ, శరీరంలో ఓర్పు, సహనం, పటుత్వము, బుద్ధి కలిగి ఉండి కూడా మనం ఎదుటివారి మీద ప్రతీకారం తీర్చుకోవాలనే భావనతో పరుష వాక్యాలతో వారిని దూషించకుండా సహనంతో వ్యవహరించటాన్నే తితిక్ష అంటారు.

**ఉదా:** మనలో మంచితనం వుంటే ఎవరు ఎన్నినిందలు వేసినా మన విలువ తగ్గదు. ఈ ప్రపంచవ్యాప్తంగా ఖరీదయిన అహంకారం, పొగరు, అసూయ, గర్వంలాంటివి మనం దగ్గరకు రానివ్వకుండా వుంటే ఈ తితిక్ష మనవెంటే వుంటుంది.

చాలా మంది సంసారంలోవచ్చే చిన్న, చిన్న విషయాలనే పెద్దవిగా చేసుకుంటూ భయంకరమైన మనోవేదనకు గురవుతూ బాబోయ్ ఈ బాధలు నేను పడలేకపోతున్నాను. ఎక్కడికయినా పారిపోవాలనిపిస్తోంది. నన్ను ఇలా అన్నారు, అలా అన్నారు, వాళ్ళు నాశనం అయిపోతారు. నా కంఠంలో ప్రాణం వుండగా నేను వాళ్ళని వదలను. కక్ష తీర్చుకుంటాను అంటూ ఆవేశంతో కోపంగా ఏవేవో మాట్లాడుతూ వుంటారు.

ఇలాంటి ఆవేశాల వల్ల మన ఆరోగ్యం. మనశ్శాంతి పోవటమే కాకుండా మితిమీరిన భోగభాగ్యాలూ కలిగి ఉన్నామన్న అహంకారంతో మనం హద్దుమీరి ప్రవర్తించినట్టయితే దాని ఫలితం చాలా తీవ్రంగా ఉ ంటుంది.

ఎందువల్ల అంటే ఈ భోగభాగ్యాలు పాముపడగల్లాంటివి. మనం కనుక వాటిని పద్ధతిగా ఉపయోగిస్తే పడగపట్టి నీడనిస్తాయి.

లేదంటే పగపట్టి కాటు వేస్తాయి. (భోగి అంటే పాము, భోగం అంటే పడగ అనే అర్థం అందులోనే వుంది). డబ్బు ఉందని అహం వద్దు.

దాని కోసం పోరాటం వద్దు.

మనలోని ఈ ఆవేశాలకు, రోషాలకూ, కోపాలకు, కోపతాపాలకూ కారణం తెలుసుకుంటే మనం కొంతవరకూ వీటిని కంట్రోల్ చేసుకోవచ్చు. అరి అంటే శత్రువు. షట్ అంటే ఆరు. ప్రతి మనిషిలోనూ ఆరు చెడు లక్షణాలు వుంటాయి. కామము, క్రోధము, లోభము, మదము, మోహము, మాత్సర్యము. వీటినే అరిషట్ వర్గాలు అంటారు.

**కామము :** ఉండవలసిన దాని కన్నా ఎక్కువ కోరిక కలిగి ఉండటం.

**క్రోధము :** అంటే కోపం. దీనివల్ల ఆవేశానికిలోనై మంచీ, చెడూ విచక్షణ కోల్పోయి మాటలతోనూ, చేతలతోనూ పనికిమాలిన పనులు ఎన్నో చేస్తూవుంటాము.

**లోభము :** ఇతరులకు ఏమైనా ఇస్తే మన ఖజానా తరిగిపోతుందేమో అనే భయం. అన్నీ మనము మనబిడ్డలే అనుభవించి తీరాలన్న తపన దాచి, దాచి కూడబెట్టే లక్షణాన్నే లోభము అంటారు.

**మదము :** నేను ఇన్ని కోట్లకు అధిపతిని. నాకు ఇన్ని పదవులున్నాయి. నన్ను ఎవ్వరూ ఏమీ చేయలేరు. అన్న పొగరు, గర్వం, దురహంకారంతో విఱ్ఱవీగి ప్రవర్తించటం.

**మోహం :** ఎదుటి వారి సంపదల మీద, వస్తువుల మీద, వ్యక్తుల మీద, పదవుల మీద విపరీతమైన వ్యామోహాన్ని కలిగివుండటం.

**మాత్సర్యం :** దీన్నే ఓర్వలేని తనం అంటారు. మనకంటే కొంచెం గొప్పగా వుంటే తట్టుకోలేకపోవటం. అందరూ బాగుండాలి. ఆ అందర్లోనూ నేనూ వుండాలి అనే ధోరణి లేకుండా ఎదుటివారు సంతోషంగా ఉండటం సహించలేకుండా వుండటం.

సాధారణంగా మనం తినే ఆహారం విషపూరితమైతే మనకి ఎంత నష్టమో అదే మన చెవిలో విషపూరితమైన పరుష వాక్యాలు పడితే కూడా అంతకన్నా భారీనష్టం కలుగుతుంది.

కొన్ని సార్లు మనం చేసే పొరపాటు మాటల వల్ల అది నిజమా? అబద్ధమా? అని తెలియకపోయినా ఆఅనర్థం మూలంగా కొన్ని జీవితాలు తారుమారు అవుతాయి. అమాయకులు బలవుతారు.

మనం ఈ అరిషడ్వర్గాలను జయించి భగవత్ చింతనలో కాలాన్ని గడపమని శ్రీ శంకరులు వారు స్పష్టంగా చెప్పారు. ముహూర్తం అంటే 48 నిమిషాలు. కనీసం ఒక్క ముహూర్తకాలం వృధా చేసుకున్నా ఆ కాలాన్ని మనం తిరిగిపొందలేము.

ముందుగా చిన్నపిల్లలకు రోజు మొత్తంలో 48 నిమిషాల కాలాన్నయినా భగవంతుని ప్రార్థనలో గడిపేలా చూడండి. ఆ తరువాత వారు ఆ సాధన చేయగా చేయగా ఎంతో ప్రయోజకులు అవుతారు.

లేకపోతే వారి జీవితమే కాదు మన జీవితం కూడా గాడి తప్పటం ఖాయం. ఇవన్నీ వదిలేసి స్నానాలు, ఉపవాసాలు, యాత్రలూ అంటూ దూరంగా వెళ్ళి ఏవేవో పొందాలనుకోవటం వీటన్నిటినీ తితిక్ష క్రింద అనుకుంటూ వుంటారు.

జీవిత విలువలకి సంబంధించిన మన ఆలోచనలు స్పష్టంగా లేకపోతే మనం ఏ పని చేసినా అది మనకి శాపంగా మారుతుంది. అలా కాకుండా మనం వెళ్ళేదారిలో ఎన్ని కష్టనష్టాలు వచ్చినా చలించకుండా భరించే స్థితినే తితిక్ష అంటారు.

❖ ❖ ❖

(17) **శ్లో ॥ శాస్త్రస్య గురువాక్యస్య సత్యబుద్ధ్యవ ధారణమ్ ।**
**సాశ్రద్ధా కథితా సద్భిర్యయా వస్తూపలభ్యతే ॥**

గురువు చెప్పే ప్రతీ వాక్యమూ సత్యం (నిజం) అని నిజమైన బుద్ధితో నమ్మి వుండటాన్నే శ్రద్ధ అంటారు. గురువుగారిది ఒక విలక్షణమైన లక్షణం. శబ్దం యొక్క అక్షరం బరువు. నిజమయిన గురువు మనలో

పేరుకు పోయిన అజ్ఞానమనే బరువుని జ్ఞానమనే దివ్యజ్యోతి ద్వారా తొలగిస్తారు. అందువల్ల గురువుగారి యొక్క మాట మీద శ్రద్ధ, నమ్మకం కలిగి ఉండాలి. ఆ నమ్మకం ఎలా వుండాలి అంటే గురువు ఏం చెప్పినా వెంటనే ఆచరించగలగాలి.

**ఉదా:** ఒక వూర్లో ఒక గొల్లభామ రోజూ నది దాటి వచ్చి పాలు, పెరుగు అమ్మి వెళ్తూవుండేది. అయితే ఒక్కో రోజు బాగా ఆలస్యం అయ్యేది. ఇంత ఆలస్యం అయితే ఎలా అని ఆమెను ఎవరయినా అడిగితే ఏదో ఒక కారణం చెప్తూ వుండేది.

ఒకరోజు గురువుగారు ఆ గొల్లభామతో మాటవరసకి నువ్వు ఆ పడవ గురించి చూడకు. ఆ భగవంతుని మీద దృష్టి పెట్టి నది మీద నడిచి వచ్చెయ్. నిన్ను ఎవ్వరూ ఆపరు అన్నారట. వెటకారంగా అది నమ్మిన మరుసటి రోజు ఆమె రోజూ కన్నా చాలాముందుగా వచ్చేసిందట. అప్పుడు గురువుగారు ఆశ్చర్యంగా ఇంతముందుగా ఎలా వచ్చావ్ అని అడిగారట.

అయ్యా! మీరు నిన్న చెప్పారు కదా! దృష్టి దేవుని మీదపెట్టి చకచకా వచ్చేయ్ అని. నేను అలాగే చేసాను అంది గొల్లభామ.

దీనిని బట్టి మనకి తెలుస్తున్నది ఏమిటంటే గురువు మాటను నమ్మకంతో, శ్రద్ధతో ఆచరించినట్లయితే మన జీవితానికి లక్ష్యమైనటు వంటి మార్గాన్ని తప్పక గురువు చూపిస్తారు.

అదే గొల్లభామ తను దాచిన సొమ్ముతో ఒక వంతెన నిర్మించింది. అటుగా వెళ్తున్న ఒక వ్యక్తి వచ్చి అవ్వా, నీకెందుకు ఈ వయసులో ఈ శ్రమ, నీ శక్తిని అంతా ధారపోసి ఈ వంతెన ఎందుకు కట్టావు అని అడిగాడు.

చాలా రోజులు నువ్వు ఈ నదిపై నడిచి రావటం నేను చూసాను. మరి ఈ వయసులో నీకెందుకు ఈ శ్రమ అని అడిగాడు.

అప్పుడు వయోవృద్ధురాలైన ఆ గొల్లభామ ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాలతో, సుడి గుండాలతో పారే నదిని ఆమె సునాయాసంగా దాటి ఒడ్డుకు చేరి వెనక్కి తిరిగి చూసేసరికి తనతో పాటు ప్రయాణం మొదలుపెట్టిన వారు పడవరాక ఇంకా ఒడ్డుకు చేరలేకపోతున్నారు. ఈ నది ఎందుకో నన్ను భయపెట్టలేదు. కానీ ఈ యువత దీన్ని నాలా దాటటానికి ఎందుకో జంకి ఇబ్బందికి గురౌతున్నారు.

ఒంటరి జీవనం సాగించే నాకన్నా ఈ ధనం వీరికి ఈ వంతెన రూపంలో ఎంతో ఉపయోగకరం అని గురువుగారు చెప్పారు. అందువల్ల ఈ వంతెన కడుతున్నాను అంది గొల్లభామ.

ఆ యువకుడు ఆమె మాటలకు ఆశ్చర్యపోయాడు. గురువుపట్ల ఆమెకు వున్న భక్తి అచంచలమైన విశ్వాసం ఎంత గొప్పదో తెలుసుకున్నాడు. ఆ గొల్లభామనే గురువుగా భావించి ఎన్నో మంచి ప్రయోజనకరమైన పనులు చేయసాగాడు. గురువు ప్రసాదించిన జ్ఞానం ఒకరి నుంచి ఒకరికి అందించబడి ఉండకపోతే ఎప్పుడో నశించిపోయేది.

❖ ❖ ❖

**(18) శ్లో ॥ సర్వదాస్థాపనం బుద్ధేః శుద్ధే బ్రహ్మణి సర్వదా ।**
**తత్సమాధాన మిత్యుక్తం నతు చిత్తస్యలాలనమ్ ॥**

అజ్ఞానంతో కప్పబడిన ఈ అహంకార మమకారాలు మొదలు దేహం వరకు ఎన్ని బంధాలు వున్నాయో వాటిని అన్నింటినీ కూడా విడిచి పెట్టేయ్యాలి. ఈ అహంకారము, మమకారము అనే బంధాలలో చిక్కుకు పోయి సంసారం అనే అగ్నిలో కాలిపోతున్న వానిలా పరితపిస్తున్నటువంటి సమయంలో సద్గురువు మనకు చెప్పిన అమృత తుల్యమైనటువంటి మాటల వల్ల ఈ బంధాల నుండి విముక్తి మనకి లభిస్తుంది. ఈ విముక్తి

మనకు లభించాలంటే  అహం–నేను, మమ–నాది అనేవి వదిలేయాలి.

పై శ్లోకంలో ఏది నిత్యం, ఏది అనిత్యం తెలుపగలిగే వివేకం గురించి, అనిత్యమైన వాటిని గుర్తించటం వల్ల కలిగే స్థిరమైన వైరాగ్యం గురించి తెలుసుకున్నాము.

శమము అంటే కోరికలను కంట్రోల్ చేసుకోవటం అని, దమము అంటే ఏ వస్తువును చూసినా అది నాకు కావాలి. ఇది నాకు కావాలి అనే ఆలోచన మనకు కలగకపోవటం అనీ, ఉపరతి అంటే ఈశమాదులని మించినదనీ, దేనిలోనయినా బ్రహ్మతత్వాన్నే చూడటం ఏం చేసినా ఒక్కలాగే అనిపించటం, కష్ట, సుఖాలను లెక్క చేయకుండా బుద్ధిని, మనస్సుని సంతోషంగా వుంచటాన్నే తితిక్ష అంటారనీ, శ్రద్ధ అంటే గురువుగారి మాటలపై అచెంచలమైన భక్తి, విశ్వాసము, నమ్మకం శ్రద్ధలను కలిగివుండటం వీటన్నిటి గురించీ తెలుసుకున్నాము. ఇప్పుడు ముముక్షుత్వం  గురించి  తెలుసుకుందాము.

సాధారణంగా మనమందరం మన గురించి మనం చాలా గొప్పగా అనుకుంటూ వుంటాము. ఎందుకల్లా అనుకుంటాము అంటే మన యొక్క అసలు స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకోకుండా మనకి మనమే ఎంతో గొప్పగా ఊహించేసుకుంటూ వుంటాము. ఈ అహంకారం అనేది మనస్సు తోటి, శరీరం తోటి బాగా తాదాప్యం చెందటంతో భార్యా భర్త పిల్లలు సంసారము అనే బంధాలకు పరిమితమైనట్లుగా భావించుకుంటున్నాము.

ఈ అహంకార, అజ్ఞానాలతో మనం కల్పించుకునే ఈ బంధాలవల్ల పుట్టింది మొదలు, చచ్చేంతవరకూ కూడా ఈ సాలిగూటిలో చిక్కుకుని కొట్టుమిట్టాడటం  జరుగుతోంది.

నిజానికి ఈ పరిస్థితులు ఏవీకూడా ఆత్మకు సంబంధించినవి కావు. ఈ ఆత్మ అనంతమైనదీ, అద్భుతమైనదీ, సుద్ధమైనదీ, పరిపూర్ణమైనదీ.

అలాంటి శుద్ధమైన తత్వాన్ని మరచిపోవటం వల్ల అనేక రకాలైన

బాధలు అనుభవించటం జరుగుతోంది.

మన యొక్క అసలు స్వరూపాన్ని మర్చిపోయి అజ్ఞానం వల్ల ఏర్పడిన అహంకారంతో శరీరము, మనస్సు బుద్ధులుగా భావిస్తూ వుంటాము. ఈ అజ్ఞానాన్ని ఎప్పుడయితే నాశనం చేస్తామో అప్పుడే మన స్వరూపాన్ని మనం తెలుసుకోగలుగుతాము. అప్పుడే ఆత్మానుభూతి ప్రాపిస్తుంది.

**ఉదా:** ఒక మహారాజు తన పరివారంతో కలిసి భోజనం తరువాత తన వుద్యానవనంలోకి వెళ్ళి ఒక కొలను దగ్గర కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆ కొలనులో అద్భుతమైన కలువపూలు చక్కటి సుగంధాలు వెదజల్లుతుంటే, ప్రకృతి చక్కటి పిల్లగాలుల్ని వీస్తూవుంటే రాజుగారి మనస్సు ప్రశాంతంగా, ఆనందంగా హాయిగా వుంది.

అలా ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్న మహారాజుగారికి ఆ కొలనులో ఒక పెద్దబుడగ చంద్రుని యొక్క వెలుగులో నుంచి మంచి రంగులతో మిలమిలా మెరిసిపోతుంది.

అబ్బ ఇదికదా నిజమైన సౌందర్యం అంటే.. అనుకుంటూ స్నప్నంలోకి వెళ్ళిపోయాడు రాజుగారు.

ఆ కలలో బుడగ నిండా మణులతో పొదగబడి ఉంది. అద్భుతమైన రంగులు వెదజల్లుతోంది. దాన్ని తీసుకువచ్చి తనయొక్క రాజమందిరంలో భద్రం చేసినట్టు తన కొలువులోని వారందరూ దాని అందాన్ని ఆశ్చర్యంగా తిలకిస్తున్నట్టు వూహించుకుంటూ అలా స్వప్నంలో విహరించసాగాడు.

ఇంతలో ఆ బుడగ పేలిపోయింది. ఆ స్వప్నం నుంచి బయటపడిన రాజుగారు అయ్యో ఇదంతా కలా? అనుకునేలోగా ఎంతో అద్భుతంగా కనిపించిన ఆ బుడగ సెకనులో పేలిపోయింది. ఆ పగిలిన బుడగలో ఎలా అయితే ఏమీలేవో అలాగే మన జీవితంలో కూడా ఏమీ లేవు, రాజు తన నిజ స్వరూపాన్ని మర్చిపోయి ఆ బుడగతో తాదాప్యం

చెందటం వల్ల ఆ బుడగ గురించి అంతే గొప్పగా వూహించుకున్నాడు. ఆ నీటి బుడగ, ఆ రంగులు, ఆ మెరుపులు అన్నీ అభూత కల్పనలే అని స్పష్టంగా తెలుసుకోవటం జరిగింది.

రాజు కయినా, బంటుకయినా, కోటీశ్వరులకయినా, పేదవారికయినా కష్టాలు 4 రకాలుగా వస్తాయి.

(1) దరిద్రము (2) దు:ఖము (3) భయము (4) శత్రుబాధ. ఇవన్నీ మనిషి జన్మ ఎత్తిన ప్రతీవారికీ బాధ కలిగించేవే. వీటి నుంచి ఎవరయినా సరే బయటపడాలంటే భగవంతుని పాదాలు తప్పనిసరిగా ఆశ్రయించ వలసిందే,

❖ ❖ ❖

(19) **శ్లో ॥ మందమధ్యమ రూపాపి, వైరాగ్యేణ శమాదినా ।**
**ప్రసాదేన గురోఃసేయం ప్రవృద్ధా సూయతేఫలమ్ ॥**

ఎవరికైతే మోక్షం పొందాలన్న కోరిక ఎక్కువగా వుంటుందో వారు ఏది నిత్యం, ఏది అనిత్యం అనే విషయాన్ని తెలుసుకోగలుగుతారు. వారికి అనిత్యమైన వాటి మీద వ్యామోహం వుండదు.

ఇలా సాధకునిలో కోరిక మందంగానూ, మధ్యమంగానూ ఉన్న వ్యామోహం తొలగిపోతుందో వారికి వైరాగ్యం దానంతట అదే వస్తుంది.

ఆత్మానుభవం పూర్తిగా కలిగిన గురువు తనకు తెలిసిన ఆధ్యాత్మిక సంపదను అంతటినీ వీలైనంత స్పష్టంగా శిష్యునికి తెలిసేలా చెప్తారు. గురువు శిష్యునికి తనశక్తి కొద్దీ అన్నీ విడమరచి చెప్తున్నప్పుడు శిష్యుడు కూడా గురువుపై అదే శ్రద్ధా, బుద్ధులను ఉపయోగించి నేర్చుకోవాలి.

అలాగే నిజమయిన గురువు కూడా శిష్యుని యొక్క సంకల్ప బలం, అర్హత ఎంత ఎక్కువగా వుంటే అంత ఎక్కువ గురుకృప లభించేలా చూడాలి.

**ఉదా:** మనం ఒక చెఱువు నుంచి మంచినీరు తెచ్చుకున్నప్పుడు

చెఱువుకు ఒక బిందెను తీసుకువెళ్తాము. అలాగే ఇంకొకరు మన బిందెకన్నా కొంచెం పెద్దబిందె తెచ్చుకోవచ్చు. చిన్న బిందెలోని నీరు కొంచెం తక్కువగానూ, పెద్దబిందెలో నీరు కొంచెం ఎక్కువగానూ వుంటే అది బిందె తప్పుకాదు, నూతి తప్పుకాదు. మనం తీసుకువెళ్ళిన పాత్రకు సరిపడా నీరు బిందెను బట్టి తెచ్చుకుంటాము.

అలాగే గురువు యొక్క కృపకూడా శిష్యులందరిపైన ఒకే రకంగా వుంటుంది. శిష్యులు విని గ్రహించుకోవటంలోనే తేడా వుంటుంది. అంతే కానీ గురు కృపకు ఎక్కువా, తక్కువలు వుండవు.

బ్రహ్మజ్ఞానం కలగాలి అంటే ఇంద్రియ నిగ్రహం, కఠినమైన సాధన వుండాలి.

గురువు మనకి ఎప్పుడు కూడా ప్రమాదరహితమైన జ్ఞానాన్ని మాత్రమే మనకి ప్రసాదిస్తారు.

కానీ కొన్ని సందర్భాలలో గురువుగారి మాటల్ని పొరపాటుగా అర్థం చేసుకున్నట్లయితే (అవి నిజమా, అబద్ధమా అనేది తెలుసుకోకుండా) కొన్ని జీవితాలు తారుమారు అవుతాయి. అందులో అమాయకులు బలవడం జరుగుతుంది.

కాబట్టి మంచి చెప్పే గురువును గౌరవించి ఆయన వాక్యాలను పూర్తిగా అర్థం చేసుకుని గురువు గురించి చెడుగా చెప్పేవారిని దూరంగా వుంచాలి. అంతే కానీ ఈ రోజు గురువు గురించి మనతో చెడు చెప్పిన వారు రేపు మన గురించి చెడుగా మరొకరితో చెప్పరని గ్యారంటీ లేదుగా.

సద్గురువు మనకు కొన్ని ముఖ్య విషయాలు తెలియచేస్తారు. (1) పేదరికం (2) రోగం (3) ధనం ఇవి వక్కసారి మనదగ్గరికి వచ్చాయంటే తిరగిపోవటం చాలా కష్టం.

అలాగే (1) గడిచిన కాలం (2) వయసు (3) పోయిన పరువు ఇవి

ఒక్కసారి మనల్ని వదిలిపోతే మళ్ళీ ఎట్టి పరిస్థితిలోనే తిరిగిరావు.

జీవితాంతం మనం వున్నా లేకపోయినా వుండేవి. (1) కీర్తి, (2) జ్ఞానం (3) చదువు ఇవి ఒక్కసారి వస్తే ఎప్పటికీ వదలవు.

ఇవన్నీ గురువు ద్వారా మనం తెలుసుకుని రేపటితరానికి అర్థం అయ్యేలా మంచి మంచి పుస్తకాలూ, ఆధ్యాత్మిక గ్రంథాలు, భక్తిగీతాలు, భజనలూ అలవాటు చేసి నట్లయితే ఎంత ఎదిగినా వారి మనస్సులో నుంచి ఈ భావనలు పోవు సరికదా వారి కృషివల్ల మరో గురువు సమాజంలోకి రాగలరు.

మనకు సద్గురువు లభించాలంటే శిష్యుని యొక్క సంకల్ప బలం గట్టిగా వుండాలి.

కర్మయే పునర్జన్మకు హేతువు. గురువు యొక్క కృపతో ఎవరిని వారు వుద్ధరించుకోవాలి కానీ మనల్ని ఎవరో వచ్చి వుద్ధరిస్తారనుకోవటం తప్పు. జన్మల మీద జన్మలు ఎత్తుతూ ఈ కష్టాలూ, బాధలు అనుభవించాలను కోవటం కన్నా వీటి నుంచి మనం బయటపడటానికి సద్గురువు యొక్క పాదాలు ఆశ్రయించకతప్పదు.

❖ ❖ ❖

**(20) శ్లో ॥ ఏతయోర్మన్దతా యత్ర విరక్తత్వముముక్షయోః ।**
**మరౌ సలిలవత్తత్రే శమాదేర్భానమాత్రతా ॥**

భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు మోక్షానికి సాధనములుగా చెప్పబడ్డాయి. వీటిలో భక్తి చాలా విలువైనది. అపాయంలేనటువంటిది. మొట్టమొదటగా మనం నిర్మలమైన మనసుతో పూర్తిగా విశ్వాసం కలిగి భక్తితో భగవంతుణ్ణి ప్రార్థించాలి. మనయొక్క ఆత్మలోనే భగవంతుణ్ణి చూడగలగాలి.

ఆత్మవేరు, భగవంతుడు వేరు, నేను వేరు అనే భావనే ముందుగా

మన మనస్సులో నుంచి తీసివేయాలి. అసలు దేహాన్ని మించిన క్షేత్రం, మనస్సును మించిన తీర్థం ఎక్కడా లేదు. ఇదే భావంతో మనం ఎక్కడెక్కడో తిరిగి భగవంతుని కోసం వెతకటం కన్నా ఆత్మే పరమాత్మ అని నమ్మకంగా ఎవరయితే తనలోనే వున్న పరమాత్మను తెలుసుకుని ధ్యానిస్తారో వారికి తప్పకుండా భగవంతుని యొక్క కటాక్షం లభిస్తుంది.

ఈ భగవంతుని కటాక్షం కోసం మంచి గురువును ఎంచుకుని ఆ గురువు యందు నమ్మకము, ధృడ భక్తి కలిగి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉండాలి. జ్ఞానాన్ని బోధించే గురువు సూర్యునిలా వుండకూడదు. చంద్రునిలా వుండాలి. చంద్రుడు సూర్యుని యొక్క వేడికిరణాలను తను తీసుకుని మనకు చల్లదనం ఎలా అందిస్తాడో, అలాగే సద్గురువు బ్రహ్మం ఒక్కరే... కానీ అది అనేక నామరూపాలుగా వ్యక్తమవుతోంది అనే విషయాన్ని మనకు తెలియజేసి మనకు గురుకృప లభించేలా చూస్తారు.

ఆ గురుకృప ఎలా వుంటుంది అంటే....

గురువు శిష్యునితో నాయనా మనం చేసుకున్న పాప, పుణ్యాల వల్ల మాత్రమే స్వర్గప్రాప్తి లేదా నరకప్రాప్తి లభిస్తుంది. అవి మనం బ్యాంకులో దాచుకునే డిపాజిట్లులాంటివి. అప్పులాంటివి.

మనిషిని తల్లి గర్భంలో ప్రవేశపెట్టేముందే అతని యొక్క తలరాతను (ఆయువు, ఐశ్వర్యం, మంచీ, చెడూ, కష్టం, సుఖం, మృత్యువుతో సహా) అన్నీ భగవంతుడు రాసేస్తాడు. కానీ ఇవేమీ గ్రహించని మనం కష్టం వచ్చినపుడు భగవంతుణ్ణి తిడుతూ, సుఖం వచ్చినపుడు మన అదృష్టం అనుకుంటూ వుంటాము. కానీ అవి మన యొక్క కర్మఫలాలు అని మనం తెలుసుకోము.

మనిషిగా పుట్టాలంటే మన ఇష్టం కాదు. దానికి ఈశ్వరుని యొక్క కృప చాలా అవసరం. ఆ పరమేశ్వరుని యొక్క కృపలేనిదే అది సాధ్యం కూడా కాదు. షడూర్పులు అనేవి (ఆకలి, దాహం వగైరా) మనిషికి

వుంటాయి. జంతువులకీ వుంటాయి.

దేవతలకి వారి పుణ్యఫలం అయిపోగానే మళ్ళీ క్రిందకి దిగిపోవాలి. అలాగే జంతువులకి కూడా.

అయితే మనుషులకి మాత్రం మంచీ, చెడూ విచక్షణ తెలుసుకుని మంచి గురువును ఎంచుకుని ఆ గురువు ద్వారా తనని తాను వుద్ధరించుకుని ముక్తి పొందే అవకాశం వుంది. ఇది మనుష్య జన్మలో మాత్రమే సాధ్యమౌతుంది. అందుకే మానవజన్మ చాలా గొప్పది. ఉన్నతమైనది. పవిత్రమైనది అని గురుముఖంగా మనం తెలుసుకుంటాము.

బ్రహ్మదేముడు సకల చరాచరసృష్టిని ఒకేరకంగా సృష్టించాడు (ఎవరికి ఏం కావాలో వారికి అవి ఇచ్చి) కానీ ఆ బ్రహ్మంను తెలుసుకోవాలి అంటే మానవ జన్మ తప్ప వేరే దారే లేదు.

ఈ మానవ జన్మలో మనం కనుక ఓ భగవాన్! దుర్గంధపూరితమైన ఈ సంసారమనే సముద్రంలో కొట్టుకుంటున్న మమ్మల్ని రక్షించి మమ్మల్ని ముక్తి, మోక్షం అనే ఒడ్డుకు చేర్చే గురువును మాకు ప్రసాదించు అని వేడుకోవాలి.

❖ ❖ ❖

(21) శ్లో ॥ **స్వామిన్నమస్తే నతలో కబన్ధో,**
**కారుణ్య సిన్ధో పతితం భవాబ్ధౌ ।**
**మా ముద్ధరాత్మీయకటాక్షదృష్ట్యా**
**ఋజ్వ్యాతి కారుణ్యసుధాభివృష్ట్యా ॥**

గురువుగారిని శిష్యుడు ఇలా ప్రార్థిస్తున్నాడు. స్వామీ మీ పాద పద్మములకు నా నమస్కారములు. దయార్ద్రహృదయులు, ఇతరులకు ఉపకారము చేయువారు, ఇంద్రియ నిగ్రహము కలవారు, మిమ్మల్ని నమ్ముకుని శరణుకోరిన వారికి పరమబంధువు అయిన వాడవు,

దయాసముద్రడవు అగు ఓ గురువర్యా! నేను సంసారమనే ఈ సముద్రాన్ని దాటలేక ములిగిపోతున్నాను. తమ యొక్క కరుణామృత వర్షధారల చేత మమ్మల్ని ఉద్ధరింప చేయండి. మీరు తమ యొక్క వుపదేశముల వల్ల మాకు చక్కటి జ్ఞాన మార్గాన్ని మాకు అందచేయండి. మహాప్రభూ అని ప్రార్థన చేయాలి.

❖ ❖ ❖

(22) **శ్లో ॥ దుర్వార సంసార దవాగ్నితప్తం**
**దోధూయమానం దురదృష్టవాతైః ।**
**భీతం ప్రపన్నం పరిపాహి మృత్యోః**
**శరణ్య మన్యద్యదహం న జానే ॥**

భయంకరమైన బాధలతో నిత్యం, అనుక్షణం చస్తూ బ్రతికే కన్నా మమ్మల్ని రక్షించండి మహాప్రభో! అని ప్రార్థించాలి.

శాంతి స్వరూపులు, గొప్పవారు, సత్పురుషులు వీరందరూ కూడా ఈ సంసారమనే మహాసముద్రాన్ని దాటినవారే. వీరు తలుచుకుంటే ఇతరుల్ని కూడా ఈ సముద్రాన్ని సునాయాసంగా దాటించగలరు. అందువల్ల ఇటువంటి గురువును మనం ప్రార్థించినట్లయితే ఈ భవభంధాలను సునాయాసంగా దాటించగలరు.

స్వార్థం లేకుండా ఎదుటువారిని ప్రేమించకలగిన రోజున ఎదుటివారిని నుంచి ఏమీ ఆశించకుండా దానం చేయగలిగిన రోజున అహంకార, మమకారాలతో పాటు స్వార్థాన్ని వదిలేసిన రోజున ప్రతి శిష్యుడు గురువు యొక్క కరుణా కటాక్షములను తప్పక పొందగలుగుతారు.

**ఉదా:** చుట్టు ప్రక్కల ఎక్కడయినా డబ్బు వుంటే రామకృష్ణ పరమహంస గారికి ఒళ్ళంతా మంటలుగా వుండేదట. ఇది విన్న వివేకానంద స్వామికి ఇది నిజం అవునా, కాదా అని తెలుసు కోవాలనిపించి ప్రతిరోజులాగానే

రామకృష్ణ పరమహంసగారికి పక్కవేచి ఆ పక్కక్రింద ఒక రూపాయి నాణెం పెట్టారట.

కొంతసేపటికి రామకృష్ణ పరమహంసగారు పక్కమీద పడుక్కుని 2 నిమిషాలయినా గడవక ముందే వివేకానంద స్వామిని పిలిచి ఇక్కడెక్కడయినా డబ్బులు ఉన్నాయోమో చూడు. నాకు ఒళ్ళంతా మంటలు పుడుతోంది అన్నారట.

అంతే వెంటనే వివేకానందస్వామీ రామకృష్ణ పరమహంస గారి కాళ్ళపై పడి ఆయన పాదాలకు సాష్టాంగ నమస్కారం చేసారట. సరయిన గురవు లభించినందుకు.

❖ ❖ ❖

(23) శ్లో ॥ **తథా వదన్తం శరాణగతం స్వం**
**సంసార దావానల తాపతప్తమ్ ।**
**నిరీక్ష్య కారుణ్యరసార్ద్ర దృష్ట్యా**
**దద్యాదభీతిం సహసా మహాత్మా ॥**

సంసారమనే దావాగ్నిచే పరితపించుచు దీనుడై తనయొక్క శరణు కోరుతున్న వక్తియగు శిష్యుణ్ణి చూచి మహాత్ముడు, కరుణాపూరితమైన చూపు కలిగినటివంటివాడు. క్రీగంటి దృష్టితో చూచిన వెంటనే గురువుగారు శిష్యునితో నాయనా! నువ్వేమీ భయపడకు! నీకు నేను వున్నాను. నీలో ఉన్న అజ్ఞానమనే చీకట్లను తొలగించి జ్ఞాన జ్యోతిని వెలిగించే బాధ్యత నాది అని అభయం ఇస్తారు.

**ఉదా:** గురువు మన యొక్క అజ్ఞానాన్ని ఏ విధంగా తొలగిస్తారంటే ముందుగా మన యొక్క అహంకారాన్ని మననుండి దూరం చేస్తారు. ఈ అహంకారం అనేది అనేక కారణాల వల్ల వస్తుంది. కొంతమందికి తమ హెూదా చూసి, కొంతమందికి తమ దగ్గర వున్న ధనం చూసి

ఇంకొంతమందికి తమలోని పాండిత్యం చూసి ఇలా అనేక రకాలయిన అహంకారాలతో కన్నూ, మిన్నూ కానకుండా తప్పులు మీద తప్పులు చేస్తూనే వుంటారు. చివరకు రావణాసురుళ్ళా పతనమవటం జరుగుతుంది.

ఈ అహంకారంతో కళ్ళు మూసుకుపోయిన వ్యక్తికి ఆసూయ కూడా ఎక్కువైతే అందరూ దూరమౌతారు. ఆనందం కూడా ఆవిరైపోతుంది..

అలా కాకుండా మొదట్లోనే సద్గురువును ఆశ్రయించినట్లయితే ఈశ్వర స్థానమైన మనయొక్క మనస్సుని శుభ్రం చేసి (అందులో వున్న చెత్తా, చెదారం తొలగించి) అందులో ఆ పరమేశ్వరుణ్ణి ప్రతిష్టించి భగవదనుగ్రహం కలిగేలా చేసే వ్యక్తి ఒక్క గురువు మాత్రమే.

అలాటి గురువు శిష్యునికి లభించినట్టయితే శిష్యునిలోని చెడును తొలగించి, ఓర్పును ప్రసాదించి భగవదనుగ్రహం లభించేలా చేస్తారు.

జీవునికి అన్నిటికన్నా ముఖ్యమైనది ఆత్మ. స్థూల శరీరంకంటే ఇంద్రియాల కంటే, మనస్సు, బుద్ధి కంటే కూడా శ్రేష్ఠమైనదీ, సూక్ష్మమైనదీ, ఆత్మ ఒక్కటే.

ఈ ఆత్మ తప్ప మిగిలినవన్నీ కూడా మాయకు లోబడి వుంటాయి. ఎవరయితే ఈ ఆత్మ స్వరూపాన్ని పూర్తిగా తెలుసుకుంటారో వారు తమ ధర్మాన్ని ఆచరిస్తూ కూడా తామరాకు మీద నీటిబొట్టులా వ్యవహరిస్తారు.

ఈ శరీరం నాది కాదు నేను శుద్ధ చైతన్యాన్ని మాత్రమే అని తెలుసుకున్న జ్ఞానికి అహంకార మమకారాలు పోయి ఆత్మ స్వయంగా ప్రకాశించటం జరుగుతుంది. అలాటి వారికి మాత్రమే భగవదనుగ్రహం లభిస్తుంది. వారినే భగవంతుడు ఇష్టపడతాడు. అలాటి వారి జీవితం పవిత్రంగా, ఉత్తమంగా వుంటుంది. ఇది గురువు ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది.

బ్రహ్మతత్వ విచారణయే ఆధ్యాత్మిక సాధన. అదియే ఉపనిషత్తుల యొక్క సారాంశము. అసలు భగవంతుడు అంటే ఎవరు? సాధన అంటే

ఏమిటి? వీటి గురించి వివరంగా చెప్పగలిగేవారు గురువు మాత్రమే.

భగవంతుడు అంటే సత్, చిత్, ఆనందం. పంచభూతాలకు ఆధారభూతుడు పరమాత్ముడు. అటువంటి పరమాత్మతత్వాన్ని తెలుసుకోవాలంటే గురు కటాక్షం కావాలి.

గురువు ధర్మాన్నీ, జ్ఞానాన్నీ బోధించి పరబ్రహ్మస్వరూపమే ఆనందం అని తెలియపరుస్తాడు. ఆ బ్రహ్మాన్ని తెలుసుకుని దర్శించుకోవటానికి మార్గదర్శకులే గురువు.

ఈ జనన మరణాలూ, సుఖదు:ఖాలూ అందాల ప్రపంచం, ఇదంతా మిధ్య (అబద్ధం) అని అందరికీ తెలుసు. ఈ మనశ్శరీరాలు చూస్తున్నంత సేపూ, ఇవన్నీ నేనే అన్న భావన మనలో వున్నంత వరకూ ఈ బంధాల నుంచి మనంతట మనం బయటపడలేము.

మరి ముక్తి కావాలంటే ఈ బంధాల నుంచి బయటపడాలి. బయట పడాలి అంటే బలవంతంగా ఈ బంధాలను తెంపేసుకోవటం అని కాదు.

మనకి ఏది ఎంత వరకూ అవసరమో అంతవరకూ మాత్రమే ఉంచుకుని విషయ వస్తువులపై మోహం తగ్గించుకుని ఇంద్రియాలను అదుపులో పెట్టుకున్నట్టయితే మనస్సు అలజడికి లోనవదు.

గురుముఖంగా వీటన్నింటినీ తెలుసుకుని ఆచరించినట్లయితే ముక్తి పొందుటకు మార్గం ఏర్పడుతుంది.

❖ ❖ ❖

(24) శ్లో ॥ **మాభైష్ట విద్వంస్తవ నాస్త్యపాయః**
**సంసార సింధోస్తరేణే2స్త్యుపాయః**
**యేనైవ యాతా యతయో2స్యపారం**
**తమేవ మార్గం తవ నిర్దిశామి ॥**

ఓ విద్వాంసుడా భయపడకు నీకు వచ్చిన అపాయం ఏమీ లేదు.

ఈ సంసార సముద్రాన్ని దాటడానికి నా దగ్గర ఒక ఉపాయం వుంది. నువ్వు నిర్భయంగా వుండు.

నిజమయిన గురువు తనను శరణువేడుకున్న శిష్యుణ్ణి తనంతటి వ్యక్తిగా చేయాలనుకుంటారు.

ముందుగా గురువు శిష్యుణ్ణి వుద్దేశించి నాయనా! మానవులు రెండు రకాలుగా వుంటారు. (1) పుట్టుకతోనే జ్ఞానం కలిగిన వారు (2) శమాదిషట్కసంపత్తితో కష్టపడి జ్ఞానాన్ని పొందినవారు.

యతీస్వరూపులయిన వారందరూ ఏ విధంగా అయితే సంసారమనే సముద్రాన్ని దాటారో నీకు తప్పకుండా అలాటి మార్గాన్ని నేను నీకు తెలియచేస్తాను.

నాయనా సన్యాసములు రెండు రకములు : (1) వివిధష సన్యాసము (2) విద్వత్ సన్యాసము.

(1) వివిధష సన్యాసము అనగా తత్వజ్ఞానము సంపాదించదలెననెడి ధృఢనిశ్చయమతో కూడిన ఇష్టముతో చేయు సన్యాసము. ఇది దేహముక్తిని కలగజేస్తుంది.

(2) విద్వత్ సన్యాసము : అంటే తత్వజ్ఞానము సంపాదించాలనే బలమైన నిశ్చయంతో కూడిన ఇష్టంతో చేసే సన్యాసము. దీనికి ముక్తి జీవన్ముక్తి.

అవిద్య అనేది పూర్తిగా పోవాలంటే సంపూర్ణ వైరాగ్యం కలగాలి. ఈ అవిద్యపూర్తిగాపోతేనే కానీ మోక్షం రాదు. సన్యాసి అయినా, సంసారి అయినా సంపూర్ణ వైరాగ్యం వారు పొందాకే శిష్యుణ్ణి ముందుకి నడిపించగలరు. వీరు మాత్రమే భగవత్ స్వరూపాన్ని తెలుసుకోగలరు.

వీరు మాట్లాడే మాటలన్నీ కూడా శిషులకి రాచబాటలు. చంద్రుడు తన కాంతి ద్వారా చీకట్లను దూరం చేసి చల్లని వెన్నెలను కురిపించినట్లు జ్ఞాని అయిన సద్గురువు శిష్యులకు అభయమిచ్చి తత్వోపదేశం చేస్తారు.

**ఉదా:** మనం గాఢనిద్రలో వుండగా ఒక మంచి కల వస్తుంది.

మనం నిద్రలో వున్నంతసేపూ ఆ కల నిజంగా జరుగుతున్నట్టుగా వుంటుంది. ఎప్పుడయితే మెలుకువ వస్తుందో అప్పుడు అదంతా అసత్యమని కేవలం అది కల మాత్రమే అని తెలస్తుంది.

అలాగే సంసారం కూడా ఒక కలే. మనం ఒక సినిమా చూస్తాము. అందులో అనేకరకాలయిన బొమ్మలు కదులుతూ వుంటాయి. అవికొంత సేపు నవ్విస్తూ, మరికొంతసేపు ఏడిపిస్తూ వుంటాయి. ఇదంతా నడిపించిన వాడు తెరవెనుక వుంటాడు(డైరెక్టర్). సినిమా ముగిసిబయటకు వచ్చేసరికి ఏమీ వుండదు.

అలాంటిదే మన జీవితం కూడా. చూస్తున్నదీ లేదు. శరీరమూ లేదు. ఈ జననమరణాలు లేవు, వున్నది ఒక్కటే. ప్రపంచం, నువ్వు దానినే ఆత్మ అంటావు. జీవుడు వేరు, ఆత్మవేరు కాదు. అలా వేరు వేరు అనుకోవటం మన అవివేకం.

శరీరము, బుద్ధి ప్రాణం, మనస్సు ఇవన్నీ కూడా జడ పదార్థాలే వికారాలూ వుండవు. ఈ ఆత్మ పూర్ణమైనది, ఎప్పుడయితే ఆత్మ పూర్ణమైందని తెలిసిందో అది ఒకటిగానే వుంటుంది. అది అనేక రకాలుగా వుండదు అనేది సత్యం.

**ఉదా :** దృష్టులు 3 రకములు

**(1) దేహదృష్టి :** ఒక స్త్రీని కానీ, పురుషుణ్ణి కానీ చూడగానే వారి రూపురేఖలు, అందచందాలు, ఆకారం మాత్రమే చూస్తాము.

**(2) మనోదృష్టి :** వారి యొక్క గుణగణములు, పాండిత్యము వారి ప్రవర్తన అన్నీ చూస్తాము.

**(3) ఆత్మదృష్టి :** వారిని చూడగానే వారి యొక్క నిర్మలమైన ఆత్మదృష్టిని మాత్రమే చూడటం జరుగుతుంది.

ఈ ఆత్మదృష్టి మహనీయులు, అవధూతలు, మాత్రమే కలిగి వుంటారు.

❖ ❖ ❖

(25) శ్లో ॥ వేదాన్తార్థ విచారేణ జాయతే జ్ఞానముత్తమమ్ ।
తేనాత్యన్తిక సంసార దుఃఖ నాశో భవత్యను ॥

మనం ఏ విషయం తెలుసుకోవాలన్నా సద్గురువు ద్వారా తెలుసు కోవటం మంచిది. పురాణములు, ఇతిహాసములు, కొన్ని కొన్ని గ్రంథాలు, ఉపనిషత్తులు, ఇలా ముఖ్యమైన గ్రంథాలు తెలుసుకోవాలంటే ముఖ్యంగా గురువు ద్వారానే తెలుసుకోవాలి. వీటిని మనంతట మనం చదివేస్తే రావు. అర్థంకూడా కావు. మనలోని అజ్ఞానం తొలగించే ఒకేఒక్క వారధి సద్గురువు మాత్రమే.

పరబ్రహ్మ స్వరూపం కలిగిన నీవు అజ్ఞానంలో వున్నందువల్ల అనాత్మ అనే పాశం కలుగుతోంది. ఈ అనాత్మబంధం ఎప్పుడయితే కలిగిందో సంసారం అనే బంధం ఏర్పడిపోయింది. ఎప్పుడయితే ఈ సంసారం అనే భ్రమలో పడ్డామో అప్పుడే జనన మరణాలనేవి వుద్భవించటం వల్ల ఈ సంసార సముద్రం మనల్ని బాధలకు గురిచేస్తోంది.

స్వభావసిద్ధంగా పరమాత్మ స్వరూపం అయిన మనం ఈ భవబంధాలలో చిక్కుకుని అనేక రకాలయిన బాధలు అనుభవిస్తూ వాటి నుంచి మళ్ళీ బయటపడటం కోసం ప్రతీక్షణం మనం శ్రమించేలా ఏది చేస్తోందో దానిని మనం తెలుసుకుని గట్టిగా ఖండించగలగాలి.

**ఉదా:** మనం చీకట్లో మన నీడను చూసి భూతం అని భయపడే అవకాశం ఎలా అయితే వుందో అదే విధంగా ఆత్మతత్వం తెలుసుకోలేని కారణంగా ఊహలతో కూడుకున్న మనసు జనిస్తోంది. ఈ మనసు శరీరం ఇంద్రియాలనీ కల్పించుకుని పంచభూతాలతో నిర్మించబడి నటువంటి ఇంద్రియ భోగాలయిన విషయ వస్తువుల వెంట పరిగెడుతూ వాటి గురించి చాలా అనంతంగా గొప్పగా కల్పించుకుని ఆనందిస్తోంది.

మన జీవితంలోని రాగద్వేషాలే, బాధలూ, సుఖదు:ఖాలు, పాప పుణ్యాలు అన్నీ కూడా అహంకార రూపమయిన జీవునిచే అభిమానింప

బడుతూ వుంటాయి. ఈ అహంకారం తన యొక్క చితిలో తానే కాలి నశించిపోతుంది.

ఏది నిత్యం, ఏది అనిత్యం, ఏది ఆత్మ, ఏది అనాత్మ అనేది కనుక మనం విచారించినట్టయితే అందులో నుంచి పుట్టిన అగ్ని శ్రద్ధ, భక్తి ఏకాగ్రతతో మహాజ్వాలలా మారి అజ్ఞానాన్ని దాని ద్వారా వచ్చిన ఫలితాలను సర్వసాంసారికమయినటువంటి విషయవస్తువులను సమూలంగా నాశనం చేస్తుంది. ఇలాగ ఎప్పుడయితే ఈ అహంకారం నశించిపోతుందో అప్పుడే మనదయినటువంటి నిత్యానంద స్వరూపాన్ని అతి పవిత్రమయినటువంటి ఆత్మతత్వాన్ని గుర్తించగలుగుతాము.

భక్తి, జ్ఞాన, వైరాగ్యములతో కూడిన ప్రశాంతచిత్తము కలిగి లోకహితం కోరే వారును శాంత స్వరూపులను, దొంతులును అగు మహాత్ములు భయంకరమైన సంసార సముద్రంలో నుంచి తాము తరించటమే కాకుండా అందులో మునిగిపోయి బయటకు రాలేక నిస్సహాయతతో ఉన్న అనేకమందిని కూడా రక్షించగలుగుతున్నారు.

మహాత్ముల యొక్క సహజ స్వభావం ఎలా వుంటుంది అంటే ప్రచండుడయిన సూర్యుని యొక్క కర్కశమైన వేడిని చంద్రుని మీద ప్రసరిస్తున్నా చంద్రుడు ఆ బాధను భరిస్తూ మనకి వెన్నెలని ఎలా పంచుతున్నాడో అలాగే గురువు ఎంతో కష్టపడి తనకి వున్న జ్ఞానాన్ని చాలా సులభంగా శిష్యులకు ఉపదేశిస్తారు.

సూర్యుని యొక్క వెలుతురు వున్నంతసేపూ చీకటి వుంటుందా? వుండదు. అలాగే జ్ఞానం వున్నచోట అజ్ఞానం కూడా వుండదు.

**ఉదా:** ఒకరోగి తన రోగ నివారణ కోసం డాక్టర్‌ని(వైద్యుణ్ణి) సంప్రదించటం ఎంత అవసరమో అలాగే జ్ఞానాన్ని పొందాలంటే గురువుని ఆశ్రయించక తప్పదు. ఈ గురువు ఎలా వుండాలి అంటే సర్వ శాస్త్రముల యొక్క సారాన్ని తెలుసుకున్న వారై వుండాలి.

తలితండ్రులు ఇచ్చిన జన్మ పూర్తయితే మళ్ళీ జన్మనెత్తిక తప్పదు. గురువు పెట్టిన జ్ఞానభిక్ష ద్వారా వైరాగ్యమనే ఆయుధంతో సంసారమనే సాగరాన్ని దాటగలగాలి. ఈ సత్యాన్ని గ్రహించి మోక్షం కోసం ప్రయత్నించటానికే ఈ జన్మ మనకు ప్రసాదించారని గురుముఖంగా తెలుసుకోవాలి.

మోక్షం కావాలంటే జ్ఞానం రావాలి. జ్ఞానం రావాలంటే కర్మ వుండాలి. ఆ కర్మ ఎలా వుండాలంటే అది సత్కర్మ అయివుండాలి. అది ధర్మబద్ధంగా వుండాలి.

❖ ❖ ❖

(26) శ్లో ॥ **కోనామ బన్ధః కథమేష ఆగతః,**
**కథం ప్రతిష్ఠాస్య కథం విమోక్షః**
**కో2సావనాత్మా పరమఃక ఆత్మా,**
**తయోర్వివేకః కథమే, తదుచ్యతామ్ ॥**

శిష్యుడు : (1) స్వామీ బంధం అంటే ఏమిటి? (2) ఆ బంధం ఎలా కలుగుతుంది (3) బంధానికి నిలకడ ఎక్కడిది? దీని నుంచి విముక్తి కలగాలంటే ఏం చేయాలి. (4) అసలు ఆత్మ అంటే ఏమటి? (5) అనాత్మ అంటే ఏమిటి? (6) ఈ రెండింటి తారతమ్యం తెలియాలంటే ఏం చేయాలి? (7) దీని గురించి నాకు వివరించండి స్వామీ?

ఇవి ఏడు ప్రశ్నలు. ఈ ఏడు ప్రశ్నలకూ సమధానాలు మనకు తెలిసినట్లయితే సమస్త శాస్త్రముల సారాంశము తెలిసినట్లే.

అద్భుతమైన ఈ ప్రశ్నలు గురువుగారిని అడగటంలోనే శిష్యుడి యొక్క శ్రద్ధ, కృషి అవగతమౌతోంది. అప్పుడు శిష్యుని యొక్క ప్రశ్నలు విని గురువుగారు అతని శ్రద్ధకు మెచ్చి ఒక కథను చెప్పారు.

**ఉదా:** పూర్వం రైభ్యుడు అని ఒక మహర్షి ఉండేవారు. అతనికి అర్వా వసువు, పరావసువు అని ఇద్దరు కొడుకులు. ఆ పిల్లలిద్దరికీ

వేద విద్యలు నేర్పించి వారితో పాటుగా రైభ్యుడు చదువుతుంటే మిగిలిన మహర్షులు ఆనందంగా విని ఆశీర్వదించి వెళ్ళేవారు.

వీరిని చూసి భరద్వాజ మహర్షి కొడుకయిన అవక్రీతుడు అసూయ పడుతూ వుండేవాడు.

రైభ్యుడు, భరద్వాజలు మాత్రం అన్నదమ్ముల్లా కలిసిమెలిసి వుండేవారు.

అవక్రీతుడు అన్నీ వేదాలూ రావాలని ఇంద్రుని గురించి తపస్సు చేసాడు. దానికి ఇంద్రుడు నాయనా వేదాలు గురుముఖంగా నేర్చుకోవాలి. కానీ, తపస్సు ద్వారా సాధ్యపడదు అని ఎంతగానో నచ్చ చెప్పాడు. కానీ అవక్రీతుడు వినలేదు.

చేసేదేమీ లేక ఇంద్రుడు నువ్వు కోరినట్టుగానే వరం ఇస్తాను. కానీ ఆ వేదాలు నీకు ఎంతవరకూ ఉపయోగపడతాయో మాత్రం నాకు తెలియదు. నేను మాత్రం చెప్పలేను ఖచ్చితంగా అని చెప్పాడు.

అవక్రీతుడికి వేదాలు వచ్చాయన్న గర్వం పెరిగిపోయి ఒకరోజు రైభ్యుడి కోడల్ని అవమానించాడు.

అది చూసి తట్టుకోలేని రైభ్యుడు ఒక రాక్షస జంటను పుట్టించి వారితో అవక్రీతుణ్ణి చంపించాడు.

అప్పుడు పాపం భరద్వాజ మహర్షి కొడుకుకి దహన సంస్కారాలు జరిపించి ఆ పుత్ర శోకం భరించలేక శరీరాన్ని త్యాగం చేసాడు.

ఇదిలా వుండగా ఒకరోజు రైభ్యుని కొడుకు ఇంటికి వస్తూంటే ఒక మృగం అతని మీదకు వస్తుంటే చేతిలో కట్టను దాని మీదకి విసరగా అది అక్కడే నిద్రపోతున్న రైభ్యమహర్షికి తగిలి ఆయన చనిపోయాడు.

అది తట్టుకోలేని రైభ్యుని కొడుకు ఆర్వావసువు తపస్సు చేయగా అతని తపస్సుకి మెచ్చిన దేవతలు ఏంకావాలో కోరుకోమంటే రైభ్య, భరద్వాజ, అవక్రీతుల్ని బ్రతికించమని కోరుకోగా వారిని దేవతలు బ్రతికించారు.

అప్పటి నుంచీ అవక్రీతుడు గర్వం విడిచి అందరిలో కలిసిమెలిసి ఉండటం మొదలు పెట్టాడు.

రైభ్యమహర్షి తీర్థయాత్రలు చేస్తూవుండగా సనత్కుమారుడు రైభ్యమహర్షి దగ్గరకు వచ్చి అతని తపోదీక్షని పొగిడాడు. అలాగే విష్ణుమూర్తి కూడా రైభ్య మహర్షి తపస్సుకు మెచ్చి ఏంకావాలో కోరుకోమంటే; రైభ్యమహర్షి సనకాదులుండే చోటుకి నన్ను కూడా పంపమని కోరాడు. వెంటనే విష్ణుమూర్తి రైభ్యుని కోరిక తీర్చగా రైభ్య మహర్షి మోక్షాన్ని పొందాడు.

ఏ విద్య అయినా గురుముఖంగా నేర్చుకోవాలనీ, ఏ పని చేసినా దాని ఫలం భగవంతునికి అర్పించాలని ఈ కథ ద్వారా గురువు తెలియజేసారు.

❖ ❖ ❖

(27) **శ్లో ॥ అజ్ఞాన సర్పదష్టస్య బ్రహ్మజ్ఞానౌషధం వినా ।**
**కిము వేదైశ్చ శాస్త్రైశ్చకిము మంత్రైః కిమౌషధైః ॥**

జ్ఞానం వ్యక్తుల నుంచి రాదు, భగవంతుని నుంచి మాత్రమే వస్తుంది. దానిని మనకు పూర్తిగా అందించేవారు గురువు. భగవంతుడు వేరు, జ్ఞానము వేరు కాదు. ఈ బ్రహ్మజ్ఞానం కలిగిన వారికి సుఖ,దు:ఖాలు కానీ, మోహాలు కానీ వుండవు.

ఒక వ్యక్తిని పాము కరిస్తే వైద్యం వల్లకానీ, మంత్రంవల్ల కానీ బ్రతుకుతారు. కానీ ఈ అజ్ఞానం అనే సర్పం బారి నుంచీ మనం బయట పడాలి అంటే సరయిన మందు బ్రహ్మజ్ఞానం మాత్రమే. ఎవరయితే బ్రహ్మ జ్ఞానాన్ని తెలుసుకుంటారో వాళ్ళకి అజ్ఞానం పూర్తిగా తొలగిపోతుంది.

అజ్ఞానంతో వున్న వ్యక్తి మసక చీకట్లో తాడును చూసి పాము అనుకుంటాడు. దీనివల్ల అనేక అనర్థాలు జరుగుతాయి. అదే సమయంలో వెలుతురు పడి అది పాము కాదు తాడు అని తెలుసుకున్న

వ్యక్తి అజ్ఞానం నుంచి తొలగిపోయి తాడు తాడుగా మాత్రమే తెలుసుకోవటం జరుగుతుంది. ఎప్పుడయితే ఈ అజ్ఞానం తొలగిపోయిందో అప్పుడు అనర్థాలు వుండవు. అలాగే తన స్వరూపాన్ని పరమాత్మ స్వరూపంగా తెలుసుకుంటారో వారికి అజ్ఞాన నివృత్తి కలుగుతుంది.

**ఉదా:** ఒకవూరిలో ఒక బ్రాహ్మణుడు వుండేవారు. అతను పూజలు, వ్రతములూ చేయించి ఆ వచ్చిన ధనంతో కుటుంబాన్ని పోషించేవాడు. ఒకరోజు పనిమీద పొరుగూరు వెళ్ళి వస్తుండగా ఒకచోట గడ్డి మేటు కాలిపోతూ కనిపించింది. అందులో నుంచి రక్షించండి.. కాపాడండి; అని అరుస్తున్న పామును చూసి ఆ బ్రాహ్మణుడు పామువున్న వైపు వెళ్ళసాగాడు. అక్కడ దీనస్థితిలో బాధపడుతున్న పామును చూసి జాలిపడి ఆ బ్రహ్మణుడు తనచేతి కఱ్ఱకు ఒక గుడ్డసంచిని కట్టి ఆ గడ్డివాములో వున్న పాము దగ్గర పెట్టగానే పాము ఆ సంచిలో దూరింది. ఆ బ్రాహ్మణుడు ఆ కఱ్ఱను బయటకుతీసి పాముని రక్షించాడు.

సంచిలో నుంచి బయటపడిన పాము ఒక్కసారి హాయిగా వూపిరి తీసుకుని బ్రాహ్మణుడి వంక చూసి ఈ మానవులు మాకు శత్రువులు... రక్షించాడు కదా అని వదిలేద్దామంటే రేపు ఎప్పుడయినా ఇతనే నన్ను చంపేయవచ్చు. ముందుగా నేనే కరిస్తే చస్తాడు కదా! అనుకుని బుస్‌మని బ్రాహ్మణుడి మీదకి ఉరకబోయింది. అది చూసిన బ్రహ్మణుడు పరుగుపెట్టటం మొదలుపెట్టాడు.

కొంత దూరం వెళ్ళేసరికి ఒక గాడిద కనిపించి పరుగు పెడుతున్న బ్రాహ్మణుడ్ని చూసి అయ్యా! మీరెందుకు అలా ఖంగారు పడుతున్నారు అని అడిగింది.

జరిగింది అంతా చెప్పారు బ్రాహ్మణుడు.

ఈలోగా పాము అక్కడికి వచ్చింది. అప్పుడు పాముని కూడా అదే విధంగా అడిగింది గాడిద.

బ్రాహ్మణుడు, పాము ఒకే విధంగా చెప్పటం గమనించిన గాడిద అయ్యా! మీరు ఖచ్చితంగా పాముకి శత్రువే. కాబట్టి మిమ్మల్ని చంపటంలో తప్పులేదు, కానీ అసలు మీరు పామును సంచిలోకి ఎలా పంపారు. పాము ఎలా దూరింది, మీరు ఎలా రక్షించారు అనేది నేను కళ్ళతో చూస్తేనే కానీ నేను నమ్మను అన్న గాడిద మాటలకు పాము, బ్రాహ్మణుడు ఒప్పుకుని మళ్ళీ మంటల దగ్గరకు వెళ్ళాక బ్రాహ్మణుడు పాముని కట్టకు కట్టి సంచిలోకి పంపి ఆ సంచిని మంటల్లో వదిలాడు.

వెంటనే పాము ఆ వేడి తట్టుకోలేక ముందు ఎలా అరిచిందో అలాగ అరవసాగింది రక్షించమని.

పాపం అమాయకుడైన ఆ బ్రహ్మణుడు మళ్ళీ పాముని రక్షించబోతే తెలివైన గాడిద అయ్యో వెఱ్ఱి బ్రాహ్మణుడా అది విషపు పురుగు అది దాని గుణం మార్చుకోదు. నువ్వు మళ్ళీ రక్షిస్తే, నిన్ను కరవటం తథ్యం కాబట్టి దానిని అందులోనే వదిలేయ్ అని చెప్పింది.

గాడిద మాటలతో బ్రాహ్మణుడికి జ్ఞానోదయం అయింది.

పై కథను బట్టి మనకు అర్థం అయ్యేది ఏమిటి అంటే అజ్ఞానంతో బ్రాహ్మణుడు పాము బారిన పడి ఎలా ఇబ్బందిపాలయ్యాడో తెలిసిందిగా అందువల్ల అజ్ఞానం అనే సర్పం మనని పట్టుకున్నట్టయితే మనం దాని బారి నుంచి బయటపడాలి అంటే జ్ఞానం అనే అగ్నిలో అజ్ఞానాన్ని దహించివేయగలగాలి. జన్మ, మృత్యు, రూప, రసములతో కూడిన సంసారము నశించుటకు బ్రహ్మజ్ఞానము మాత్రమే దివ్యౌవషధము.

అజ్ఞాని అయినవారు సంసారం అవసరమనుకుని దానినే పట్టుకుని వేళ్ళాడుతూ వుంటారు. కానీ జ్ఞానం పొందిన వారు ఈ సంసారం నిస్సారము అని తెలుసుకుని సారవంతమైన పరమాత్మను పట్టుకుని తరిస్తారు

❖ ❖ ❖

**(28) శ్లో ॥ మజ్జాస్థి మేదః పలరక్త చర్మ,**
**త్వగాహ్వాయైర్ధాతుభిరేభిరన్వితమ్ ।**
**పాదోరువక్షో భుజపృష్ఠ మస్తకై**
**రంగైరు పాంగైరుప, యుక్తమేతత్ ॥**

మన యొక్క ఈ శరీరం అందమైన గిఫ్ట్‌ప్యాక్‌లాంటిది. ఈ శరీరం కొవ్వు, ఎముకలు, మెదడు, మాంసము, రక్తము, చర్మము (సూక్ష్మ), బయట మనకు కనిపించే చర్మము అనేపేర్లతో(సప్త) ఏడు ధాతువులతో తయారు చేయబడింది.

అంతే కాకుండా పాదములు, తొడలు, రొమ్ము, చేతులు, వీపు, శిరస్సు అనబడే అవయవముల చేతను, కళ్ళు, ముక్కు అను ఉపాంగముల చేతను తయారుచేయబడినది ఈ దేహం. అలా ప్రసిద్ధమైన ఈ శరీరం స్థూలశరీరంగా చెప్పబడింది.

అసలు మానవ జన్మ తీసుకునే ముందు జీవుడు తల్లిగర్భంలో ప్రవేశించాక ఎలా వృద్ధి చెందుతుందో తెలుసుకుందాం!

జీవుడు ముందుగా తల్లిగర్భంలోకి ద్రవరూపంలో ప్రవేశించటం జరుగుతుంది. ఆ తరువాత రెండవనెలలో మాంసపిండంలాగా తయారవుతుంది. ఇక మూడవమాసంలో మొలకల్లాగ అవయవాలు ఏర్పడతాయి. నాలుగవ మాసంలోకి వచ్చేసరికి కదలికలు మొదలవుతాయి అంతే కాకుండా పురుషుని శరీరం నుంచి ధైర్యము, స్త్రీ శరీరం నుంచి భయములతో పాటు భావాలు ఏర్పడతాయి. అయితే వీరిలో భావాలున్నా.. వాటిని వ్యక్తపరిచే శక్తి మాత్రం వుండదు.

అందువల్ల వీరు తల్లి హృదయంతో, బిడ్డ హృదయం కలిసి వారి యొక్క కోరికలు తల్లి ద్వారా వ్యక్తమవటం జరుగుతుంది. అందువల్లే తల్లిలోని కోరికలే పిల్లలకు వస్తాయి.

ఇక 5వ నెలలో రక్తము, మాంసము ఏర్పడతాయి.

6వ మాసంలో గోళ్ళు, వెంట్రుకలు వస్తాయి. 7వ మాసం వచ్చే సరికి రంగు, రూపాలతో పాటు అవయవాలన్నీ ఏర్పడతాయి. అంతే కాకుండా బిడ్డ తన రెండు చేతులనూ రెండు కాళ్ళ మధ్యకూ తీసుకుని రెండు చెవులూ మూసుకుని పడుకుని వుంటాడు. ఇదంతా వారంతట వారికే వస్తుంది.

8వ మాసంలో బిడ్డకు ఓజస్సు, తేజస్సు కలుగుతుంది. 9వ మాసం వచ్చేసరికి బిడ్డ సంపూర్ణంగా తయారవుతుంది. బిడ్డ స్థిరంగా వుంటుంది.

తల్లిబొడ్డు తాడు ద్వారా ఆహారం బాగా అందుతుంది. వాడికి ఏడుపు కూడా ప్రారంభం అవుతుంది.

అప్పుడు తల్లిగర్భంలోని వాయువు బిడ్డని బయటకు త్రోయటానికి ప్రయత్నిస్తున్న సమయంలో నొప్పులు ప్రారంభమై బిడ్డ భూమి మీద పడుతుంది.

శుషుమ్నా నాడి తెరుచుకుంటేనే కానీ (ఓపెన్ అయితేనే కానీ) బిడ్డకు మాటలు రావు. మాటలు వచ్చేంతవరకూ ఈ బిడ్డ ఏడుస్తూనే వుంటాడు.

అలా భూమి మీదకు వచ్చిన శిశువు, తల్లి గర్భంలో తనుపడ్డ నరకమంతా మర్చిపోయి కోరికలు అనే భయంకరమైన వ్యాధితో వాస్తవాన్ని తెలుసుకోలేక అహంకార, మమకారాలతో కొట్టుకుంటూ సెకన్లు, క్షణాలు, పూటలు, రోజులూ వృథా చేసుకోవటం జరుగుతోంది.

ఇలాగే బాల్యం, యవ్వనం, కౌమారం వెళ్ళిపోయి వృద్ధాప్యంలోకి ప్రవేశించేసరికి అవయవాలన్నీ బలహీనమైపోయి, శరీరం శుష్కించి పోయి లెక్కలేనన్ని రోగాలతో నా అనేవారు. పలకరించే దిక్కూ లేక మళ్ళీ మనం కుంభీపాకంలో పడటం జరుగుతోంది. (జీవుడు తల్లి గర్భంలో పడే నరకంతో పాటు తల్లికి కలిగే అనారోగ్యాలు కూడా

అనుభవించ వలసి వస్తుంది. అంతే కాకుండా తల్లి కడుపులోని ఆహారం జీర్ణమయి పోయి అవిమలమూత్రాలుగా మారితే అందులో ఈదుతుంటే ఆ బాధే కుంభీపాకం అని గుర్తుకు వస్తుంది.)

వృద్ధాప్యంలోకి ప్రవేశించేసరికి అప్పుడు గుర్తుకు వస్తుంది. ఈ జీవుడికి అయ్యో వయసులో చేసుకోవలసిన జపం, తపం, ధ్యానం, పూజా, పునస్కారం, దానం, ధర్మం అన్నీ చేయకుండా వదిలేసి ఇప్పుడు ఏడ్చి ప్రయోజనం ఏముంది అని తెలుసుకునే లోపలే మృత్యువు సమీపంచే సమయం ఆసన్నమౌతుంది.

ఒక ప్రక్క నుంచి యముడు, తన పాశాలతో కాళ్ళులాగుతుంటే, మోహపాశాలతో బిడ్డలు లాగుతూ వుంటారు. ఈ సమయంలో ఎవరూ ఆదుకోరు. మన దగ్గర మనం దాచుకున్న డబ్బు కానీ, చుట్టాలు కానీ ఎవ్వరూ రక్షించలేరు.

కన్ను తెరిస్తే జననం, కన్నుమూస్తే మరణం. ఈ శరీరంలో జీవుడు వున్నంతసేపూ శివం, ఆ జీవుడు ఈ శరీరాన్ని వదిలిస్తే శవం. ఎంత అందం, ఐశ్వర్యం, హెూదా, పరపతీ వున్నా ఆ జీవుడు పైకి పోగానే ఆ శరీరాన్ని ఎంత తొందరగా వదిలించుకుందామా అని చూస్తాం కానీ అబ్బ ఇంత అందమైన ఈ శరీరాన్ని ఇంట్లో దాచుకుందాం అనుకుంటామా? అనుకోము. పైగా ఎంత అందమైన పేరువున్నా ఆ పేరుతో ఎవ్వరూ పిలవరు. ప్రాణం పోగానే శవం అనే అంటారు.

**ఉదా:** ఒక మహారాణి ఉండేదట. ఆవిడ చాలా చాలా అందంగా ఉండేదట. ఆవిడ టాంగాలో ఎక్కి వన విహారానికి వెళ్తుంటే జనం బారుల తీరినుంచునేవారు. అందరూ తన అందం చూసి మురిసి పోతూంటే ఆవిడ వారి మీదికి కేకులు బిస్కెట్లు, చాక్లెట్లు, విసురుతూ వుంటే జనం వాటి గురించి ఎగబడి తొక్కిసలాటలో జనంకి దెబ్బలు తగులుతుంటే వాళ్ళని పిచ్చివాళ్ళలా చూసి అహంకారంతో మురిసిపోయేది.

ఇలా కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. మృత్యువు ఆమెని కబళించింది. అంతవరకూ ఆమె వెంటబడి ఆమె అందాన్ని పొగుడుతూ భజన చేసే వారందరూ కూడా ఆమెను ఎంత తొందరగా పంపేద్దామా అని ఎదురు చూసారు.

ఏ అందం, ఐశ్వర్యం చూసి మనం మురిసిపోయామో అదంతా మాయ అని తెలుసుకోలేక నావారు, నాది, నాకు, నా నా నా అనుకుంటూ కాలాన్ని వృథా చేసుకుంటున్నాము.

ఈ నా నా అనేవారే ఎవ్వరూ కూడా పోయిన వారి వెంట వెళ్ళరు, వెళ్ళలేరు. అంతవరకూ ప్రతీదానికీ వెంట వుండేవారు కూడా శ్మశానం గేటుదాటి లోపలకి కూడా రాలేరు.

అయితే కొన్ని మాత్రం మన వెంట ఎంత వద్దన్నా వస్తూనే వుంటాయి అవే కర్మలు, పాపపుణ్యాలు, ఈ కర్మ అంటే ఏమిటంటే కొన్నిరోజులు ఆలస్యమైనా మనం ఏం చేస్తే అదితిరిగి, తిరిగి మళ్ళీ మన దగ్గరకే వస్తుంది. ఆ దేవుడు మనల్ని ఏం చేస్తాడులే. ఆయనకి మనల్ని గమనించటమే పనా అనుకుని అడ్డదారిలో మనం చేసే ప్రతీ కర్మఫలం ఆఖరిదాకా అనుభవించి కానీ ఈలోకం నుంచి కదలం. కొన్ని తప్పులకి మాత్రమే ఈలోకంలో శిక్షపడ్తుంది ఒకవేళ ఆయుర్ధాయం అయిపోయి పాపపుకొండ తరగని పక్షంలో జన్మమీద జన్మ, జన్మమీద జన్మ తీసుకుంటూ జన్మలు ఎత్తుతూనే వుంటుంది. అది ఏ జన్మ అనేది మన కర్మలపైనే ఆధారపడి వుంటుంది.

**ఉదా:** మనం కడుపులోకి ఎంతో రుచికరమైన మధుర పదార్ధం తీసుకుంటాము. అది వాంతి రూపంలో బయటకు వస్తే ఎంత భయంకరమైన వాసనతో అసహ్యంగా వుంటుందో తెలుసుకోగలిగితే ఈ తాపత్రయాలు, వ్యామోహాలు అనవసరం అని తెలుస్తుంది.

❖ ❖ ❖

(29) శ్లో ॥ య యేషు మూఢా విషయేషు బద్ధా
రాగోరుపాశేన సుదర్ధమేన
ఆయాన్తి నిర్యాన్తథ ఊర్ధ్వ ముచ్చైః,
స్వకర్మదూతేనః జవేననీతాః ।

ఇంక రాగమును గురించి దానివల్ల కలిగే నష్టాల గురించి శ్రీ ఆదిశంకరాచార్యుల వారు ఈ విధంగా చెప్తున్నారు. ఈ అనురాగమనేది ఎంతో ఆసక్తికరమైనది. ఇది మనల్ని మోహంలో పడేసి కన్నూ, మిన్నూ కానకుండా చేస్తుంది. మళ్ళీ ఈ కర్మపాశంలో రెండు మార్గాలు గోచరిస్తున్నాయి.

(1) స్వర్గం (2) నరకం

కర్మ అంటే ఒక ప్రవాహం అనీ, ఆ ప్రవాహంలోనే మనం కొట్టుకుపోతున్నామనీ మంచి కర్మలు చేస్తే స్వర్గం లభిస్తుందనీ, చెడు కర్మలు చేస్తే నరకం అనుభవించవలసి వస్తుందనీ చెప్తూ ఉంటారు.

ఎలాటి కర్మలు చేసినా ఫలితం అనుభవించక తప్పదు. ఈ స్వర్గ నరకాలనే ప్రవాహంలో మన జీవితం కొట్టుకుపోవటం జరుగుతోంది.

మూర్ఖులైన మానవులు విషయ, వస్తువులకు ప్రలోభపడి ఆ సుఖాలనే నిజం (సత్యం) అనుకుని అందులోనే ఆనందం వెతుక్కుంటూ ఇది నాది, అది నాది (నాకు అది ఇష్టం,ఇది ఇష్టం) అనుకుంటూ అనురాగమనే పాశంలో బంధింపబడటం జరుగుతోంది.

అలాటి వారిని భగవంతుడు వారి యొక్క కర్మలకు అనుగుణంగా స్వర్గ నరకాలకు పంపి అక్కడ పుణ్యకర్మఫలాలు, పాపకర్మఫలాలు అనుభవించాక అక్కడ కర్మలు పరిపక్వమైయ్యాక తిరిగి మళ్ళీ భూమి మీదకి పంపటం జరుగుతుంది.

సాధారణంగా చాలా మంది స్వర్గంలోకి వెళ్ళాక హాయిగా, ప్రశాంతంగా సాధన చేసుకుని తరించవచ్చు అనుకుంటారు. కానీ అది

సాధ్యమయ్యే పనికాదు. ఎందువల్ల అంటే... మన కర్మఫలాలు తొలగగానే మళ్ళీ జన్మ తీసుకుని భూమ్మీదకి రాక తప్పదు. అది మనం ముందగా గ్రహించి కుక్కగానో, పందిగానో, నల్లిగానో, పిల్లిగానో పుట్టకుండా వుండాలంటే పుణ్యకర్మ, పాపకర్మ అనేది ప్రక్కనపెట్టి పూర్తిగా వైరాగ్యము, మోక్షము కావాలంటే సాధన ద్వారా మాత్రమే ఇది సాధ్యం అవుతుంది.

కానీ, మనకి వున్న వైరాగ్యం ఎలాటిది అంటే మన ఇల్లు పాతబడితే కొత్త ఇల్లు కావాలనుకుంటాము. పాత ఇంటిమీద వైరాగ్యంతో కాదు కొత్త ఇంటిమీద మమకారంతో, కానీ మనకి ఇలాటి వైరాగ్యం కాదు కావలసింది.

**ఉదా:** ఒక రాజు గారు పదేపదే ఈ రాజ్యం అంతానాదే, నన్ను మించిన రాజులు లేరు. ఈ భూములన్నీ నావే, ఇదంతా నాదే అని అంటూ ఇరుగు పొరుగున వున్న చిన్న చిన్న రాజ్యలరాజుల్ని హేళన చేస్తూ వుండే వాడు.

పాపం ఆ చిన్నరాజ్యాలు కలిగిన రాజులు చేసేదేమీ లేక వారు తలలు వంచుకుని వెళ్ళిపోయేవారు.

ఇదంతా గమనించిన భూదేవి రాజు యొక్క అహంకారం పరాకాష్టకు చేరిందని గ్రహించి ఆ రాజుతో ఇలా అందట....

ఓ రాజా! నీకంటే ముందు ఎందరో రాజులు ఈ రాజ్యాన్ని పాలిస్తూ ఇలాగే అనుకునేవారు. కానీ ఎవ్వరూ అంగుళం భూమినే కాదు దేన్నీ కూడా తీసుకు వెళ్ళలేకపోయారు.

జీవితంలో నేను బాగుపడాలి. ఇదంతా నాదే, నేనే అనుభవించాలి అనుకునేవారికి, అందరూ బాగుండాలి.. అందులో మనమూ వుండాలి అనుకునే వారికీ తేడా గమనించినట్టయితే అప్పుడు భగవంతుడు నేను మాత్రమే అనుకున్న వారికి.. ఒక్కచేత్తోటి అందరిలో నేను కూడా అనుకునే వారికి రెండు చేతులతో పాటు ముక్కోటిదేవతల ఆశీర్వచనాలు ఇచ్చి వారిని ఉన్నతశిఖరాలకు చేరుస్తాడు.

ఏ మట్టిని చూసి మనం మనభూమి, మనరాజ్యం, మనపొలం అని భ్రమలో బ్రతుకుతున్నామో ఆ మట్టే మనలో ప్రాణం వున్నంతవరకూ మన కాళ్ళ క్రింద, మనం శరీరం విడిచాక మన శరీరంపైన వుంటుందనేది గ్రహించుకుని మంచికర్మలు మాత్రమే చేయటం మంచిది.

నిజం చెప్పాలంటే మన జీవితం ఒకరైలు ప్రయాణంలాంటిది. ట్రైన్ ఎక్కిన వెంటనే అందరూ మనతోనే ఉన్నట్టు ఉంటుంది. కానీ ఎవరి స్టేషన్ వచ్చినపుడు వారు దిగిపోతూ వుంటారు. ప్రయాణం ముగిసేలోగా ఒక సత్యం మనకి తెలుస్తుంది. అదేమిటంటే ఎవరూ మనతో రారు, మన కోసం ఆగరు అని, ఈ నిజంతో పాటు జీవితంలో కోపం, కష్టం, రాగద్వేషాలూ, ఈర్ష్యా అసూయలు అన్నీ కూడా మనం బ్రతికి వున్నన్నాళ్ళు మనతోనే ప్రయాణిస్తాయి.

కానీ మరణం అనే స్టేషన్‌లో మనం దిగిపోతే ఇవేవీ కూడా మనతో రావు వీటియొక్క కర్మఫలాలు తప్ప.

శరీరంలో వూపిరి ఆగిపోతే అది అగ్నిపాలైపోతుంది. ఎంత సంపాదించినా వీసమెత్తు కూడా మనతో రాదు అవి కేవలం పరులపాలే. ఆ హస్తికలు జాగ్రత్తగా తీసి గంగపాలు చేసేస్తారు. ముక్కుతూ, మూలుగుతూ మొక్కు బడిగా పిల్లలు పెట్టే ఆ పిండాలు కాస్తా కాకుల పాలయిపోతాయి.

ఇదంతా ఎంత నిజమో తెలిసాక మనం మారకపోతే అది మన ఖర్మ అని అర్థమౌతుంది.

❖ ❖ ❖

(30) శ్లో ॥ **శబ్దాదిభిః పంచభిరేవ పంచ,**
**పంచత్వ మాపుః, స్వగుణేన బద్ధాః ।**
**కూరంగ మాతంగ పతంగ మీన,**
**భృంగా నరః పంచభి రంచితః కిమ్ ॥**

జింక, ఏనుగు, మిడత, చేప, తుమ్మెద అనే ఈ 5 జంతువులు శబ్దాది పంచగుణాలకు బానిసలై పంచతన్మాత్రలైన వాసన, రుచి, కాంతి (దీపం వెలుగు) స్పర్శ, శబ్దాలకు బానిసలై వాటి ప్రాణాలు కోల్పోవటం జరుగుతోంది.

ఎలాగ అంటే... జింకకు డప్పు శబ్దం అంటే చాలా ఇష్టం. ఆ శబ్దం వినగానే తనని తాను మరిచిపోయి వేటగాని బాణానికి బలౌతుంది.

ఏనుగు ఇది మంద బుద్ధి కలిగివుంటుంది. దానికి తోడు ఒక ఏనుగు ఇంకొక ఏనుగుతో కలిసి ఒకదానిని ఒకటి రాసుకుంటూ ఆ స్పర్శతో (ఆరాపిడిలో) ఆనందాన్ని అనుభవిస్తూ తమని తాము మర్చిపోయి వాటి గురించి తీసిన గోతిలో పడి అందులో నుంచి బయటపడలేక తనువు చాలిస్తాయి.

మిడత దీనినే దీపంపురుగు అనికూడా అంటారు. ఇది దీపం వెలిగించిన చోట ఆ మంటకు (కాంతికి) ఆకర్షింపబడి ఆ అగ్నిలో (మంటలో) పడి చచ్చిపోతుంది.

చేప ఇది తనయొక్క జిహ్వాచాపల్యం వల్ల ఎరను మింగబోయి గాలానికి తగులుకుని ప్రాణం విడుస్తుంది.

తుమ్మెద మంచివాసనకు భ్రమసి సంపెంగ వద్దకుపోయి బంధాలలో చిక్కుకుని తన తనవును చాలిస్తోంది.

ఇలా ఒక్కొక్క ఇంద్రియం కలిగిన పశు, పక్ష్యాదులే తమ ఇంద్రియములను జయించలేక (వాటికి (జ్ఞానం) ఆ ఆవకాశం లేక) మృత్యువాత పడుతున్నాయి.

అలాటిది 5 ఇంద్రియాలు కలిగిన మానవులు పరిస్థితి ఒక్కసారి ఆలోచించండి.

అలాగే మనిషికూడా ఈ పంచతాన్మాత్రలకు బంధీ అయినందు వల్ల జన్మల్ని, కర్మల్ని అనుభవించక తప్పటం లేదు.

**ఉదా:** ఒకానొక సమయంలో అర్జునుడు స్వర్గలోకానికి వెళ్ళాడు. అప్పుడు అర్జునుని దగ్గరకు ఊర్వశి వచ్చింది. ఆమెను చూసిన అర్జునుడు అమ్మా అని పిలుస్తాడు.

అర్జునుడు అమ్మా! అని పిలవగానే ఊర్వశి నేను ఏ విధంగా నీకు అమ్మనయ్యాను అని అడుగుతుంది.

అమ్మా! నేను భూలోకం నుంచి స్వర్గలోకానికి వచ్చాను. నువ్వు ఇంద్రున్ని ఆనందింపచేసే స్త్రీవి. ఇంద్రుడు నాకు తండ్రి అందువల్ల నువ్వు నాకు తల్లివవుతావు అని సమాధానం చెప్తాడు అర్జునుడు.

దానికి ఊర్వశి ఓ అర్జునా! మీ ధర్మాలు ఇక్కడ చెల్లవు. ఎందువల్ల అంటే మీ శరీరాలు వేరు. ఇక్కడ మా శరీరాలు వేరు. మీవి పంచభూతాత్మక శరీరాలు. మావి కాంతి శరీరాలు అంటుంది.

అమ్మా! నేను శరీరం చాలించి ఇక్కడకు రాలేదు. కేవలం నేను అతిథిగా వచ్చాను. ఇంద్రుని మెప్పుపొందిన మరుక్షణం నేను వెళ్ళిపోతాను. ఇవేమీ నాకు అవసరం లేదు. పాండురాజు వారి దగ్గర నుండి ఏమి వచ్చాయో అవే నేను పాటిస్తాను అనగానే ఊర్వశికి కోపం వచ్చి అర్జునుణ్ణి శపించింది.

ఊర్వశి శపించి వెళ్ళిపోగానే ఇంద్రుడు వచ్చి అర్జునా! నువ్వు ఎంత ధర్మ సంపన్నుడవయ్యా. ఆమె నిన్ను శపించగానే తిరిగి ఆమెను శపించకుండా ఎంత శాంతంగా ఉన్నావు. ఈమె శాపం నీకు అజ్ఞాతవాసంలో ఒక వరంగా మారుతుంది అని చెప్పాడు.

అయితే దీనికంతటికీ కారణం పశుపక్ష్యాదులలో లేనివి మనలో ఉన్నవే. అవే కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలు.

మొదటగా కామం గురించి తెలుసుకుందాం.

**1) కామము :** అంటే కోరిక. ఈ కోరిక పెరిగి, పెరిగి వటవృక్షంలా మారి మోహంగా తయారవుతుంది.

**2) లోభము :** ఇదంతా నాదే, అంతా నాకే కావాలి. నాకే కావాలి అనుకోవటం వల్ల అది మాత్సర్యంగా మారుతుంది.

అసలు ఈ కోరిక (కామం) అనేది వదిలేస్తే మదమాత్సర్యాలనేవే వుండవు. మనిషి పాపం చేయకూడదు అని ఎంత గట్టిగా సంకల్పించుకున్నా ఆ పాపాన్ని నిర్విఘ్నంగా చేయించే శక్తి ఒక్క కామానికి (కోరిక) మాత్రమే వుంది. అందువల్ల ఆ కోరికను మనం భగవంతుణ్ణి సేవించుకునేందుకు కనుక ఉపయోగించినట్లయితే తప్పకుండా భగవంతుణ్ణి తెలుసుకోవటమే కాకుండా ముక్తి కూడా లభిస్తుంది అని చెప్తారు గురువులు.

ఈ కోరిక అనేది రజోగుణం నుంచి పుట్టింది. ఈ కోపాన్నే మదము అంటారు. ఇవి రెండూ జంటకవుల్లా ఎప్పుడూ కలిసే వుంటాయి. ఈ కోరిక అనేది లేనిచో మదమాత్సర్యాలు అనేవి ఉండవు. అన్నీ కూడా శూన్యమైపోతాయి.

అప్పుడు బ్రహ్మం మాత్రమే వుంటుంది. ఈ బ్రహ్మాన్ని తెలుసుకోవాలంటే జ్ఞానాన్ని ఆశ్రయించాలి. ఎప్పుడయితే బ్రహ్మజ్ఞానం కలుగుతుందో ఆ వ్యక్తిలో ఏమీ మార్పు వుండదు. చూసే దృష్టిలోనే మార్పువస్తుంది.

**ఉదా:** ఒకచోట కొందరు పిల్లలు ఆడుకుంటూ ఉండగా వారికి ఒక పక్షి గుడ్డు దొరికింది. ఆ పిల్లలు దాన్ని భద్రంగా తీసుకువెళ్ళి కోడిబుట్టలో పెట్టారు. మామూలుగానే కోడి తను గుడ్లతో పాటుగా దాన్ని కూడా పొదిగింది. గ్రుడ్లలో నుంచి పిల్లలు బయటకు వచ్చాయి. ఆ కోడిపిల్లలతో పాటుగా చిన్నపిల్లలు ఆడుకుంటూ దొరికిన గ్రుడ్డులోంచి, ఒక గ్రద్ద పిల్ల కూడా బయటకు వచ్చింది. ఆ గ్రద్దపిల్ల మిగిలిన కోడిపిల్లలతో కలిసి కోడిపిల్లలాగానే పెరగసాగింది. దాని ప్రవర్తన అరుపు అంతా కోడిపిల్లలాగానే వుంది. ఎగరటం కూడా కోడి ఎంతఎత్తు ఎగరగలదో

అంతే ఎత్తు ఎగిరేది.

ఒకరోజు ఆ గ్రద్దపిల్ల ఆకాశంలో ఎగురుతున్న ఇంకో గ్రద్ద ఎగరటం చూసి అది తల్లికోడిని అడిగింది. అమ్మా అక్కడ దూరంగా ఎగురుతున్న ఆ పక్షిపేరు ఏమిటి అని.

దానికి తల్లికోడి అమ్మా! దాన్ని గ్రద్ద అంటారు. చాలా గొప్ప పక్షి. అది ఎంత ఎత్తయినా ఎగరగలదు. కానీ మనం అలా ఎగరలేము అని చెప్పింది.

ఆ మాటలు విన్న గ్రద్దపిల్ల ఆ విషయం విన్నాక మళ్ళీ దాని గురించి ఆలోచించలేదు. (కోడి తినే ఆహారమే గ్రద్ద తినటం వల్ల అది కోడంతే ఎదిగింది). ఆ గ్రద్ద కోళ్ళతో కలిసి కోడిలాగానే బ్రతికి కోడిలాగానే చచ్చిపోయింది.

ఎందువల్ల అంటే వాటికి జ్ఞానం లేకపోవటం వల్లే. కానీ భగవంతుడు మనకి ఇంద్రియాలతో పాటు జ్ఞానాన్ని కూడా ప్రసాదించాడు. అయితే ఆ జ్ఞానాన్ని మనం ఎంతవరకూ ఉపయోగిస్తున్నాం అనేది మనం మననం చేసుకుంటే పైన చెప్పబడిన పశుపక్ష్యాదుల కన్నా హీనమైన స్థితిలో వున్నామనేది అర్థం అవుతుంది.

❖ ❖ ❖

(31) శ్లో ॥ **విషయాశామహాపాశాద్యో, విముక్త: సుదస్త్య జాత్ ।**
**స ఏవ కల్పతేముక్త్యై నాన్యః షట్శాస్త్ర వేద్యపి ॥**

ఎవరయితే విషయవాసనలనే మొసలిని పట్టుకుని తీవ్రమైన వైరాగ్యమనే కత్తితో చంపేస్తున్నాడో అతనే సంసారమనే సముద్రాన్ని ఎలాటి అవాంతరాలూ లేకుండా తీరాన్నిదాటగలరు అనటంలో ఎలాటి సందేహమూ వుండదు.

ఇలా కాకుండా ఎవరయితే పాపపుణ్యాలు లేవు, భక్తి జ్ఞాన వైరాగ్యాలు

లేవు. అహంకార మమకారాలూ, స్వార్థం తప్ప మరేమీలేవు అనే పాపబుద్ధి కల మానవుణ్ణి మృత్యువు అడుగడుగునా వెంబడిస్తూనే వుంటుంది.

ప్రతిరోజూ మన శరీరానికి మంచి ఆహారం ఎంత అవసరమో అలాగే మనయొక్క మనస్సుకి కూడా స్వచ్ఛమైన, సానుకూలమైన, ధార్మికమైన అతి పవిత్రమైన ఆలోచనలు చాలా అవసరం అని తెలుసుకోవాలి.

**ఉదా:** ఒక వూళ్ళో ఒక కట్టెల వ్యాపారి వుండేవాడు. అతని వద్ద కొంతమంది కట్టెలు కొట్టేవారు వుండేవారు. అందులో రామయ్య అనే వ్యక్తి 10 సంవత్సరాల నుంచీ పనిచేస్తున్నాడు.

అందులోనే సీతయ్య అనే వ్యక్తి కూడా పనికి కుదిరి కొద్దిరోజులే అయినా, అతని జీతం అంచెలంచెలుగా పెరగసాగింది.

ఇది గమనించిన రామయ్య మనస్సులోనే చాలా రోజులు బాధపడ్డాడు రామయ్య భార్య ఒకరోజు ఎన్నిరోజులు చేసినా నీ జీతం ఇంతేనా ఇంక పెరగదా మీ యాజమానిని పెంచమని అడుగు, అడగనిదే అమ్మయినా పెట్టదు అంది.

మర్నాడు రామయ్య భార్య చెప్పినట్టే యజమాని దగ్గరకు వెళ్ళి అయ్యా! నిన్నకాక మొన్న వచ్చిన వ్యక్తి జీతం అంచెలంచెలుగా పెంచారు. ఇన్నాళ్ళ నుంచి చేస్తున్నా నా జీతం ఇంచయినా పెరగలేదు. నేను చేసిన పాపం ఏమిటి? అని అడిగాడు.

అప్పుడు యజమాని! రామయ్యా! పది సంవత్సరాల క్రితం ఎన్ని చెట్లు కొట్టావో ఇప్పుడూ అన్నే కొడుతున్నావు. ఆ సీతయ్యా వచ్చి కొన్ని రోజులే అయినా, రెట్టింపు లాభాలు వచ్చాయి. ఆ కిటుకు ఏమిటో సీతయ్యని అడిగి తెలుసుకో మాకు లాభాలు వస్తే నీ జీతమూ పెరుగుతుంది అని చెప్పాడు.

వెంటనే రామయ్య, సీతయ్యను కలిసి తన సమస్య చెప్పాడు.

దానికి సీతయ్య ఒక చిరునవ్వు నవ్వి అన్నా! నేను నీ కన్నా చిన్నవాణ్ణి నీ బాధ నేను అర్థంచేసుకోగలను. అయితే నేను ఒక చెట్టు నరికాక కొంతసేపు విశ్రాంతి తీసుకుంటాను. ఆ సమయంలో నా గొడ్డలికి పదును పెడతాను. మరి నీ గొడ్డలికి పదనుపెట్టి ఎన్నాళ్ళయింది అని అంటాడు.

మరి మనం మనస్సు అనే గొడ్డలికి పదును పెట్టి ఎన్నాళ్ళయింది. మనం గతంలో చేసినవి బేరీజు వేసుకుంటూ కూర్చోవటం కంటే ఎప్పటికప్పుడు మనస్సు అనే గొడ్డలికి పదునుపెట్టి ఎన్నాళ్ళయింది అని ప్రతివ్యక్తి ఆలోచించుకోవాలి.

విషయవాసనలనే మొసలిని నాశనం చేయాలంటే తెలివైన వారు తీవ్రవైరాగ్యమనే భావనగల మనస్తత్వాన్ని నిర్మించుకుంటారు. ఈ మొసలి యొక్క బలమంతా నీటిలో వున్నప్పుడే అదే మొసలి బయటకు వస్తే అదేమీ చేయలేదు.

అలాగే మనస్సును సుఖాలమీద ఆసక్తి చేత విజృంభిస్తోంది. అలాటి ఆసక్తి రూపకల్పన లేకపోతే స్వయంగా దానంతట అదేమీ చేయలేదు. నశించిపోతుంది.

**ఉదా:** ఒక అడవిలో ముగ్గురు స్నేహితులు కలిసి ప్రయాణిస్తున్నారు. కొంతసేపటికి వారికి ఎదురుగా ఒక పెద్దపులి రావటం కనిపించింది.

ఆ ముగ్గురులో ఒక వ్యక్తి ఒరేయ్ మనల్ని వెతుక్కుంటూ మృత్యువు వచ్చింది. మన కాలం దగ్గరపడింది అన్నాడు.

దానికి రెండవ వ్యక్తి ఏమీ పరవాలేదు. ఆ పులి ఇంకా మనల్ని గమనించలేదు. ఈలోగా మనం భగవంతుణ్ణి ప్రార్థిద్దాం అన్నాడు.

అప్పుడు మూడవ వ్యక్తి మనది తీర్చలేని సమస్య కాదు. దానికి పాపం దేవుణ్ణి ఎందుకు ఇబ్బంది పెట్టటం. ఇదిగో ఈ చెట్టుపైకి ఎక్కి

ప్రాణాలు రక్షించుకుందాం అన్నాడు.

పులిని చూసి మృత్యువు వచ్చేసింది అన్న వ్యక్తికి భగవంతుడు ఉన్నాడు. ఆయన మనల్ని రక్షిస్తాడు అన్న ఆలోచనే రాలేదు.

ఇక భగవంతుణ్ణి ప్రార్థిద్దాం ఆయనే మనల్ని రక్షిస్తాడు అన్న రెండవ వ్యక్తి ప్రేమ భక్తి కలవాడు.

మనం చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకుందాం. పాపం భగవంతుణ్ణి ఎందుకు ఇబ్బంది పెట్టటం అన్న మూడవవ్యక్తి భగవంతుని పట్ల సంపూర్ణమైన ప్రేమ కలిగిన వ్యక్తి. వీరు భగవంతుణ్ణి తన తల్లిగానో, తండ్రిగానో బిడ్డగానో భావించి నిరంతరం ఆయన బాగోగులు చూడటం తన కర్తవ్యంగా భావిస్తారు.

వీరిది గాఢమైన ప్రేమ. భగవంతుడు మనల్ని రక్షిస్తాడు అనుకోవటం కన్నా తాను నమ్మిన భగవంతునికి ఎటువంటి నొప్పి, బాధ కలగకూడదు అన్నదే వీరి ఏకైక లక్ష్యం.

ఇక మిగిలింది జ్ఞాన భక్తి. వీరు సృష్టి మొత్తం. భగవంతుని యొక్క స్వరూపంగా భావిస్తారు. భగవంతుడు అంటే అనేక నామరూపాలతో వ్యక్తమయ్యే ఏకైక స్వరూపంగా వీరు భావిస్తారు.

మనకి కావలసింది ఇటువంటి ప్రేమ. మనలో కావలసింది ఇటువంటి మార్పు.

**ఉదా:** శ్రీ ఆదిశంకరాచార్యుల వారు. ప్రతి వ్యక్తి ఒక ముహూర్త కాలమైనా దైవధ్యానం చేయాలని చెప్పారు. ముహూర్తకాలం అంటే 48 నిమిషాలన్నమాట. లేకపోతే ఆ తరువాత విచారించి లాభం లేదు అన్నారు.

ఒక వ్యక్తి బాగా ధనం సంపాదించి దాచుకున్నాడు. ఒకరోజు అతను ఒక వాచీ కొనుక్కున్నాడు. అది ఒక గడియారంగా ఆయన దాన్ని భావించలేదు. ఆయన దాన్ని కాలచక్రంగా భావించి దాని ప్రకారం భగవధ్యానం చేసేవారు.

కొంతకాలం గడిచాక ఆ గడియారాన్ని ఎవరో దొంగలించారు. ఆయన చాలా బాధపడుతుంటే ఇంట్లోని వారు పోయింది. డబ్బు, బంగారం, వెండి కాదు కదా? దేనికింత బాధపడుతున్నావు. మేం మరొకటి కొని ఇస్తాము అన్నారు.

నాయనా! ఏ వస్తువుపోయినా తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ గడిచిన కాలం మాత్రం ఏమిచ్చినా తిరిగిరాదు తిరిగి సంపాదించుకో గలిగినవి పోతేనే బాధపడిపోతారు జనం. మరి తిరిగిరాని కాలం పోతే మనం ఎంత బాధపడాలి అన్నారు.

అలాగే కాలం గడిచిపోతోంది. సమయం వృధా అయిపోతోంది. మనం ఎంతవరకూ భగవంతుని స్మరణలో వున్నాం అన్నది మనం తెలుసుకోగలగాలి.

❖ ❖ ❖

(32) శ్లో ॥ **అనుక్షణం యత్పరిహృత్య కృత్యం**
**అనాద్య విద్యాకృతబన్ధ మోక్షణమ్**
**దేహః పరార్థో యమ ముష్య పోషణే**
**యః సజ్జతే సస్వమనేనహన్తి ॥**

మనం చేయవలసిన పనిని వదిలేసి అవిద్య నుంచి బంధాల నుంచి బయటపడటానికి ప్రయత్నించాలి. మనకి ప్రసాదించిన ఈ శరీరం భగవంతుని గురించి తెలుసుకోవటానికి మాత్రమే అని తెలుసుకోవాలి.

ప్రతీవారూ ప్రతీక్షణం చేయవలసినది తనకి అనాదిగా సంభవిస్తున్న అజ్ఞానం వల్ల కలిగిన చావు, పుట్టుకలనే సంసారబంధం నుంచి విముక్తి మార్గాన్ని వదిలి (ఈ దేహం, ఈ భోగం, ఇవేవీ మనవి కావు అనే విషయం ప్రక్కనపెట్టి వీటిమీద వ్యామోహం పెంచుకుంటూ వివేకం మరచి భగవంతుడు ఇచ్చిన ఈ శరీరాన్ని నమ్మకుని దానితో సంబంధ,

బాంధవ్యాలు పెంచుకుంటూ వివేకాన్ని మర్చిపోవటం జరుగుతోంది.

ఈ సంసారబంధాల్లో చిక్కుకున్న వ్యక్తి ఎంత కోరుకున్నా వీటి నుంచి బయటపడలేరు. ఎందువల్ల అంటే ముందు జన్మలలో చేసిన కర్మఫలాల బ్యాలన్స్ ఈ జన్మలో వాటి ఫలితాలు అనుభవించి తీరాలి కాబట్టి, వాటి ప్రభావం వల్ల మన మనస్సులో కొన్ని ముద్రలు సంస్కారాల రూపంలో ఏర్పడటం జరుగుతుంది.

**ఉదా:** ఒకసారి ఒక యోగి పుంగవుడు తన వద్దకు వచ్చిన ఒకరాజుతో నాయనా నేను ధ్యానం చేసుకునే సమయం ఇది. నువ్వు కూడా నాతో పాటు ధ్యానం చెయ్యి అని చెప్పారు.

దానికి రాజు వెంటనే అయ్యా! నేను మీకులా ధ్యానం చేయలేను. నాకు రాజ్యంపై ఆకాంక్ష, ప్రాపంచిక విషయాలపై మక్కువ నన్ను వదలటం లేదు. నేను మీ ప్రక్కనే వున్నా ఇక్కడ నాకు ఒక రాజ్యం ఏర్పడుతుంది. నాలో వున్న బలమైన ఈ కోరికే దీనికి కారణం. దీని నుంచి ఎలా బయటపడాలో తెలియటంలేదు అన్నాడు రాజు.

ఆ మాటలకి యోగి నాయనా.. చేపలు వేసిన గంపను ఎంత కడిగినా దాని వాసన పోదు. అలాగే ప్రాపంచక విషయాల్లో మునిగిన వారు చిత్తశుద్ధితో కఠోర సాధన చేస్తేనే కానీ పాతవాసనలు పోయి నిజమయిన భక్తి అలవాటు అవదు.

అందువల్ల ఎవరయితే భగవంతుణ్ణి దర్శించాలనుకుంటారో వారు మనం ఎవరం? ఎందుకు పుట్టాం? పుట్టినందుకు ఏం సాధించాం? అని తనని తాను పదే పదే ప్రశ్నించుకుంటూ సాధన మొదలుపెట్టాలి.

బ్రహ్మదేముడు జీవుల్ని తయారు చేయటం కోసం భూదేవి దగ్గరకు వెళ్ళి అమ్మా! ఎన్నో జీవులు లైన్లో వున్నాయి. బొమ్మలు తయారు చేద్దామంటే నా దగ్గర మట్టి అయిపోయింది. కొంచెం మట్టి ఇయ్యమ్మా అని అడిగాడట.

దానికి భూదేవి! నాయానా వచ్చిన ప్రతిసారి నా నుంచి మట్టిని తీసుకుపోతున్నావు. నాకూ ఇబ్బందిగా ఉంటుంది కదా? అందిట

వెంటనే బ్రహ్మగారు అమ్మా! ఈ సారి నుంచి నీవిచ్చిన మట్టితో బొమ్మని చేసి కొన్నాళ్ళు ఆడుకుని ఆ మట్టి తిరిగి నీకే ఇచ్చేస్తాను. ఈ లోగా వారి కర్మఫలం కొంత తరిగేలా చేస్తాను అన్నారట బ్రహ్మగారు. (కర్మఫలం కొంతతరగటమేమటి అంటే కొండంత కర్మలు తరగాలంటే ఎన్ని జన్మలు ఎత్తాలి అన్నారట బ్రహ్మగారు).

ఇవన్నీ విన్నా, తెలిసినా, చదివినా ఈ దేహం మీద వ్యామోహం వదలలేక ఎంతో సంపాదించి, ఎన్నో అలంకారాలు చేసి, ఎన్నో మమకారాలు పెంచుకుని, పెంచుకున్న వాటిని తెంచుకోలేక అమూల్యమైన కాలాన్ని వృథా చేయటం జరుగుతోంది.

ఈ విషయాలన్నీ రాజుకు చెప్తున్న యోగి, తన వద్ద వున్న ఒక మణిని చూపించి రాజా ఇది చాలా అమూల్యమైన మణి, దీన్ని దేనికి తాకించినా అది బంగారంగా మారిపోతుంది. ఇది నీ దగ్గర వుంచుకో అని ఆ మణిని రాజుకి ఇచ్చారు యోగి.

ఆ మణిని తీసుకున్న రాజు తను కూర్చున్న పీటకు తాకించగానే ఆ పీట బంగారంలా మారిపోయింది.

వెంటనే రాజుకి ఒక సందేహం వచ్చింది. ఇంత విలువైన మణినే ఈ యోగి నాకు ఇచ్చారంటే ఇంతకన్నా విలువైనది ఏదో ఈ యోగి దగ్గర వుండి వుంటుంది. దాన్ని తెలుసుకోవాలి అనుకుని యోగిని అదే అడిగాడు రాజు.

ఆ మాటకి యోగి నాయనా నువ్వు వూహించింది నిజమే. నా దగ్గర వెలకట్టలేని అమూల్యమైన భగవన్నామం అనే మణి వుంది. దాన్ని స్వీకరించే అర్హత వున్నవారికి దాన్ని ఇవ్వటానికి నేను మనస్ఫూర్తిగా సిద్ధంగా వున్నాను అన్నారు యోగి.

యోగి మాటలు విన్న రాజుగారికి లౌకిక వాంఛల మీద విముఖత ఏర్పడింది. తిరిగి రాజ్యానికి వచ్చి భార్యకు రాజ్యాన్ని అప్పగించి ఆ రోజు రాత్రే అంత:పురం విడిచిపెట్టి యోగివద్దకు వెళ్ళి రెండు చేతులూ కట్టుకుని నిలబడ్డాడు.

యోగి రాజుకి భగవన్నామాన్ని చెప్పి ఆశీర్వదించాడు. రాజు యోగి ద్వారా పొందిన ఆ నామాన్ని జపిస్తూ వచ్చాడు. కొంతకాలానికి అతను చిత్తశుద్ధితో చేసిన జపధ్యానాల ఫలితంగా భగవత్ సాక్షాత్కారం పొంది భగవత్ సామ్రాజ్యం పొందాడు.

❖ ❖ ❖

(33) **శ్లో ॥ ప్రాణాపాన వ్యానోదాన సమానా,**
**భవత్యసౌ ప్రాణః ।**
**స్వయమేవవృత్తి భేదాద్వికృతిభేదాత్సు**
**వర్ణసలిలాదివత్ ॥**

ఈ దేహము ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన అనే పంచప్రాణములు కలిగి వున్నది. వీటిలో ఏదయినా సరిగ్గా పనిచేయక పోతే ఆ అవయవం తాలూకు రోగాలు రావటం జరుగుతుంది.

బంగారం అంతా ముద్దగానే వుంటుంది. దానిని కరిగించనట్లయితే అనేక రకాల వస్తువులు తయారవుతాయి. అలాగే శరీరం కూడా మార్పు చెందుతూ వుంటుంది. కానీ జీవుడు మాత్రం మారటం లేదు. స్థూల శరీరం లేని రోజున సూక్ష్మ శరీరం భాధపడుతూ వుండటం జరుగుతుంది.

**ఉదా:** ఒక ఆమె పుట్టిన దగ్గర్నుంచి కష్టాలు పడుతూనే వుంది. కొంతకాలానికి ఆమె విసిగిపోయి ఆమె ఆత్మహత్య చేసుకోవాలనుకుని ఒక నది దగ్గరకు వెళ్ళింది. ఆమె నదిలో దూకబోతున్న సమయంలో ఒక సాధువు ఆమెను ఆపి అమ్మా! ఎందుకు ఇంత కఠిన నిర్ణయం

తీసుకున్నావు. నువ్వు మరణిస్తే కష్టాలు తీరిపోవు. నేను చెప్పేది పూర్తిగా విని నీ నిర్ణయం తీసుకో అని చెప్పారు సాధువు.

అమ్మా! మన ఈ శరీరం స్థూల, సూక్ష్మ శరీరాలు కలిగి వుంటుంది. ఈ శరీరాన్ని నడిపించేది. అధిష్టానమైన రూపము కలది ముఖ్య ప్రాణమొకటి వుంది. అది దేహేంద్రియాలకు సంబందించింది కాదు. దానినే ఆత్మ అని మన ఉపనిషత్తులు చెప్తున్నాయి. ఈ స్థూల శరీరానికి సూక్ష్మశరీరం ఆధారము.

జీవుడు ఈ శరీరంతో వున్నంతసేపూ మనిషికి ఏ కష్టం వచ్చినా ఇంట్లో వారు, ఇరుగు పొరుగు వారూ వచ్చి ఓదారుస్తారు. డాక్టర్లు వైద్యం చేస్తారు. మనకు తెలిసిన వారందరూ ఏదో ఒకరకంగా రక్షించటానికి ప్రయత్నిస్తారు.

కానీ ఈ జీవుడు ఈ దేహం నుంచి వేరయితే అప్పుడు శరీరం వుండదు. అది సూక్ష్మ శరీరంగా మారిపోతుంది. అప్పుడు ఈ జీవుడు సూక్ష్మ శరీరం ద్వారా కర్మఫలాలు (కష్టాలు) అనుభవించక తప్పదు.

సూక్ష్మ శరీరం జన్మజన్మల నుండి వెంట వస్తూనే వుంటుంది. దీనికి మొదలు, ఆఖరు అనేది లేదు.

కాబట్టి మన పాప, పుణ్యాల తాలూకు కర్మలు పరిపక్వం అవకుండా మధ్యలోనే మనం ఆత్మహత్య ద్వారా మన తనువు చాలిస్తే అంతకన్నా నరకం మరొకటి వుండదు.

ఎలా అంటే సూక్ష్మ శరీరంతో వున్నవారు బ్రతికి వున్నవారిని చూడగలుగుతారు. కానీ బ్రతికి వున్నవారికి చనిపోయిన వారు కనిపించరు.

అప్పుడు ఆ జీవుడు సూక్ష్మశరీరంతో మన దగ్గరకు వచ్చి ఏమయినా చెప్పుకున్నా మనకి ఎవ్వరికీ ఏమీ వినిపించవు. ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఓదార్చలేరు, మందులు మాకులూ ఇవ్వలేరు.

మళ్ళీ ఈ జీవుడు ఇంకోజన్మ ఎత్తాలంటే ఆ జీవుని యొక్క కర్మఫలం పూర్తి అయితే కానీ మళ్ళీ జన్మరాదు. అంతవరకూ జీవుడు శరీరహితుడై ఆ బాధలు అనుభవించవలసిందే.

సాధువు ఆమెకు ఇవన్నీ చెప్పి అమ్మా! ఇప్పుడు నువ్వు ఏ నిర్ణయమైనా తీసుకో కానీ నేను చెప్పిన విషయాలన్నీ బాగా ఆలోచించుకో అన్న సాధువుగారి మాటలకు ఆమె కన్నీటితో నమస్కరించింది.

వెంటనే సాధువు ఆమెను ఆశీర్వదించి అమ్మా! నువ్వు నిరంతరం ఆ భగవన్నామ స్మరణ చెయ్యి. నీ కష్టాలు అతి త్వరలోనే తొలగి పోతాయి అని చెప్పారు.

అప్పుడు ఆమెకు ఒక సందేహం వచ్చింది! స్వామీ భగవన్నామం జపిస్తే నా కష్టాలుపోతాయంటారా అని అడిగింది.

అమ్మా! భగవధ్యాన సాధన వల్ల మనకి ఒకపాము కాటు వల్ల ఇబ్బంది పడాలని వ్రాసి వుంటే అది ఒక కండ చీమకాటుతో సరిపోతుంది. దాంతో మన కర్మ తొలగి మంచి జరుగుతుంది అని చెప్పారు సాధువు.

(సాధువు గారి మాటలు విన్న ఆమె పూర్తి విశ్వాసంతో భగవన్నామస్మరణ చేసి ఆమె భవసాగరం నుండి అవలీలగా గట్టెక్కి ప్రార్థనలో తరించింది.

ఆత్మే పరమాత్మ కాబట్టి ఆ పరమాత్మను నిరంతరం ధ్యానించి నట్లయితే సంసారమనే సాగరాన్ని సులభంగా దాటగలం.

సాధారణంగా కొంతమంది యోగులు మనిషియొక్క సూక్ష్మ శరీరాన్ని మాత్రమే చూస్తారు. ఇటువంటి వారినే దివ్యచక్షువులు అని అంటారు.)

అలాగే ఒక నాగలి దెబ్బ మనకి తగలాలని వ్రాసి వుంది అనుకోండి. ఓ చిన్నసూది గుచ్చుకోవటంతో సరిపోతుంది. జపం ద్వారా కర్మయొక్క ఫలితాన్ని చాలా వరకూ భగవంతుడు తగ్గించివేస్తాడు.

మనలో చాలామందికి భగవంతుని యొక్క జపం, సాధన కన్నా

నవగ్రహాల మీద, గ్రహదోషాల మీద గురి ఎక్కువ.

మరి ఈ నవగ్రహాలను పుట్టించింది ఎవరు? దీన్ని అదుపుచేసేది ఎవరు? ఆ భగవంతుడే కదా!

ఈ సృష్టి మొత్తానికి అధినాయకుడైన ఆ పరమేశ్వరుణ్ణి వదిలేసి నవగ్రహాలను పట్టుకోవలసిన అవసరం లేదు. భగవంతుణ్ణి నిరంతరం ప్రార్థించటం, ధ్యానించటం వల్ల మన ఆపదలన్నీ ఖచ్చితంగా తొలగిస్తాడు.

ఒక నామాన్ని నమ్మి భగవంతుణ్ణి భక్తుడు నిరంతరం సాధన చేసినట్లయితే అమ్మ దగ్గర మనం మారాము చేసయినా మనకి కావలసింది ఎలా పొందుతామో అలాగ సాధన ద్వారా భగవంతుని నుంచి మనకి కావలసినది పొందగలము అన్నది సత్యం.

❖ ❖ ❖

(34) **శ్లో ॥ స్వప్నోభవత్యస్య విభక్త్యవస్థా,**
**స్వమాత్రశేషేణ విభాతియత్ర ।**
**స్వప్నేతు బుద్ధిః స్వయమేవ**
**జాగ్రత్కాలీననానా విధవాసనాభిః ॥**

ఈ శ్లోకంలో సూక్ష్మ శరీరం యొక్క అవస్థను, చెప్తూ, స్థూల శరీరానికి, సూక్ష్మ శరీరరానికి ఉన్న బేధాన్ని చెప్తున్నారు.

చిన్నవిగా వున్న వాటిని సూక్ష్మమనీ, బలంగా వున్న వాటిని స్థూలమనీ మనం అనుకుంటూవుంటాము.

**ఉదా:** ఒక ఐసుముక్కను తీసుకుంటే దానిని అది ముక్కలా వున్నప్పుడు స్థూలమనీ, కొద్దిసేపటికి అది కరిగిపోయాక దానిని సూక్ష్మమనీ అనుకుంటాము.

మనయొక్క మనస్సు స్థూలం, బుద్ధి సూక్ష్మం, బుద్ధికన్నా సూక్ష్మ

ఆనందమయ శరీరం. అటువంటి ఆనందమయ శరీరం కన్నా సూక్ష్మం ఆత్మ, అలాగే ఆత్మ సర్వవ్యాప్తి. ఈ ఆత్మ అంతటావ్యాపించి వుంటుంది.

అయితే మనం మన యొక్క విషయవస్తువుల వ్యామోహంలో మన ఆనందం కోసం మనస్సుని కష్టపెడుతున్నాము. సూక్ష్మమైన ఆనందం కోసం స్థూలశరీరాన్ని కష్టపెడతున్నాము.

జాగ్రదావస్తలో నాకు నచ్చిన వస్తువులు, నాకు నచ్చిన వ్యక్తులు, నాకు నచ్చినట్లుగా ప్రతీదీవుంటే నాకు ఆనందం. లేకపోతే దు:ఖం ఇదే మన జీవితం. గడిచిపోతున్న కాలం గురించి దు:ఖం లేదు. భగవంతుణ్ణి తెలుసుకోవాలన్న తపనేలేదు రాబోయో కాలం గురించి చింతలేదు.

**ఉదా:** ఒక సాధువు దగ్గరకు ఒక సామాన్య భక్తుడు వచ్చి స్వామీ! మిమ్మల్ని ఎన్నో ఏళ్ళుగా గమనిస్తున్నాను. మీరు ఎప్పుడూ నిశ్చలంగానే వుంటారు. మీలో ఎలాంటి రాగద్వేషాలూ లేవు. నిర్మలమైన నదీ ప్రవాహంలా ఎలా మీరు వుండగలుగుతున్నారు అని అడిగారు. నాకూ ఏదయినా వుపాయం చెప్పండి స్వామీ అన్నాడు భక్తుడు.

దానికి ఆ సాధువు అతన్ని చూసి బాగా ఆలోచించి నాయనా.. నీకు ఒక ముఖ్యమైన విషయం చెప్తాను. ఖంగారుపడకు. నీకు ఇంకొక 10 రోజుల్లో మరణం సంభవించబోతోంది అని చెప్పగానే ఆ భక్తుడు బాధగా సాధువుకు నమస్కరించి వెళ్ళిపోయాడు. అలావెళ్తున్న ఆ భక్తుణ్ణి పిలిచి నాయనా ఎనిమిదో రోజు నువ్వు వచ్చి నాకు కనిపించు అని చెప్పాడు.

అది విన్న ఆ భక్తుడు బాధతో సాధువుకు నమస్కరించి వెళ్ళిపోయాడు. ఇంటికి వెళ్ళగానే భార్యపిల్లల్ని పిలిచి జరిగిందంతా చెప్పి నాకు తెలిసి కానీ తెలియక కానీ మీపట్ల నేను దురుసుగా ప్రవర్తిస్తే నన్ను క్షమించండి నేను వున్న ఈ పదిరోజులూ అందరం సంతోషంగా వుందాం అని చెప్పి ఇరుగు, పొరుగు వారితోను ఇంతకుముందు గొడవపడ్డ వారిని, మిత్రులని, బంధువుల్ని అందరినీ కలిసి ఎంతో మంచిగా కలిసి మెలిసి గడిపాడు.

ఎనిమిదవ రోజు రానే వచ్చింది. ఆ భక్తుడు వెళ్ళి సాధువును కలిసాడు. ఆ సాధువుకు భక్తుడు సాష్టాంగ నమస్కారం చేసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. సాధువు భక్తుణ్ని ఉద్దేశించి...

నాయనా ఈ 8 రోజులు నువ్వు ఎలా గడిపావు? ఎందర్ని తిట్టావు? ఎందరితో గొడవపడ్డావు అని అడిగాడు.

ఆ ప్రశ్న విన్న భక్తుడు తెల్ల మొహం వేసుకుని అయ్యా! మీరు నా మరణ సమయం చెప్పిన దగ్గర నుంచి ఈ క్షణం వరకూ నేను నాకు తెలిసి ఏ తప్పూ చేయలేదు. నేను గొడవ పడ్డ వారందర్నీ క్షమాపణ అడిగి పశ్చాత్తాపంతో మీ దగ్గరకు వచ్చాను. ఈ ఎనిమిది రోజులూ మంచిగా ప్రయోజనకరంగా గడిపాను అన్నాడు.

అతను చెప్పింది అన్నీ విన్న సాధువు నీ మరణం విషయం ఆ పరమాత్మకే తెలియాలి. ఈ విచిత్రం చూడు ఈ 8 రోజులూ మరణాన్నే తలుచుకుంటూ మంచిగా జీవించావు.

మనం ఈ శరీరంతో ఎంతకాలం వుంటామో తెలియదు. గడిచిన కాలం తిరిగిరాదు. రేపు ఏం జరగుతుంది అన్నది మనకి తెలియదు గడిచే ప్రతిక్షణం నశించిపోయే ఈ దేహాన్ని గుర్తు చేసుకుంటూ పరుల మీద పగతీర్చుకోకుండా, మనసా, వాచా కర్మణా భగవంతుని మీద భక్తి, శ్రద్ధలు కలిగి నిరంతరం ఆయన ధ్యానాన్ని వదలకుండా పదిమందికి పనికి వచ్చే పనులు చేస్తూ ధర్మబద్ధమైన జీవితం గడపాలి అన్నదే మా జీవిత లక్ష్యం. అందుకే మేం ప్రశాంతమైన జీవితం గడప గలుగుతాం అన్నారు సాధువు.

సాధువు మాటలకు భక్తుని యొక్క మనస్సు, బుద్ధి కూడా ఆనందం పొందాయి. మనం ఎప్పుడు పుట్టామో అప్పుడే మరణం కూడా నిర్ణయించ బడుతుంది అని గ్రహించిన భక్తుడు తన వల్ల సమాజానికి వుపయోగపడే కార్యక్రమాలు చేస్తూ జీవితాన్ని సార్థకం చేసుకుని తరించాడు.

ఏ విషయమయినా భగవంతునికి తెలిసిన తరువాతే మనకి తెలుస్తుంది. మన మనస్సులోని చెత్తనంతా తీసివేస్తే అప్పుడు మనస్సు ప్రశాంతంగా వుంటుంది.

❖ ❖ ❖

(35) శ్లో ॥ **అంతఃకరణమే తేషు, చక్షురాదిషు వర్ష్మణి**
**అహమిత్యభిమానేన తిష్ఠత్యా భాసతేజసా ॥**
**అహంకారః సవిజ్ఞేయః కర్తా భోక్తాభిమాన్యయమ్ ।**
**సత్త్వాది గుణయోగేన చావస్థాత్రయమశ్నుతే ॥**

జీవుడు అనగా అశేషమయినటువంటి సాక్షి బుద్ధిలో ప్రతిబింబించాక నేను అనే అహం పుడుతుంది. ఈ అహం వచ్చి ప్రతిబింబంతో మనస్సు, ఇంద్రియాలతో తాదాప్యం చెందటం జరుగుతుంది.

అహం అంటే నేను. మనలో ఈ నేను, నేను అని ఎప్పుడయితే పుట్టిందో అదే అహంకారంగా మారుతోంది. జీవుళ్ళు అనేక కోట్ల మంది వున్నారు. కానీ భగవంతుడు (పరమాత్మ) ఒక్కడే.

ముక్తి, మోక్షం కావాలని కోరుకునే వారు నేను, నాది అన్న అహంకారాన్ని వదిలివేసినట్లయితే వారికి తప్పకుండా ముక్తి లభిస్తుంది.

(1) ఒక మనిషి బ్రతకాలంటే ధనం చాలా చాలా అవసరం. కానీ ఆ ధన సంపాదనే ముఖ్య లక్ష్యంగా మనిషి బ్రతకకూడదు. ఈ ధనాంశ అనేది ఎంత భయంకరమైనది అంటే దీనికి తరతమ భేదాలేకాదు. నా, నీ అనే తేడా లేకుండా ఎంతటి బంధాన్నయినా తెంచుకునే స్థితికి దిగజారుస్తుంది.

మనిషి దిగజారటానికి కారణాలు రెండు.

(1) ద్రవ్య సేకరణ (2) లైంగిక అనుభవం మీద తీరని వాంఛ

ప్రతిమనిషి తన జీవితంలో అసలు దు:ఖమనేదే వుండకూడదు.

కేవలం సుఖం మాత్రమే కావాలి అని ఆశిస్తారు.

అందుకే మానవుల యొక్క జీవితం చంచలంగాను, క్షణికంగాను, బాధాకరంగానూ, స్వార్థపూరితంగానూ వుంటుంది.

తామరాకుపై నీటిబిందువు పడి ఎలాగయితే కింద పడిపోతుందో ఈ జీవితం కూడా అలాంటిదే.

ఈ జీవితం శాశ్వతం అనుకుంటాము. కానీ మృత్యువు మన దగ్గర అపాయింట్‌మెంట్ తీసుకుని రాదు. మృత్యువు ప్రవేశించే టైం వస్తే ఆ వ్యక్తి వుండే ప్రదేశాన్ని కానీ, వ్యక్తినికానీ (రాజు, పేద, పెద్ద, ముసలి, ముతక అనే తేడా మృత్యువుకు వుండదు) అది ఎవ్వరినీ లెక్క చేయదు, వదలదు.

అందువల్లె మనిషి తన బాధ్యతలు తీరాక వయసు ప్రమేయం లేకుండా పెట్టె, బేడా సర్దుకుని రెడీగా వుండాలి (ఆ పెట్టెలో వుండవలసినది వజ్రాలు, వైఢూర్యాలూ, ఆస్తులూ, పాస్తులూ, వెండి, బంగారాలు కాదు) ఆత్మజ్ఞానం తప్ప వేరే ఏదీ వుండకూడదు.

ఇది సాధించాలి అంటే నిరంతరం భగవంతుని గురించి సాధన చేయాలి. భగవంతుని గురించి మాత్రమే ఆలోచించాలి.

ఆత్మతత్వాన్ని పొందుతున్నపుడు ఈ అహంకారాన్ని త్యాగం చేస్తూ వుండాలి.

**ఉదా:** చిల్లుకుండలో ఏం పోసినా ఎలాగయితే వుండదో, అలాగే మన మనస్సు కూడా చెత్తా, చెదారం లేకుండా స్వచ్ఛంగా వుండేలా చూసుకోవాలి. ఈ రకంగా వుపాధులన్నీ త్యాగం చేసేసినట్టయితే కేవలం మిగిలేది శుద్ధ చైతన్యం మాత్రమే.

మనం సముద్రాన్ని చూస్తూవుంటే అందులో అలలు, నీరు, నురగ, కెరటాలు అన్నీ కనిపిస్తాయి. వీటన్నింటికీ మూలం నీరు మాత్రమే.

అలాగే బ్రహ్మతత్వం అంతా ఒక్కటే.

ప్రతిక్షణం మనం భగవంతునితో ఓ భగవాన్.. నేను నీ వాడను. నీ ఆజ్ఞమేరకు నేను ఈ భూమిపై పుట్టాను. నాకేం కావాలో నీకు తెలుసు. లేకపోతే నేను ఈ భూమ్మీదకు రాగానే నా తల్లి స్తన్యంలో పాలు పెట్టినపుడే నువ్వు ఎంత దయాసాగరుడవో నాకు తెలిసింది.

ఓ భగవాన్.. నేను ఎప్పుడూ నీతోనే వుండాలి. నీకు సమీపంగా అతి సమీపంగా, ఇంకా సమీపంగా ఉండాలి. నేను ఏ క్షణమైతే స్వార్థంతో, అహంతో, ధనమదంతో నిన్ను మరిచానో ఆ క్షణమే నేను శవమై పోతాను అని అనుకుంటూ సాధన చేసినట్టయితే ఆ భగవంతుణ్ణి మనం పొందగలుగుతాం.

ఈ సాధన వల్ల మనకు భగవంతునిపై నమ్మకంతో పాటు నిష్కల్మషమైన, ప్రగాఢమైన, నిర్మలమైన, కపటంలేని ప్రేమ ఏర్పడుతుంది.

భగవంతునిపై మన ప్రేమ ఎలా ఉండాలి అంటే....

**ఉదా:** ఒకసారి అర్జునుడికి ఆయన హృదయంలో అహంకారం వచ్చిందట. ఈ శ్రీకృష్ణునికి నాకన్నా గొప్ప భక్తులు ఎవ్వరూ లేరు అని మనసులో అనుకున్నాట్ట.

సర్వాంతర్యామి అయిన శ్రీకృష్ణునికి ఈ విషయం గ్రహించటం పెద్దపనేమి కాదు.

ఒకరోజు అర్జునుణ్ణి తీసుకుని అలా వాకింగ్‌కి బయలుదేరాడు. అలా కొంతదూరం వెళ్ళేసరికి అక్కడ ఒక బ్రాహ్మణుడు ఎండుగడ్డి తింటూ కనిపించాడు పైగా ఆ బ్రహ్మణుని నడుముకి ఒక కత్తి వ్రేలాడుతోంది. అతన్ని చూడగానే అతను గొప్ప కృష్ణ భక్తుడని అర్జునునికి అర్థమయింది.

అటువంటి భక్తులు ఎవ్వరికీ హాని తలపెట్టరు. అలాటి అతని దగ్గరకత్తి ఎందుకు వున్నట్టు అనే సందేహం వచ్చి కృష్ణునితో కృష్ణా ఇతన్ని చూస్తే గడ్డిపోచకు కూడా హానిచేయని వ్యక్తిలా వున్నాడు. మరి అతని నడుముకు ఆ కత్తేమిటి అని అడిగాడు.

ఆ మాటకి కృష్ణుడు నవ్వి అర్జునా ఆ మాట అతన్నే అడుగు అన్నాడు.

వెంటనే అర్జునుడు ఆ వ్యక్తిని సమీపించి అయ్యా! మీరు ఎవ్వరినీ హింసించరని మీరు ఎండుగడ్డి తింటుంటేనే అర్థమయింది. (పచ్చగడ్డిలో జీవం వుందని) మరి ఈ పదునైన కత్తితో మీకు పనేమిటి అని అడిగాడు అర్జునుడు.

అయ్యా! నలుగురు మనుషులు వున్నారు. వాళ్ళు ఎక్కడయినా కనపడితే వారికి బుద్ధిచెప్పాలని ఈ కత్తి తీసుకుని తిరుగుతున్నాను అన్నాడు.

అర్జునుడు ఇంత సహృదయంగల వ్యక్తికి శత్రువులు ఎవరైవుంటారా అని అనుకుని వారెవరో ఒక్కసారి చెప్తారా? అన్నాడు.

దానికి బ్రాహ్మణుడు అయ్యా! ఆ నలుగురిలో మొదటివాడు నారదుడు. ఇరవై నాలుగు గంటలూ నారాయణ, నారాయణా అంటూ ఎప్పుడూ పాటలతోటి భజనల తోటి స్వామిని నిద్రపోనివ్వటం లేదు.

ఇక రెండవది ఆ ద్రౌపదీ దేవి! సరిగ్గా నా స్వామి భోజనం చేసే సమయానికి ఆమె ప్రార్థన చేసి పిలవటంతో నా స్వామి భోజనం మానేసి ఆకలితో కామ్యవనానికి వెళ్ళి దుర్వాసుడి శాపం నుండి పాండవులను రక్షించవలసి వచ్చింది. అంతే కాకుండా నా స్వామిచేత తాను తిని వదిలేసిన ఎంగిలి మెతుకులు తినిపించింది.

ఇక ఆ మూడవ వ్యక్తి ప్రహ్లాదుడు! వాడు పిల్లవాడే కానీ, ఎంత క్రూరుడంటే నా స్వామిని మరుగుతున్న నూనెలో వేయించాడు. ఏనుగుల చేత త్రొక్కించాడు. బలమైన రాతిస్థంభాన్ని పగలకొట్టుకుని బయటకు వచ్చేలా చేసాడు.

ఇక మిగిలింది నాలుగవవాడు, దౌర్భాగ్యుడు, అర్జునుడు ఎంత దుర్మార్గుడో తెలుసా? కురుక్షేత్ర యుద్ధంలో నా స్వామిని రథసారథిగా చేసుకుని తను రథంలో కూర్చున్నాడు. ఇంతకన్నా నీచమైప పని

మరేమయినా వుంటుందా? వీరి వల్ల నాస్వామి పడరాని కష్టాలు పడ్డాడు. అందుకే వీరు కనపడితే వూరికే వదలను అన్నాడు.

అంతే అర్జునుడుకి ఆ బ్రహ్మణుని యొక్క అచంచలమైన భక్తి విశ్వాసాలకు నిర్ఘాంతపోయాడు. అర్జునుని యొక్క అహంకారం అణిగిపోయింది. నిశ్చలమైన భక్తి ఎలా వుంటుందో తెలుసుకున్నాడు.

మనం కూడా ఆ బ్రాహ్మణునిలా నిశ్చలమైన భక్తిని కలిగిసాధన చేసినట్లయితే ఆహం నశించి పరమాత్మతత్వం ప్రకాశిస్తుంది.

ఒక వ్యక్తి సంపాదించకలిగిన స్థితిలో వున్నంతవరకూ అందరూ రంజింపచేస్తారు. అదే వయసు పై బడి దేహం జీవసత్వాలు కోల్పోయిన రోజున అందరూ చాకచక్యంగా తప్పుకుంటారు. కానీ ఈ విషయాన్ని గ్రహించలేక మనిషి స్వార్థపూరిత మనస్తత్వంతో ఇవన్నీ నావే, ఇదంతా నాకే అంటూ మురిసిపోతారు. ఆత్మీయులు, భార్యాభర్తలు, పిల్లలు, అన్నాచెల్లెళ్ళు, అక్కలు, తమ్ముళ్ళు అందరూ కూడా అతని వద్దవున్న ఆస్తిపాస్థులను బట్టి ఆ వ్యక్తి మీద అపారమైన గౌరవాన్ని ఎరగా చూపించి వినయ, విధేయతలు చూపిస్తూ నటిస్తూ వుంటారు.

ఏ రోజయితే ఆ వ్యక్తిని వార్ధక్యం అనే మొసలి పట్టుకుంటుందో వీరందరూ తమ నటనకు తెరదించి కనీసం కుశలం కూడా అడుగరు.

అందుకే శ్రీ ఆది శంకరాచార్యుల వారు మనిషి తన చుట్టూవున్న ధన, కనక, వస్తువుల వల్లే ప్రేమించబడుతున్నాడు అని చెప్పారు.

ఈ విషయాలను గ్రహించిన మానవులు ఎంతటి ప్రమాదకరమయిన పరిస్థితిలో పడ్డారో అవగాహన చేసుకుని తమకు అవసరమయిన వాటిని మాత్రమే ఉంచుకుని తన చుట్టూ ఉన్నవారిలో ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ లేనిపోని వ్యామోహాలలో పడకుండా నశించిపోయే ఈ దేహమే శాశ్వతం కానప్పుడు ఈ బంధుత్వాలు మమకారాలు, కక్షలూ, కార్పణ్యాలూ, కోపతాపాలూ వీటివల్ల మనం సాధించేది ఏమిటి? అని

ఎవరికి వారు తమని తాము ప్రశ్నించుకుంటూ వ్యామోహంతో కూడిన ఈ పొరను తొలగించుకుని మోక్షసాధనకై ప్రాకులాడాలి.

ఈ ఆధ్యాత్మిక సాధనకు దుర్ముహూర్తం, యమగండం, మంచిరోజు అనేవి ఆలోచిస్తూ మీనమేషాలు లెక్కించకుండా సాధన ప్రారంభించి నట్లయితే అద్భుతమైన, ఆనందకరమైన, కాంతివంతమైన, వివేకం అనే సముద్రంలో ప్రయాణిస్తూ జ్ఞానం అనే మణిని పొందగలుగుతాము.

❖ ❖ ❖

(36) **శ్లో ॥ సత్త్వం, విశుద్ధం జలావత్తథాపి,**
**తాభ్యాం మిళిత్వా సరణాయ కల్పతే ।**
**య త్రాత్మ బింబః ప్రతిబింబితః సన్**
**ప్రకాశయత్యర్క ఇవాఖిలం జడమ్ ॥**

స్వచ్ఛమైన, మలిన రహితమైన నీరు ఎలాగయితే వుంటుందో సత్వగుణము కూడా అలాగే వుంటుంది. పంచమహాభూతాలు చాలా శుద్ధమైనవి. సత్వ, రజ: తమోగుణాలు కూడా మన మైండ్‌లో మూడ్సులా వుంటాయి.

మనం ఈ మూడు గుణాలకూ బానిసలం. ఈ మూడు కూడా మాయ, మాయ అంటే ఇది వుందనీ చెప్పలేము, లేదని చెప్పలేము.

**ఉదా:** ఇక బ్యాటరీ లైట్ వుంది. అది మంచి కంపెనీది. కాంతి కూడా చాలా ఎక్కువగా వస్తోంది. అబ్బ కాంతి చాలా ఎక్కువగా వస్తోంది. ఈ బ్యాటరీలు ఏ కంపెనీవో చూద్దామని లైటు మూత లూజు చేస్తే ఆ దీపం వెలుగుతుందా? వెలగదు. అదే మాయ.

సత్వ గుణం ఎప్పుడూ మలినం కాదు. రజోగుణం మన యొక్క సంస్కృతిని కప్పివేస్తుంది. తమోగుణం ఇది మన యొక్క స్వరూపాన్ని మరిచిపోయేలా చేస్తుంది. ఈ మూడు గుణాలకూ మనం బానిసలం.

ఈ మూడు కూడా మాయ.

మనం ఈ సత్వగుణాన్ని కనుక పెంపొందించుకుంటూ వెళ్తే మబ్బులు లేని సూర్యుడు ఎలా ప్రకాశిస్తాడో అలా మనం ప్రకాశిస్తాము.

**ఉదా:** ఒక వూర్లో శ్రీమంతుడు అనే ఒక వ్యాపారి వుండేవాడు. అతను పేరుకు తగినట్టుగానే బాగా డబ్బున్న వ్యక్తి.

అయితే అతను తనకున్న సంపదను, అదికారాన్ని, సంఘంలో తనకున్న గౌరవాన్ని చూసుకుని ఎదుటివారిని పురుగుల్లా, హీనంగా చూసేవాడు.

ఆ వూళ్ళో పండితుల్ని సత్కరించే సభకు ఆయన్ని ఆ ఊరి పెద్దగా ఆహ్వానించారు. ఆ వ్యాపారి ధనమదంతో వుంగరాలు, గొలుసులు వగైరా, వగైరా నగలు ధరించి సభకు వచ్చాడు.

అతని వేషధారణ, అతనిలోని గర్వాన్ని గ్రహించిన ఓ పండితోత్తముడు సభను వుద్దేసించి ప్రసంగిస్తూ....

అయ్యా! కొంతమంది వారికి వున్న హోదాను ప్రదర్శించటానికి ప్రయత్నిస్తూ వుంటారు. అందులో తప్పులేదు. కానీ వాటిని చూసుకుని ఎదుటివారిని అవమానించటం సరికాదు.

మనకున్న ఆస్తిపాస్తులు, వెండి, బంగారాలు వజ్రవైఢూర్యాలు అన్నీ కూడా మున్నాళ్ళ ముచ్చటే. మన వెంట వచ్చేవి ఏవీ లేవు. కర్మ ఫలాలు తప్ప. మనం ధనికులు అనుకుంటే. మనల్ని తలదన్నే వారు ఇంకొకరుంటారు.

**ఉదా:** సూర్యుడు అస్తమించాక చీకటిపడటం సహజం కదా? అప్పుడు మిణుగురు పురుగులు మిణుకు, మిణుకుమంటూ ఎగురుతూ ఈ చీకట్లో ఈ ప్రపంచాన్నికంతా మేమే వెలుగులు పంచుతున్నాము అనుకుంటాయి.

కానీ అవి ఆకాశం వైపు చూస్తే మణులలాటి నక్షత్రాలు చూసి వాటి గర్వంపోతుంది.

ఇక తళుకు, బెళుకులు చూసి మురిసిపోతున్న నక్షత్రాలు తామే

ప్రపంచానికి వెలుగులిస్తాయనుకుంటున్న సమయంలోనే చంద్రోదయం అవుతుంది. ఆ చంద్రకాంతిలో నక్షత్రాలు వెలవెలబోతాయి. పాపం అదిచూసి అవి సిగ్గుతో తలదించుకుంటాయి.

ఇక చంద్రుడు తన ప్రకాశంతోను, శీతల కిరణాలతోను ఈ పుడమినంతా ఆనందపరుస్తున్నా ననుకుని గర్విస్తాడు.

ఇది ఇలా వుండగానే తూర్పున సూర్యుడు క్రమక్రమంగా అరుణకాంతులు వెదజల్లుతూ ఉదయిస్తాడు. అప్పుడు చంద్రుడు అదృశ్య మవుతాడు. ఈ విధంగా తాడిని తన్నేవాడుంటే దాన్ని తలదన్నేవాడు మరొకడు వుంటాడు.

మనం మనలోని రజః, స్తమోగుణాలను పూర్తిగా వదలి సత్వగుణాన్ని మాత్రమే పెంపొందించుకుంటూ వుంటే మబ్బులు తొలగాక సూర్యుడు ఎలా ప్రకాశిస్తాడో అలా ప్రకాశించటం జరుగుతుంది.

పర, పశ్యంతి, మధ్యమ, వైఖరి వీటన్నింటికీ మూలం పరమాత్మ. ఆ పరమాత్మతత్వం కలిగిన వ్యక్తి గురునానక్. అందువల్లె ఆయన ఎదుటివారి మనసులోని మాటలను అవలీలగా గ్రహించగలిగేవారట.

**ఉదా:** ఒకసారి అక్బరు గురునానక్‌ని భోజనానికి పిలిచారట. గురునానక్ రాగానే అక్బరు పూజ ప్రారంభించాడట.

అక్బరు పూజ ముగించగానే గురునానక్ అక్బరుతో నాయనా పూజ చేస్తున్నంతసేపూ నువ్వు గుఱ్ఱాలని ఎలాకొనాలా అని ఆలోచిస్తున్నా వెందుకు. ఆ పని భగవంతునిది కదా? నీకు ఏ ఖరీదుకి రావాలని వుందో ఆ ఖరీదు డిసైడ్ చేసేది. ఆ భగవంతుడే కదా? మరి నీకెందుకు ఈ బాధ అనగానే... అక్బరు గురునానక్ కాళ్ళపై పడ్డాడట.

అలాగే సంతు జ్ఞానేశ్వర్ మహరాజ్ ఒక చెట్టు క్రింద కూర్చుని సాధన చేసుకుంటుండగా కొందరు వ్యక్తులు ఆయనని కించపరచటానికి వెటకారంగా నువ్వు వేదాంతాన్ని పలుకుతావు నీ పేరులోనే జ్ఞానాన్ని

పెట్టుకున్నావు. నువ్వు నిజమైన జ్ఞానివయితే (ఎదురుగా వున్న) ఈగేదె చేత వేదాలు పలికించు అని వెకిలిగా నవ్వారట.

వెంటనే జ్ఞానేశ్వర్ మహరాజ్ గేదెను చేతితో తట్టి వేదం చదువు అనగానే ఆ గేదె అద్భుతంగా, శ్రావ్యంగా పురుషసూక్తం చదివిందట.

ఇది సాధ్యమేనా అంటే మన పురాణాలు, ఇతిహాసాలు, ఋషులు, యోగులు, సాధువులు వీరందరు సాధ్యమనే చెప్తున్నారు

అయితే మనం సత్వగుణాన్ని పెంచుకుంటూ వెళ్తే మనలో అహంకారం చస్తుంది. ఎప్పుడయితే ఈ అహం చచ్చిందో అప్పుడు సాధన సాధ్యమవుతుంది. ఆ సాధన చేయగా చేయగా ముక్తి కలుగుతుంది.

❖ ❖ ❖

(37) **శ్లో ॥ యఃపశ్యతి స్వయం సర్వం యం న పశ్యతి కశ్చన**
**యశ్చేతయతిబుద్ధ్యాది న తద్యం చేత యత్యయమ్ ॥**

ఎవరయితే అన్నింటినీ చూస్తున్నాడో, ఎవర్నయితే ఎవరూ చూడలేరో (చూడాలనుకోవటం లేదో) ఆయన్ని ఎవరూ చూడటం లేదు.

**ఉదా:** ఒక మిఠాయి వుంది, దానికి పంచదారతో తీపి వస్తోంది. అయితే మరి ఆ పంచదారకి ఆ తీపి ఎలా వచ్చింది? ఆ తీపినిచ్చేది ఏదయినా వుందా? లేదు. అది స్వయంగా దానంతటదే వచ్చింది. అలాగే సూర్యునికి చీకటి అంటే తెలియదు. చీకటికి సూర్యుడు అంటే తెలియదు. కానీ వెలుగునీ, చీకటినీ చూస్తున్న మన యొక్క చైతన్యం ఎంత గొప్పదో మనం తెలుసుకోలేకపోతున్నాము.

(జానామి, ఇచ్చామి, కరోమి) బుద్ధి, మనస్సు, ఇంద్రియాలకు అందనటువంటివి కొన్ని వుంటాయి.

ఈ శరీరం పుట్టిన దగ్గర నుంచి పోయేవరకూ ఎవరి జీవితం ఒకేలాగా గడవదు. ఈ శరీరానికి కష్టసుఖాలు రెండూ వెలుగు,

నీడలులాటివి. ఈ శరీరం నాది కాదు. నేను కేవలం ఆత్మను మాత్రమే. అనే ఆత్మానుభూతితో ప్రయాణం సాగిస్తుంటుంటే దేహబాధ చింతే వుండదు. ఏదయినా రోగం వచ్చినా అది శరీరానికి మాత్రమే. ఆత్మకు మాత్రం కాదు. అది ప్రారబ్ధానుసారం వచ్చింది. ఏ కష్టం వచ్చినా ఆ భగవంతునికి తెలియకుండా రాదు.

మనకి ఏదయినా కష్టం వస్తే మనం వెంటనే భగవంతుణ్ణి నిందిస్తాము అది తగ్గటం కొంచెం ఆలస్యమైతే గ్రహశాంతులు, హెూమాలు, జాతకాలు ఇలా రకరకాల హడావిళ్ళు చేస్తాము.

మరికొందరయితే ఇది మనం కూడా తెచ్చుకున్న ప్రారబ్ధకర్మ అనేది మర్చిపోయి మతమార్పిడి చేసుకుని భ్రష్టులవటం జరుగుతోంది.

ఎన్ని జపతపాలూ, హెూమాలు, జాతకాలూ చూపించి, చేయించినా, ఆ కర్మఫలం పూర్తయితే కానీ తగ్గదు.

అసలు జాతకం అంటే జా అంటే జన్మ, త అంటే తత్వం. అంటే జన్మతత్వం అనగా కర్మఫలం అని అర్థం. జాతకం అనగా జన్మయొక్క తత్వాన్ని చెప్పేది. అంటే మనం తల్లి గర్భంలో ఉండగానే మన జీవితం మొత్తం సి.డి.గా తయారు చేస్తారు బ్రహ్మగారు. అందుకే మన పెద్దలు చెప్పారు. బ్రహ్మ ఒకసారి రాసిన రాతను మళ్ళీ ఆయన కూడా సరి చేయలేరు. (తిరిగి మార్చి వ్రాయలేరు)

హరికథలు ఎవరయినా చెప్పగలరు. కానీ హరి వ్రాసిన కర్మను ఎవరయినా అనుభవించకుండా తప్పుకోగలరా! (హరి అంతటి వారికే ప్రారబ్ధం తప్పలేదు)

తల్లి గర్భం నుండి బయటపడినది మొదలు జీవుడు శరీరాన్ని వదిలే వరకూ మన శరీరంలో (నిద్రపోయేటప్పుడు తప్ప) పనిచేసే అవయవం ఏదీ అంటే “నోరు”. దీని పని ఏమిటి అంటే అతిగా తినటం, విపరీతంగా వాగటం.

ఇలా అతిగా తినటం వల్ల ఒళ్ళు మాత్రమే పెరుగుతుంది. కానీ విపరీతంగా వాగటం వల్ల (అవాకులూ, చవాకులు) ఎన్నో అనర్థాలు వస్తాయి. వీటి వల్ల మంచి ఫలితాలకన్నా, చెడు పలితాలు ఎక్కువగా వుంటాయి.

ఇలా అతిగా వాగటం వల్ల, విపరీతంగా తినటం వల్ల మనకు అనారోగ్యాలతో పాటు మానసిక ప్రశాంతత పోతుంది. అనేక రోగాలు వచ్చిపడతాయి.

అదే మనం సాత్వికమైన ఆహారం తీసుకుంటూ, మితంగా మాట్లాడుతూ వున్నట్లయితే మన యొక్క ఆలోచనలు సాత్వికంగా ఉండటంతో పాటు మాట్లాడే మాటలు కూడా పదిమందికి వుపయోగపడేలా వుంటాయి.

అలా కాకుండా అడ్డమైన చెత్తా తింటూ, నోరుంది కదా అని పిచ్చివాగుడు (అహంకార పూరితమైన మాటలు) వాగితే దాని ప్రభావం ఎలా వుంటుందంటే ఈ రోజు మనం టి.వి.లో చూస్తున్న నేరాలు, ఘోరాలు, కక్షలూ, కార్పణ్యాలూ, హత్యలూ, ఆత్మహత్యలు వగైరా వగైరాలుగా ఉంటుంది.

ఇంతటితో అయిపోయిందా?

వీటి యొక్క కర్మఫలం ఈ జన్మలోనే అనుభవించి తీరాలి. చాలామంది పుణ్యం చేస్తే స్వర్గప్రాప్తి, పాపం చేస్తే నరకప్రాప్తి అనుకుంటూ వుంటారు. వీటిని పోగొట్టుకోవటానికి రకరకాల పూజలూ, నోములూ, హోమాలు చేస్తూవుంటారు. కానీ వీటివల్ల పాపప్రక్షాళన జరగదు.

ఇక్కడ మనం తెలుసుకోవలసిన నిజం ఏమిటంటే పాపం ఇనుప సంకెళ్ళయితే, పుణ్యం బంగారు సంకెళ్ళు.

ఒక్కొక్కసారి ఎంతటి మహారాజులయినా ఆలోచన రహితంగా చేసే పనులు తిరిగి మళ్ళీ వారినే చేరతాయి అనటానికి ఒక ఉదాహరణ ఈ

క్రింది కథ.

**ఉదా:** పూర్వం ఒక రాజుగారు వుండేవారు. ఆయన ఎప్పుడూ రకరకాల పోటీలు పెట్టి గెలిచిన వారికి ఎన్నో బహుమతులు ఇస్తూ వుండేవారు.

ఒకసారి ఆ రాజుకి విచిత్రమైన కోరిక కలిగింది. అది ఏమిటంటే బుద్ధిహీనుల పోటీ నిర్వహించాలనుకుని రాజ్యంలో దండోరా వేయించాడు.

రాజ్యంలోని బుద్ధిహీనులందరూ పోటీలో పాల్గొన్నారు. అందరూ తమ తమ ప్రావీణ్యాన్ని చూపించారు. అందంలో ఓ వ్యక్తి అత్యుత్తమంగా తన బుద్ధిహీనతను ప్రదర్శించి మొదటి విజేతగ నిలిచాడు.

రాజుగారు విజేతగా నిలచిన వ్యక్తిని పిలిచి తన మెడలో వున్న హారాన్ని (వజ్రాల) అతని మెడలో వేసి సత్కరించాడు. సభ ముగిసింది. అందరూ వెళ్ళిపోయారు.

ఇది జరిగిన కొద్దిరోజులకే రాజుగారికి చాలా అనారోగ్యం చేసింది. ప్రజలందరూ వెళ్ళి రాజుగార్ని పరామర్శించి వస్తున్నారు. ఒకరోజు బుద్ధిహీనుడు కూడా రాజుగారిని చూడటానికి వెళ్ళాడు.

పాపం రాజుగార్ని చూడగానే బుద్ధిహీనుడు చాలా బాధగా రాజా! ఏమిటి ఇలా అయిపోయారు. ఇప్పుడు మీ ఆరోగ్యం ఎలా వుంది అని అడిగాడు. దానికి రాజుగారు నా ఆరోగ్యం బాగా క్షీణించిపోయింది. ఇంక నేను ఎక్కువ కాలం ఉండక పోవచ్చు అన్నాడు

అప్పుడు బుద్ధిహీనుడు అవునా ప్రభూ! అయితే మీరు వేరేచోటకి వెళుతున్నారా? మరి మీ దగ్గర వున్న సంపదంతా అక్కడికి పంపించారా? అక్కడ పెద్ద భవనం కూడా కట్టించేసారా? మీ సంపదలతో పాటు, సేవకులు, మంత్రులు పరివారం అందరూ మీ వెనక్కాలే వస్తున్నారా? అని అడిగాడు.

రాజుకి బుద్ధిహీనుడి మాటల్లోని మర్మం అంతుచిక్కలేదు. కానీ అతని

మాటల్లో ఏదో జ్ఞానబోధ కనిపించింది.

మహారాజా! ఇక్కడ మీరు ఎన్నో రాజ్యాలు సంపాదించారు (జయించారు). ఎన్నో విలాసాలు అనుభవించారు. కానీ మీరు అక్కడకి ఏమీ పంపకుండా వెళ్ళిపోతే ఎలా?

మీ విలువైన కాలాన్ని బుద్ధిహీనుల కోసం వృథా చేసుకుంటే అక్కడ మీ జీవితం ఎలా గడుస్తుంది. బుద్ధిమంతులు ఎవరయినా రేపటి గురించే కదా ఆలోచిస్తారు. అంటూ తనమెడలో రాజు వేసిన హారాన్ని తిరిగి రాజుగారి మెడలో వేసి ఇప్పటికయినా ఎవరు బుద్ధిహీనులో ఆలోచించుకోండి అంటూ వెళ్ళిపోయాడు.

రాజుకి జ్ఞానోదయమైంది. ఈ ప్రపంచమే శాశ్వతమనీ, ఈ జీవితమే సర్వస్వమనీ రేపు గురించి ఆలోచించకుండా అహంకారంతో పనికి మాలిన ప్రాపంచిక వ్యామోహంలో పడటమే నిజమైన బుద్ధిహీనత అని గ్రహించి దైవచింతనలో పడ్డాడు రాజుగారు.

❖ ❖ ❖

(38) శ్లో ॥ **అఖణ్ణ నిత్యాద్వయ బోధశక్త్యా,**
**స్ఫురన్త మాత్మాన మనన్త వైభవమ్**
**సమావృణోత్యా వృతిశక్తిరేషా**
**తమోమయీరాహురి వార్కబింబమ్ ॥**

ఈ తమో గుణం యొక్క లక్షణాలు అన్నింటినీ ఆవరించటం అనంతమైన అనుభవం గల ఈ రూపాన్ని సూర్యుణ్ణి రాహువు ఎలా ఆవరిస్తుందో అలా బుద్ధిని అజ్ఞానం ఆవరిస్తుంది.

మనం సంసారమనే భయంకరమైన సముద్రంలో జనన మరణాలనే తరంగాలను దాటి మోక్షం కోసం ప్రాకులాడాలి. బ్రహ్మజ్ఞానాన్ని తెలుసుకోగలగాలి.

ఇప్పుడు మనం గురువుల దగ్గర ఇంగ్లీషు, తెలుగు అలా రకరకాల సబ్జెక్టులు నేర్చుకుంటున్నాము. కానీ మన జీవితానికి అతి ముఖ్యమైన విషయాలను మాత్రం నేర్చుకోలేకపోతున్నాము. అసలైన బ్రహ్మజ్ఞానాన్ని వదిలేసి కేవలం నీడను మాత్రమే పట్టుకుంటున్నాము.

ఎప్పుడయితే నా అస్తిత్వాన్ని నేను స్వయంగా గుర్తించ కలుగుతానో అప్పుడు నేను వున్నాను అని తెలుసుకోవటానికి ఏ కాంతీ అవసరం లేదు. ఎప్పుడయితే స్వప్న పురుషుడు అంతమయ్యాడో అప్పుడు జాగృత్ పురుషుడు కనిపిస్తాడు.

ముందుగా మనం జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని రెండింటినీ దాటిపోవాలి. ఇవి రెండూ దాటిన వారు మాత్రమే భగవత్ సాక్షాత్కారం పొందగలరు.

మనకు ఎన్నో తెలుసు అని అనుకోవటం, ఎదుటివారికి ఏమి తెలియదనుకోవటం అజ్ఞానం. మనం ప్రతీవారిలోనూ భగవంతుణ్ని చూడగలగటమే జ్ఞానం.

**ఉదా:** వశిష్ట మహర్షి యొక్క నూరుగురు కొడుకులూ చనిపోయినపుడు ఆయన వారి కోసం విపరీతంగా విలపించాడట.

అది చూసి లక్ష్మణస్వామి అన్నయ్యా! వశిష్ట మహాముని అంతటి వ్యక్తి ఇలా విలపించటం ఎంతో ఆశ్చర్యంగా ఉంది కదా? అంటే...

దానికి రాములవారు, లక్ష్మణా ఎంతటి జ్ఞానం గల వారికయినా ఎంతో కొంత అజ్ఞానం వుండి తీరుతుంది. మంచి వ్యక్తి ఎంతో మంచి కోరినా చెడుకూడా జరగక తప్పదు.

వెలుగు తెలిసిన వారికి చీకటి ఏమిటో తెలియక తప్పదు.

అలాగే బ్రహ్మజ్ఞానానికి, అజ్ఞానానికి, ధర్మానికి, అధర్మానికి, పుణ్యానికి, పాపానికి ఆవల అనేది ఒకటి వుంటుంది. వీటన్నింటినీ దాటిన స్థితినే విజ్ఞానం అంటారు. ఈ విజ్ఞానం ఎవరయితే సంపాదిస్తారో వారికే భగవత్ సాక్షాత్కారం లభిస్తుంది.

ఈ బ్రహ్మసాక్షాత్కారం కోసం విజ్ఞానం సంపాదించాలంటే క్రియ వుండాలి. క్రియ అంటే సత్కర్మ. ఈ సత్కర్మ చేస్తేనే కానీ చిత్తం శుద్ధవదు. చిత్తం శుద్ధి అయితేనే కానీ విజ్ఞానం అర్థం కాదు. ఆ విజ్ఞానమే మోక్షం.

కానీ మనం ఈ అజ్ఞానం కారణంగా ఈ ప్రపంచం అంతా నాలోనే వుంది అనుకుంటాము.

**ఉదా:** ముత్యపు చిప్పలో వెండిలా, తాడులో పాములా, ఎండమావిలో నీరులా ఈ ప్రపంచం అంతా నాలోనే వుంది అనిపిస్తుంది.

ఈ అజ్ఞానం నుంచి మనం బయటపడాలి అంటే ముందుగా మనం ఏవయితే మనవి, మనవి అనుకుంటూ మురిసిపోతున్నామో వాటి నుంచి బయటపడాలి. ఎలా అంటే కొంతవరకైనా ఈ రాగద్వేషాల నుంచి బయటపడాలి. వీటి నుంచి బయటపడాలి అంటే వాటిని బలవంతంగా తెంపేసుకోవాలని కాదు. ఏది ఎంత వరకూ అవసరమో అంతవరకే వుండాలి.

మబ్బుల వల్ల తుఫాను, జడివాన, చల్లగాలి వస్తాయి. అలాగే కామ, క్రోధ, మద, మాత్సర్యములు కూడా తుఫానుల్లా వస్తాయి.

జ్ఞానం అంటే వృత్తి ప్రమేయం వుంటుంది. విజ్ఞానంలో వృత్తి ప్రమేయం వుండదు. వృత్తి లేకుండా విజ్ఞానాన్ని మనం పొందలేము.

ఇవన్నీ మనం సాధించాలి అంటే గురువు వల్ల మాత్రమే సాధ్యం. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి వైద్యుని సంప్రదించటం ఎంత అవసరమో "గురుముఖత: శాస్త్రాధ్యయనం చేయటం అంత అవసరం లేకపోతే శాస్త్రాలు తెలుసుకోవటంలో ఎన్నో అపార్థాలు వస్తాయి.

**ఉదా:** "సత్యం వధ, ధర్మం చెర" అని శాస్త్రం చెప్పింది. సత్యం పలుకు అంటే అందులోనే అసత్యం పలకకు అనే అర్థం వుంది. ఇది తెలుసుకుని శిష్యులకు జ్ఞానాన్ని బోధించగలిగేది గురువు, శిష్యులను

బానిసగలుగా చేసుకుని వారు తమని మించిపోతారేమో అనే భయం గురువుకి వుండకూడదు. శిష్యునికి దిశానిర్దేశం చేయటానికి గురువు నిరంతరం ప్రయత్నించాలి.

అలాగే శిష్యులు కూడా గురువును తల్లి, తండ్రుల కంటే ఎక్కువగా గౌరవించాలి. ఎందుకంటే తల్లితండ్రులు ఇచ్చిన జన్మపూర్తయితే మళ్ళీ జన్మవస్తుంది. శాస్త్రం ద్వారా గురువు ఇచ్చే జన్మ "దీక్షా జన్మ" అందుకే ఇది మరు జన్మలేకుండా ముక్తిని ప్రసాదిస్తుంది. దీనినే గొప్ప జన్మ అంటారు.

మన భారతీయ సంస్కృతిలో గురువుకి చాలా గొప్ప స్థానం ఉంది. నేటి సమాజంలో గురు సంస్కృతి చాలా దిగజారిపోయింది. గురువుని గౌరవించి వారిని పూర్తిగా విశ్వసించి వారి వద్దనుంచి తనకు కావలసిన శాస్త్ర జ్ఞానాన్ని పొందాలి.

అలాగని గురు భజనలు చేస్తూ వారిని పొగుడుతూ హారతులు ఇస్తే ఎటువంటి లాభమూ వుండదు.

సర్వవేదాలు తెలిసినవాడు, కోరికలు లేనివాడు, బ్రహ్మ జ్ఞానంలో కూడా ఉత్తముడు, శాంతి స్వభావం కలవాడు. అందరి మీద పున్నమి చంద్రునిలా దయ అనే వెన్నెలను పంచేవాడు. శిష్యుని యొక్క సర్వస్వమూ తానుగా అనుకునే భావం కలిగించ గలవాడూ అతనే పరమ గురువు. శిష్యునికి కావలసినది ఇటువంటి గురువే.

❖ ❖ ❖

(39) **శ్లో ॥ బీజం సంస్కృతి భూమి జస్యతుతమో దేహత్మ ధీరజ్కురో**
**రాగః పల్లవమంబు కర్మతు వపుఃస్కన్ధో సవఃశా ఖికాః।**
**అగ్రణీస్త్రియ సంహతిశ్చ విషయాః పుష్పాణి దుఃఖం ఫలం**
**నానాకర్మ సముద్భవం బహువిధం భోక్తాత్ర జీవిఃఖగ: ॥**

అసలు ఈ మానవ జన్మ చాలా వుత్తమమైనది. ఇది 84 లక్షల

జన్మల తరువాత మనకి లభిస్తుంది. ఈ మానవ జన్మ కేవలం మనం భగవంతుణ్ని తెలుసుకోవటానికి మాత్రమే అనేది మనం తెలుసు కోకుండా, పనికిరాని విషయ వస్తువుల వెంట పరుగులు పెడుతూ జీవితకాలాన్ని నాశనం చేసుకుంటున్నాము.

ఒక వ్యక్తికి త్యాగాలతో కలిసిన భోగాలు అనుభవించే హక్కు వుంది కానీ భోగమే జీవితం అనేది మనకి పనికి రాదు.

ఈ మానవ జన్మలో మనం మనకి ఎంత శక్తివుంటే అంతవరకూ ఎదుటివారికి మంచి చేయటానికి, మనవల్ల ఎవరి జీవితాలకూ నష్టం వాటిల్లకుండాను, మనపై వారిని, క్రిందవారినీ గౌరవిస్తూ పదిమందికి మేలు చేస్తూ సంస్కారవంతంగా బ్రతకాలి.

అంతేకానీ ఐశ్వర్యం హెూదా వున్నాయి కదా అని, ఎదుటివారిని చిన్న చూపు చూస్తూ వారిచేత అయిన పనీ, కాని పనీ చేయించుకుంటూ వుంటే వారికి మనం పీకలదాకా ఋణపడిపోతాం. అంతేకాకుండా ఆ ఋణం తీర్చుకోవటం కోసం వారి ఇంట్లో మనం పదేపదే పుట్టటం, ఆ పనుల యొక్క ఋణం తీరగానే చావటం, ఇలా ఎన్నో జన్మలు ఎత్తటం, చావటం జరుగుతూ వుంటుంది.

మనం ఇవేమీ గ్రహించలేక అజ్ఞానం అనే మురికి కూపంలో కూరుకుపోతున్నాము.

**ఉదా:** ఒక బాటసారి కాశీ వెళ్ళటానికి (కాలినడకన) ప్రయాణమై వెళ్తుండగా అతను తెచ్చుకున్న ఆహారం అయిపోవటంతో, అతడు ఆకలి వల్ల నీరసంతో నడవలేక తూలిపోతుంటే, అదే దారిన వెళ్తున్న ఒక రైతు ఆ బాటసారిని పట్టుకుని ఒక దగ్గర కూర్చోపెట్టి తన భూజాన వున్న మూటలోంచి రెండు రొట్టెలు తీసి తినిపించాడు.

అవి తినగానే బాటసారికి కొంత ఓపిక వచ్చి నాయనా, దాహంగా వుంది అనేలోపే రైతు తన దగ్గరవున్న చెంబులోని నీరు బాటసారికి

ఇవ్వబోయాడు. దానికి బాటసారి నాయనా చెఋవు చూపిస్తే నీరు త్రాగివస్తాను అన్నాడట. దాంతో రైతుకి కోపం వచ్చి బాటసారిపై కోపడ్డాడు.

అప్పుడు బాటసారి నాయనా, నీవు నన్ను అపార్థం చేసుకుంటున్నావు. ఓపిక వున్నంత వరకూ మనిషి తన పని తాను చేసుకోవాలి తప్ప ఎదుటి వారి చేత చేయించుకోకూడదు. అలా చేయించుకుంటూపోతే ఆ పనిచేసిన వారికి మనం ఎంతో ఋణపడి పోయి వుంటాము. ఆ ఋణం తీర్చుకోవటానికి మనం మళ్ళీ ఎన్నో జన్మలు ఎత్తవలసి వుంటుంది.

అందువల్ల ఇప్పటికే నువ్వు చేసిన సాయం వల్ల నేను నీకు ఎంతో ఋణపడి వున్నాను. నీకు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువే. నువ్వు తినవలసిన రొట్టెలను నాకు త్యాగం చేసావు. నీ త్యాగాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను అని రైతుకు కృతజ్ఞతలు చెప్పిన బాటసారి మాటలకు రైతు బాధగా రెండు చేతులూ జోడించి. అయ్యా! ఇందులో ఇంతభావం వుందని తెలుసుకోలేకపోయాను. నన్ను క్షమించండి అని నమస్కరించాడు.

ఈ రకంగా మానవజన్మ త్యాగ, భోగాల సమ్మేళనం అని నిరూపిస్తోంది. అంతేకాకుండా మానవుని యొక్క సత్ప్రవర్తన ఏ రకంగా వుండాలి అంటే దానికి ఉదాహరణగా రైతును చెప్పుకోవచ్చు. కానీ ఇలాంటి వారిని ఎంతమంది ఆదర్శంగా తీసుకుంటారు. ఇలాంటి వారిని ఆదర్శంగా తీసుకుంటే దానివల్ల మనం పొందగలిగే ఆనందం, తృప్తి ఎంతో మనకి హాయిని కలగజేస్తాయి అన్న విషయం మనం బాగా అర్థం చేసుకోగలిగితే అంతా ఆనందమే.

❖ ❖ ❖

(40) శ్లో ॥ ముంజాదిషీకామివ దృశ్యవర్గాత్
ప్రత్యఞ్చమాత్మానవంసంగమ క్రియమే ।
వివిచ్య తత్రప్రవిలాప్యసర్వం
తదాత్మనా తిష్టతి యంః సముక్తః ॥

మోదుగ గడ్డి నుండి పొరలు (ఒకపొరకి, ఇంకొకపొరకి సంబంధం వుండదు) అతుక్కుని వుండవు. అందువల్ల దాని ఒక్కొక్కపొర జాగ్రత్తగా వేరు చేయాలి (నేర్పుతో). ఎందువల్ల అంటే ఆ పొరలు చాలా సున్నితంగా వుంటాయి.

ఈ విధంగా మన స్వరూపాన్ని దృశ్య ప్రపంచం వేరు చేసినట్లయితే మన ఆత్మతత్వం బయటపడుతంది. ఎవరయితే నా ఆత్మ స్వరూపం ఇదే అని తెలుసుకుంటారో వారే జీవన్ముక్తులు.

ఓంకారం (పరమాత్మ స్వరూపం)
వా (వాసనలు)
↓
(శ) శరీరము    మనస్సు(బుద్ధి)
↓    ↓
(ద)దర్శించేవాడు (భా)భావించేవాడు (వి)విచారించేవాడు
↓    ↓
(వి) విషయ వస్తువులు    (ఉ) ఉద్రేకము
↓    ↓
(వా) తలపుల    ఆలోచనలు

దర్శించేవాడు, భావించేవాడు, విచారించేవాడు ఈ మూడింటికీ కూడా ఓంకారమే మూలకారణం. నేను పరమాత్మ స్వరూపుణ్ణి.

అనవసరంగా ఈ మాయచే కప్పబడిన ఈ విషయ వస్తువులపై వ్యామోహంలో ఇరుక్కుపోయాను.

అని తెలుసుకున్నట్టయితే మనం బయట పడగలుగుతాము. పరమాత్మ చేసే ఈ సంసారమనే ఇంద్రజాలంలో మనమందరం పావులం.

ఈ మానవ జన్మ లక్ష్యం ఏమిటంటే అల్పమయిన ఆయువుతో శాశ్వతమైన జీవితాన్ని పొందమని. కానీ మనం ఒక కోరిక తీరాక ఇంకొక కోరిక, అది తీరాక మరొకటి అంటూ ఆశల సంసారంలో పడికొట్టుకుపోతూ నశించని దానిని (మోక్షాన్ని) వదిలి నశించే (శరీరంతో) దానితో సంబంధం పెట్టుకుంటున్నాము.

**ఉదా:** ఒక జిజ్ఞాసువు ఒక ఇంటి అరుగుమీద కూర్చుని ఆ ఇంట్లో ఏం జరుగుతోందో చూస్తున్నారు.

ఆ ఇంట్లో ఒక అమ్మాయి ఉంది. ఆమె ఇంటికి వచ్చిన అతిథుల్ని సాదరంగా ఆహ్వానించి కుశల ప్రశ్నలు అడిగి మంచినీరు ఇచ్చి అమ్మా! మీరు సేదతీరండి. నేను వంట చేసి మీకు భోజనం పెడతాను. అమ్మా! నాన్నగారు వూరు వెళ్ళారు అని చెప్పింది.

ఇంట్లో ధాన్యం లేవు. ప్రక్కింటికి వెళ్ళి ధాన్యం తెచ్చి దంచటం మొదలు పెట్టింది.

ఆ దంచుతున్న చప్పుడుకి ఆమె రెండు చేతులకి వున్న గాజులు చప్పుడు రావటంతో ఆమె రెండు చేతులకి ఒక్కొక్కగాజు వుంచి మిగిలినవన్నీ ప్రక్కన పెట్టుకుంది. (వీరింట్లో ఇంత దరిద్రమా! అన్నం వండుకోవటానికి బియ్యం కూడా లేదు అనుకుంటారు అని)

ఇదంతా చూసిన జిజ్ఞాసువు ఇలా అర్థం చేసుకున్నాడు. ఎక్కువ వుంటే (ఏదయినాసరే) గోల ఎక్కువగా వుంటుంది. దాని వలన శాంతి వుండదు. శాంతి కలిగిన వారే సుఖంగా వుండగలరు.

సుఖం కావాలి అంటే సజ్జన సాంగత్యం వుండాలి.

**ఉదా:** ఒక వూరిలో ఒక యోగి వున్నారు. ఆయనకి అన్ని సిద్ధులూ వున్నాయి. ఆయన తన సరదా కోసం నీటిమీద తేలుతూ, గాలిలో ఎగురుతూ సాధన చేసేవారట.

ఒకరోజు ఒక ఈగ ఎగురుతూ వుంటే అబ్బ ఈగ ఎంతబాగా ఎగురుతుందో నేను ఈగనైతే ఎంత బాగుంటుందో కదా అనుకోగానే ఆయన ఈగలా మారి ఎగరటం మొదలుపెట్టాడు. ఆ ఈగను ఒక పిచుక తరముతూ వచ్చింది. అప్పుడు యోగి గారు ఈ ఈగ కన్నా ఈ పిచుక ఎంత అందంగా వుందో అబ్బ ఈ పిచుకలా మారితే బాగుండును అనుకున్నాడట. ఆ పిచుకలా మారి ఎగురుతుంటే వేటగాడు వలవేసి పట్టుకోబోతే ఆ వేటగాడిలా మారిపోవాలనుకున్నాడట. అలా ఎన్ని అవతారాలు ఎత్తినా ఏదో ఒక సమస్య వెంటాడే సరికి యోగి నా జన్మే నాకు బాగుంది. మనశ్శాంతి లేని ఇవి నాకు వద్దు బాబోయ్ అనుకుని యోగిగా మారి సాధన చేసుకోవటం మొదలుపెట్టారట.

అన్నిటికన్నా భయంకరమైనది ఆశ. ఆ ఆశే మహాపాపంలా మనల్ని నాశనం చేస్తోంది. అన్నీ నాకే, అంతా నాకే అనుకోవటమే మహాపాపం. అది పాపమని తెలిసినా అన్నీ మనమే అనుభవించాలి. అందరి కన్నా మనమే గొప్ప, ఇంకా ఏదో కావాలి, ఇంకా ఇంకా ఎంతో కావాలి అనుకుంటూ పనికిమాలిన బ్రతుకు బ్రతుకుతూ గడిచిన సమయం తిరిగిరాదని తెలిసినా పాపకూపంలో పడి శ్లేష్మంలో పడిన ఈగలా కొట్టుకుంటూ వున్నాము.

ఇలాంటి వ్యామోహాలతో తాపత్రయాల సముద్రంలో కొట్టుకుపోతుంటే మరి మనని కాపాడి మనకి నిజమైన, స్వచ్ఛమైన, బ్రహ్మాండభరితమైన ఆనందాన్ని పంచే ఆ పరబ్రహ్మని పట్టుకోవటానికి మనం ఎప్పుడు, ఎలా ప్రయత్నిస్తాం. అసలు ఆ ప్రయత్నం ఎప్పుడు మొదలుపెడతాం.

ఏ క్షణం ఎలా వుంటుందో తెలియని, చెప్పలేని ఈ రోజుల్లో ఆస్తిపాస్తులు, పేరు ప్రతిష్టలు, బంధాలు, బాంధవ్యాలు ఏవీ కూడా మనతో రావని తెలిసి సంపాదనకై ఆత్రం, శరీరంపై మోహం, అజ్ఞానం ఆకాశమంత, జ్ఞానం అవగింజంత, పాపం కొండంత, పుణ్యం గోరంత వయసు తరుగుతోంది, సమయం ఆసన్నమవుతోంది.

మనతో వచ్చేది, మన కూడా వుండేది, ధర్మం మాత్రమే. దేహం పడిపోయి శరీరం కాలిపోయి భయంతో జీవుడు దిక్కుతోచని స్థితిలో వున్నప్పుడు మనకు వెలుగును చూపించి ఒంటరితనం నుంచి కాపాడే శక్తి ఆ ధర్మానికి మాత్రమే వుంది. (ఆ పరమేశ్వరునికి మాత్రమే వుంది) ఆయనే ధర్మం.

తొందరలో మన జీవనయాత్ర ముగియబోతోందని తెలిసినా ప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపోచల్లా కొట్టుకుపోతున్నా మనయొక్క జీవన విధానం మార్చుకోకపోతే ఎలా?

మన బాధ్యతల్ని పిల్లలకి అప్పగించి కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యాలూ వదిలిపెట్టి ఓపిక వుండగానే మోక్షప్రాప్తి కోసం నిరంతరం భగవధ్యానం చేయటం చాలా చాలా మంచిది.

అంటే రాగద్వేషాలకి అతీతంగా భగవధ్యానంలో ప్రశాంతంగా గడపగలిగేలా ప్రణాళిక వేసుకోవాలి.

కోరికలు అనేవి మనిషిని బంధాలలో బంధిస్తాయి. కానీ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలు కనుక మనం కోరుకుని ఆచరించినట్లయితే అవి మనల్ని బంధవిముక్తుల్ని చేస్తాయి.

మనకి కోపం వచ్చినపుడు (మితిమీరిన కోపం వచ్చినపుడు) ఆ కోపంలో దేన్నయినా విసిరివేస్తాము. కానీ ఆ కోపంలో మనకు అవసరం లేని విషయవస్తువులతో పాటు కోపాన్ని కూడా విసిరి వేసినట్టయితే మనకి బంధ విముక్తి ఖచ్చితంగా కలుగుతుంది.

❖ ❖ ❖

(41) శ్లో ॥ **దేహో2 యమన్నభవనో2న్నమయస్తు కోశ**
**శ్చాన్నేన జీవతి వినృశతి తద్విహీనః ।**
**త్వక్చర్మ, మాంసరుధిరాస్తి పురీషరాశి**
**ర్నాయం స్వయం భవితుమర్హతి నిత్యశుద్ధః ॥**

ఆనందమయ, అన్నమయము, ప్రాణమయము, మనోమయ, విజ్ఞానమయ కోశాలన్నీ ఏ విధంగా ఆత్మకాదో అలాగే మిగిలిన విషయాలు కూడా ఆత్మకాదు అని తెలుసుకుని పంచకోశములు గల ఈ శరీరము అనిత్యము.

అనిత్యమైన పరవస్తువైన ఈ దేహం మీద మమకారాన్ని విడిచి పెట్టాలి. (మనిషి బట్టలు విడిచినంత సులభంగా శరీరాన్ని వదలలేడు.)

ముందుగా మనం ఈ పంచకోశముల గురించి క్లుప్తంగా తెలుసుకుందాము.

**(1) అన్నమయ కోశము :** ఇది అన్నము వలన పుడుతుంది. అన్నం చేతనే నిలబడుతుంది. అన్నం లేకపోతే అది నశించిపోతుంది. అన్నమయం అంటే తండ్రి ద్వారా వచ్చే బీజం. అది తల్లి కడుపులో అన్నంతో పెరిగి అన్నంతోనే జీవిస్తుంది. అందువల్ల దీనిని అన్నమయము అన్నారు.

**(2) ప్రాణమయ కోశము :** ఇది ఈ శరీరానికి చాలా ముఖ్యమైనది. ఈ శరీరం నుంచి ప్రాణం వెళ్ళిపోతే ఈ శరీరానికి విలువే లేదు. ఈ ప్రాణం వున్నంత సేపే మనిషికి విలువ. ఈ ప్రాణాన్ని మనం జాగ్రత్తగా కాపాడు కోవాలంటే మితాహారం తీసుకుంటూ, సాత్వికమైన ఆలోచనలు చేస్తూ, ప్రతిరోజూ ధ్యానం చేస్తే (మనకు మంచి ప్రాణవాయువు దొరుకుతుంది ధ్యానం ద్వారా) ఈ ప్రాణం రోగాల బారిన పడకుండా కాపాడుకోగలుగుతాం.

**(3) మనోమయ కోశము :** దీన్ని మూడు రకాలుగా చెప్తారు. బుద్ధి,

చిత్తం, ఉద్రేకం ఇవన్నీ కూడా మనస్సు ద్వారానే వ్యక్తమౌతాయి. నిజానికి మన మనస్సు, మనలో వుండే వేరే మనిషి క్రిందలెక్క. ఇందులో మంచి ఆలోచనలు, చెడు ఆలోచనలు అనేవి వస్తాయి. ఏది మంచి, ఏది చెడు అని తెలుసుకోగలశక్తి కూడా దీనికి వుంది ఈ మనస్సు ద్వారా.

**(4) విజ్ఞానమయ కోశము :** ఈ విజ్ఞానం అంటే మనం విని, చూసి చదివే నేర్చుకుంటాం. ఇది చాలా ఉత్కృష్టమైనది. సత్‌సాంగత్యం వల్ల ఎన్నో మంచి విషయాలు ద్వారా మనం ఎంతో విజ్ఞానం సంపాదించు కోవచ్చు.

**(5) ఆనందమయకోశం :** సుఖం, సంతోషం, ఆనందం అని మూడు రకాలుగా చెప్పవచ్చు. సుఖం అంటే మంచిభోజనం, మంచి నిద్ర, మంచి బట్టలు, ఇలా ఎన్నో వుంటాయి సుఖానికి సంబంధించి ఇవన్నీ శరీరానికి సంబంధించినవే సంతోషం అంటే మనస్సుకి సంబంధించింది. నా మనసు చాలా సంతోషంగా వుంది, నా మనస్సు చాలా తేలికగా వుంది అంటూ వుంటాము. ఇది ఆత్మకి సంబంధించింది. ఇది ఎక్కువగా పూజలూ, వ్రతాలూ, భజనలూ, సత్‌సాంగత్యం, మంచి మంచి ప్రవచనాలు ఇవి శరీరం, బుద్ధి, మనస్సు, ప్రాణం, విజ్ఞానం ఇవన్నీకూడా జడ పదార్థములే.

ఆత్మ అనేది వీటన్నింటికీ అతీతమైంది. ఈ ఆత్మకి ఎలాంటి వికారాలు వుండవు. ఈ ఆత్మ పూర్ణమైనది. ఎప్పుడయితే ఆత్మపూర్ణమైనదని తెలిసిందో అది ఒకటిగానే వుంటుంది. అది అనేకరకాలుగా వుండదు.

మనం అజ్ఞానంతో ఈ శరీరమే నేను అనుకుంటున్నాము. ఈ శరీరం నశించిపోగానే మరో శరీరాన్ని ఆశ్రయించటం జరుగుతుంది. శరీరం దహించబడుతుంది. కానీ ఆత్మదహింపబడదు.

ఇవన్నీ తెలిసి కూడా అజ్ఞానంతో శరీరంపై మమకారం పెంచుకోవటం జరుగుతుంది. ఇవన్నీ తెలుసుకున్న జ్ఞానులు మాత్రం

దీన్ని వదిలించుకుంటారు.

తెలిసీ తెలియని మూర్ఖులు నేను, నేను అనేటప్పుడు శరీరం మాత్రమే కనబడుతుంది. మనస్సు, బుద్ధి పనిచేయదు. మనిషి సంతోషంగా వున్నప్పుడు నేను ఆనందంగా వున్నాను అంటాడు. పైన చెప్పినట్టుగా మనం అనుకున్నవన్నీ అనుకున్నట్టు జరిగితే మనలో వికల్పాలు వుండవు.

మన ఆలోచనలు పరమ్మాతవైపు వుంటే మనం శరీరంతో తాదాప్యం చెందము. సాధకులకు మాత్రం మనస్సు "గోళకంలా" అటూ ఇటూ వూగిసలాడుతూ వుంటుంది.

బాల్యం, కౌమారం, యవ్వనం, వృద్ధాప్యం అనే దశలతో కూడిన ఈ శరీరం ఒక మట్టి కుండలాంటిది. కొన్ని సంవత్సరాలు మాత్రమే వుండే ఈ శరీరం ఒక్కొక్క దశలో ఒక్కొక్క రకంగా రంగులు ఎలా అయితే మార్చుతుందో గుణాలు కూడా అలామారుతూనే వుంటాయి.

మనుష్యులలో నాలుగు రకాల వారువుంటారు. మొదటి రకం వారిని బొంగరంతోనూ, రెండవ రకం వారిని సర్కస్‌లో గుఱ్ఱంతోను, మూడవరకం వారిని అర్ధార్ధులు అని, ఇక నాలుగవ రకం వారిని జ్ఞానులు అని అంటారు.

ముందుగా మొదటి రకం వారి గురించి తెలుసుకుందాము. వీరిని ఆర్తులు అంటారు. ఎలా అంటే వీరు ఓ భగవంతుడా నాకు అది కావాలి, ఇది కావాలి అని కోరుతూనే వుంటారు. ఆ కోరికలో నేను, నేను అనే స్వార్ధం ఎక్కువగా వుంటుంది.

వీరు భక్తిపరంగా అయితే భగవంతుణ్ణి ఆపద సమయంలోనో, కష్టాలు, రోగాలు వచ్చినపుడో మాత్రమే దేవుణ్ణి ప్రార్థిస్తారు.

రెండవ రకం వారు సర్కస్‌లో గుఱ్ఱంలాటివారు. వీరు తమ కుటుంబ సభ్యుల కోసం కూడా దేవుణ్ణి ప్రార్థిస్తారు. వీరిని జిజ్ఞాసులు అంటారు. వీరు ఆత్మజ్ఞానాన్ని లేదా భగవంతుని గురించి తెలుసుకోవాలన్న జ్ఞానాన్ని

కలిగి వుంటారు.

మూడవ రకం వారిని అర్థార్థులు అంటారు. వీరు తమ గురించి, కుటుంబ సభ్యుల గురించి బంధువర్గం గురించీ కూడా ఆలోచిస్తూ వుంటారు. ఆలోచించటమే కాకుండా వీరందరి గురించి దేవుణ్ణి ప్రార్థిస్తూ వుంటారు.

ఈ రకంగా చేస్తే మానవ సంబంధాల విషయంలో వీరి స్థాయి బాగా పెరిగిందన్నమాట. వీరు భూమిలాగ తన చుట్టూ తాము తిరుగుతూ చాలా మందికి మేలు చేస్తారు. వీరు ఇహ, పరలోకాలలో సుఖాలు మాత్రమే కావాలని కోరుకుంటూ వుంటారు.

ఇక నాలుగవ రకం వారిని జ్ఞానులు అంటారు. వీరు తమ స్వార్థం కోసమే కాకుండా సూర్యునిలా అందరికీ మేలు చేస్తూ వుంటారు. వీరు కోరికలు, వ్యామోహాలు, ప్రాపంచిక విషయాలపై ఆసక్తిని అన్నింటినీ విడిచి పెట్టేస్తారు.

ఎవరిస్థాయికి తగ్గట్టుగా వారు కోరతారు. వారి స్థాయి పెరిగే కొద్దీ చేసే సాధనలో నిస్వార్థత కనబడుతుంది.

అందుకే శ్రీకృష్ణ పరమాత్మ ఎవరు ఏం కోరినా, ఆ కోరిక నేను తప్పక నెరవేరుస్తాను, అందరూ నా పిల్లలే, ఎవరయితే ముక్తిని, మోక్షాన్ని కోరుతారో వారికి జ్ఞానాన్ని కూడా ఇస్తాను అన్నారు.

నిజంగా చెప్పాలంటే మనం చచ్చాక శవంగా మారే ఈ శరీరం, మనకే కనపడని ఈ ఆత్మ, మట్టిలో కలిసిపోయే మాంసపు ముద్ద, నిర్జీవ శరీరాన్ని ఒక్క క్షణం కూడా వుండనివ్వని బంధువర్గం, అనుబంధాలు వీటికోసం ఎంతమోసం, ఎన్ని కుళ్ళు, కుతంత్రాలు, మనకు నచ్చని వారని మనతోటి వారిని మానసికంగా హింసించి, పైసాచికానందాన్ని పొంది పాపకర్మల పోగు పెంచుకుంటూ అనుభవానికి వచ్చేసరికి లబోదిబోమంటూ గోలపెడితే ప్రయోజనం ఏమిటి?

❖ ❖ ❖

**(42) శ్లో ॥ దేహాది సర్వవిషయే పరికల్ప్య రాగం**
**బధ్నాతి తేన పురుషం పశువద్గుణేన ।**
**వెరస్యమత్రవిషవత్సు విధాయపశ్చా**
**దేనం విమోచయతి తన్మన ఏవబన్ధాత్ ॥**

మనం ప్రాపంచక విషయాల్ని చూసి అవి క్షుణ్ణంగా తెలుసుకుని అది జ్ఞానమని మురిసిపోతున్నాము. అది కేవలం అజ్ఞానమని దానివల్ల లేశ మాత్రమైనా వుపయోగం లేదని దీనివల్ల మన సమయంతో పాటు మనస్సు కూడా కలుషితం అయిపోయి అజ్ఞానంలో కూరుకుపోతున్నాము అనే విషయం మరిచిపోతున్నాము.

ఈ ప్రపంచం అంతా మన మనసులోనే వుంది. మనం నిద్ర పోతున్నపుడు అసలు ప్రపంచమే లేదు. మన మనస్సే సృష్టికి కారణం అయితే మోక్షానికి కూడా కారణం కావాలి. రోగానికి మందు ఎంత అవసరమో, మోక్షానికి మనస్సును కంట్రోల్‌లో వుంచుకుంటే మోక్ష మార్గం సులభమౌతుంది.

నేను, నాది అజ్ఞానం. ఇదంతా నేనే చేస్తున్నాను. అంతా నావల్లే జరుగుతోందనీ ఈ సిరిసంపదలు, వస్తు వాహనాలు, బంధు మిత్రులు అన్నీ నావే అని అనుకుంటాము.

మనం నిజమైన జ్ఞానం పొందాలనుకుంటే మనస్సును నిర్మలంగా ఉంచుకుని తనని తాను తెలుసుకోగలిగితే ఈ ప్రపంచంలో ఏది కూడా నీది, నాదీ అనేది ఏమీలేదు. అంతా అశాశ్వతం. సంసారం, బంధుమిత్రులు, సుఖదు:ఖాలు, ఆస్తిపాస్తులు అన్నీ కూడా అజ్ఞానం అనే పొర మనస్సును కప్పుకున్నందువల్ల ఏర్పడింది అని తెలుస్తుంది.

**ఉదా:** ఒక గురువు దగ్గరకు ఒక శిష్యుడు వచ్చి స్వామీ నేను నిత్యం ఏదో ఒకరకంగా బాధపడిపోతున్నాను. ఈ బాధల నుండి నన్ను కాపాడండి అని అడుగుతాడు.

అప్పుడు గురువు ఈ దు:ఖానికి దూరంగా కొన్ని రోజులు నా దగ్గరకురా నాయనా అంటారు.

దానికి ఆ శిష్యుడు అయ్యా! గురువుగారూ నా తల్లి, తండ్రీ, భార్యా నన్నెంతో ప్రేమగా చూస్తుంటారు. నేను లేకపోతే వారు అస్సలు వుండలేరు. కాబట్టి నాకు ఏదయినా మంత్రం చెప్పండి అన్నాడు.

నీవు చెప్పింది నిజమే నాయనా! కానీ అదంతా ఒక భ్రాంతి మాత్రమే. ఇది నీ మనస్సు చేసే మాయాజాలం. అందువల్ల నేను నీకు ఒక కిటుకు చెప్తాను. ఆ పని చెయ్యి, ఆ తరువాత నీకు రావాలి అనిపిస్తేనే నువ్వు నాతోరా నాయనా అని అతని చెవిలో ఒక రహస్యం చెప్తాడు.

శిష్యుడు ఇంటికి వెళ్ళి భోజనం వగైరా కానిచ్చి కాస్సేపు ఆగి సడెన్‌గా గుండుల్లో నొప్పి అంటూ గుండెపట్టుకుని కాస్సేపు అటూ, ఇటూ దొర్లి శవంలా బిగుసుకుపోతాడు.

అందరూ అతను చనిపోయాడనుకుని లబోదిబోమంటూ ఏడవ సాగారు. అప్పుడు గురువు గారు వచ్చి నేను ఒక మంత్రం చెప్తాను. అతను బ్రతుకుతాడు. ఆ నామాన్ని మీలో ఎవరయినా సరే మీనోటి ద్వారా ఆయన చెవిలో చెప్పాలి. అయితే ఈ నామాన్ని ఎవరయితే చెప్తారో వాళ్ళు చెప్పిన వెంటనే మరణిస్తారు అని చెప్పాడు.

అంతవరకూ ఏడుస్తున్న వారందరూ అయ్యా! ఈ మానవులందరూ ఏదో ఒక రోజున పోవలసిందే. కానీ ఇప్పుడు ఇక్కడ వున్న వారందరికీ ఏదో ఒక బాధ్యత వుంది. మేం లేకపోతే ఈ పనులు ఎవరు చేస్తారు. అని ఎవరికి వారే తప్పుకుంటారు ఆఖరికి భార్యతో సహా.

శవంలా పడి వున్న శిష్యుని మీద చెయ్యివెయ్యగానే శిష్యుడు లేచి కూర్చున్నాడు. ముందుగానే అందరిమాటలూ విన్న శిష్యుడు గురువు గారికి నమస్కరించి అయ్యా! నా కళ్ళు తెరిపించారు మీరు. నా వాడు అనేవాడు ఒక్క భగవంతుడే మీరు చెప్పినట్టుగా.

ఆ భగవంతుణ్ణి గురించే సాధన చేస్తాను, మీతో కలిసి, అని ఇద్దరూ వెళ్ళిపోయారు.

కాబట్టి మనం మనచుట్టూ వున్న ప్రపంచాన్నంతా మనదిగా వూహించుకుంటూ మన సమయాన్ని వృధా చేసుకుంటున్నాము. అది మూణ్ణాళ్ళ ముచ్చటే అని తెలుసుకుని భక్తిమార్గంలో ప్రయాణం చేయటం మంచిది.

పశువుని ఏ రకంగా తాటిచేత బంధిస్తున్నామో అలాగే మన మనస్సును విషయ వస్తువులవైపు మళ్ళకుండా సాధన ద్వారా మళ్ళించుకోవాలి.

ముందుగా మనం మనబుద్ధికి శిక్షణ ఇవ్వాలి. ఈ మిగిలిన కాలాన్నయినా భగవంతుణ్ణి తెలుసుకోవటానికి మాత్రమే వుపయోగించుకోవాలి.

ఒక్క బంధాన్ని కనుక మన మనస్సులోకి రానిస్తే అది మనస్సంతా అంటుకుని సర్వనాశనం చేస్తుంది.

మనం దేశబంధం, కాలబంధం, వస్తుబంధం అనే మూడు రకాల బంధాలలో ఇరుక్కుంటున్నాము.

**(1) దేశబంధం :** పూర్వం చాలామంది దేశంపై గౌరవంతో విదేశాలలో చదువుకున్నా స్వదేశంలోనే వుండి దేశానికి ఎంతో వుపయోగకరంగా వుండేవారు. కన్నతల్లిని గౌరవించినట్టుగా దేశాన్ని గౌరవించి ప్రేమించేవారు. కానీ ఇప్పుడు అలాటి వ్యక్తులే కరువయ్యారు.

**(2) కాలబంధం :** మనం అన్ని విషయాలలోనూ కాలానికి కట్టుబడి వుంటున్నాము (సంపాదన, రాబడి, ఇలా ఎన్నో విషయాలలో కాలానికి కట్టుబడి పరుగులు పెడుతున్నాము)

కానీ ఆధ్యాత్మిక చింతనలో మాత్రం ఆలస్యం చేసుకుంటూ కాలాన్ని వృధా చేసుకుంటున్నాము. (విలువైన కాలంలో ఒక సెకనైనా మనం తిరిగి తీసుకురాలేము) ఈ విషయాన్ని మరచి మనం ఎండమావుల వెంట పరుగులు పెడుతున్నాము.

**(3) వస్తుబంధం :** ఈ వస్తుబంధం అన్నింటి కన్నా భయంకరమైంది. మన ఇంట్లో ఎన్ని వస్తువులు వున్నా, మరెన్నో లాకర్లలో మూలుగుతున్నాయి. ఇంకా కొత్తగా ఏదయినా చూస్తే దాని మీద కోరిక. మన దగ్గర వున్నవి మనకి నచ్చవు. దూరపు కొండలు నునుపు అన్నట్లు ఇది ఆ దేశానిది, అది ఈ దేశానిది అంటే అదే ఒక గొప్ప. ఇలా వస్తుబంధంలో కొట్టుకుంటూ దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుతూ కాలాన్ని వృధా చేసుకుంటున్నాము.

ఒకసారి వివేకానందస్వామి షిప్‌లో ప్రయాణం చేస్తుండగా అదే షిప్‌లో ఒక యువకుడు కూడా ప్రయాణిస్తున్నాడు.

ఆ కుఱ్ఱవాడు వివేకానందస్వామితో ఆ మాటా ఈ మాట మాట్లాడుతుండగా వివేకానందస్వామి వారు నాయనా, నువ్వు ఎక్కడికి వెళ్తున్నావు అని అడిగారట.

అప్పుడు ఆ కుఱ్ఱవాడు నేను ఎం.ఎస్. చేయటానికి అమెరికా వెళ్తున్నాను అని చెప్పాడు.

ఎం.ఎస్. చేసాక ఏంచేస్తావ్? అని స్వామి అడిగారు. దానికి ఆ కుఱ్ఱవాడు ఎం.ఎస్. అయిపోగానే అక్కడే ఒక మంచి వుద్యోగంలో చేరతాను అన్నాట్ట.

దానికి స్వామి ఉద్యోగంలో చేరాక ఏం చేస్తావ్ అన్నారట.

ఆ మాటకి ఆ కుఱ్ఱవాడికి విసుగొచ్చి వుద్యోగం రాగానే పెళ్ళిచేసుకుని పిల్లల్ని కని వాళ్ళని పెంచిపెద్ద చేయటానికి కష్టపడతాను అన్నాట్ట. ఆ తరువాత అంటే వారి బాధ్యతలు తీరగానే చస్తాను అన్నాట్ట విసుగ్గా.

వెంటనే వివేకానంద స్వామి అలాగ చచ్చేదానికి అమెరికా దాకా ఎందుకు ఏదో ఇక్కడే చావచ్చుగా. కనీసం నీకోసం కన్నీరు కార్చేవారయినా వుంటారు. అక్కడ దిక్కులేని చావు చచ్చే కన్నా ఇది నయం కదా? అన్నారట.

మనం ఏ పని చేసినా బంధం. ఎక్కడికి వెళ్ళినా బంధం. ఇలా బంధం అనే చక్రంలో ఇరుక్కుని అందులో నుంచి బయటపడలేక కొట్టుకుంటున్నాము.

❖ ❖ ❖

(43) శ్లో ॥ లోకాను వర్తనం త్యక్త్వా దేహానువర్తనమ్ ।
శాస్త్రానువర్తనం త్యక్త్వా స్వాధ్యాసాపనయం కురు ॥

ప్రతివారికీ ఈ లోకంలో పుట్టటంతోనే ఒక బంధం ఏర్పడుతుంది. వీడు నా వాడు. వాడు నా వాడు. అది నాది, ఇది నాది అంటూ ఈ సంసార బంధం నిజమని నమ్మి, దానికి కట్టుబడిపోతుంటారు.

ఈ సంసారం శాశ్వతం. ఇందులోనే సుఖ, సంతోషాలు వున్నాయని ఈ ఆనందం మరెందులోనూ లేదని వీటినే అంటి పెట్టుకుని మనం బ్రతుకుతున్నాము.

అయితే వీటికి మించినది మరొకటి వుంది అని తెలుసుకోలేక పోతున్నాము.

జ్ఞాని అయిన వ్యక్తి ఈ సంసారంలో వుంటూనే మంచి పనులను ఆచరిస్తూ, చెడు పనులను విసర్జించటం అలవాటు చేసుకున్నట్టయితే ఈ సంసార బంధంలో వున్నా ప్రమాదం వుండదు.

మనం ఎవరో ఏదో చేసారని గుడ్డిగా దాన్ని అనుసరించటం మంచిది కాదు. కానీ ప్రస్తుతానికి మనం చేస్తున్నది అదే. ఎలా అంటే ఒక వంతెన మీద గొఱ్ఱెలు నడుస్తున్నాయి. అనుకోకుండా ఒక గొఱ్ఱె నదిలో పడింది. అయితే మిగిలిన గొఱ్ఱెలన్నీ కూడా అదే మార్గాన్ని అనుసరిస్తాయి. "దీనినే గడ్డాలికా ప్రవాహ పతిత న్యాయం" అంటారు.

మనం విశ్వాసాలను నమ్మవచ్చు. కానీ అవి మూఢ విశ్వాసాలుగా వుండకూడదు.

**ఉదా:** ఒక యోగి నదిలో స్నానం చేసి ఆయన రాగిచెంబును శుభ్రంగా కడిగి పైకి వచ్చి అనుష్టానం చేసుకోదలచి జనం ఎక్కువగా వున్నందువల్ల ఆ చెంబు పోతుందేమో అని తలచి దానిని తిరగేసి కొంత భాగం భూమిలో పాతిపెట్టి అనుష్టానం చేసుకోసాగారు. అనుష్టానం ముగించి యోగి కళ్ళు తెరచి చూసేసరికి ఆయన చుట్టూ అనేక చెంబులు శివలింగాల్లా కనిపించాయి. అందులో ఆ యోగి చెంబు ఏది అన్నది మాత్రం తెలియలేదు.

యోగి భద్రత కోసం చెంబుని పాతిపెడితే దాన్ని ఒక ఆచారంగా భావించి గొఱ్ఱెల్లా అందరూ ప్రవర్తించారు.

మన పనులు ఆలోచనలకు, ఆలోచనలు అలవాట్లకు, అలవాట్లు వ్యక్తిత్వాన్ని నిర్ధారణ చేయటానికి దారితీస్తాయి. అనుకరణలు అన్నీ కూడా మన భవ్యిత్తుని నిర్ణయిస్తాయి. అయితే అది మంచిపనా, చెడు పనా అనేది ఆలోచించి చేయాలి.

దీనికంతటికీ కారణం మనలోని అజ్ఞానమే.

**ఉదా:** ఒక కాలేజ్ ఫంక్షన్‌కి ఒక ప్రొఫెసర్‌గారిని ఆహ్వానించారు కాలేజీ పెద్దలు, విద్యార్థులను వుద్దేశించి విజయం అంటే ఏమిటి అని అడిగారు.

డబ్బులు బాగా సంపాదించటం అన్నారు కొందరు. దానికి ప్రొఫెసర్ గారు బ్రతికేందుకు డబ్బులు వుంటే చాలు. డబ్బులు సంపాదించటం విజయం కాదు అన్నారు ప్రొఫెసర్.

ఒక కుఱ్ఱవాడు లేచి సర్! విజయం అంటే శక్తి సర్ అన్నాడు. శక్తి వున్నంతమాత్రాన అది విజయం కాదు. ఎందుకంటే అలెగ్జాండర్, హిట్లర్, ముసోలినీ వంటివారు ప్రపంచాన్ని జయించాలని తమ శక్తితో విజయాలు పొందాలనుకుని ఆశపడ్డవారి జీవితాలు ఎలా ముగిసి పోయయో తెలుసుగా అన్నారు ప్రొఫెసర్. మహమ్మద్ ఆలీ అని ప్రపంచ

బాక్సర్ పార్కిన్‌సన్ వ్యాధితో నరకం అనుభవిస్తూ ఆఖరికి కాఫీ కప్పు కూడా పట్టుకోలేక ఇబ్బంది పడ్డాడు. ఆ శక్తి విజయంలోకి రాదు అన్నాడు ప్రొఫెసర్.

మరి విజయం అంటే ఏమిటి? అందరూ ఆలోచనలో పడ్డారు. అంతలో ఒక అమ్మాయి లేచి విజయం అంటే అందం సర్ అంది.

ఒక హీరోయిన్ ఎంతో అందంగా వుంది. అభిమానులు ఆమెకు గుడికట్టి ఆరాధించారు. కానీ ఆమె అనుకోకుండా ఒక భయంకరమైన వ్యాధికి గురై చనిపోయింది. ఆమెతో పాటు ఆమె అందమూ పోయింది అన్నారు ప్రొఫెసర్.

ఇవేమీ కాకపోతే ఉన్నత పదవి సర్ అంది ఆ అమ్మాయి ఒకప్పుడు పెద్దపెద్ద పదవుల్లో మంత్రులు, ముఖ్యమంత్రులు, రాష్ట్రపతులు, ప్రధాన మంత్రులుగా చేసినవారు ఇప్పుడు ఎవ్వరూ పట్టించకోని స్థితిలో వున్నారు అధికారం ఎంతమాత్రమూ విజయం కాదు అన్నారు ప్రొఫెసర్.

మళ్ళీ ప్రొఫెసర్ గారు సరే మీలో ఎంతమందికి మీతాత, ముత్తాతల పేర్లు తెలుసు అన్నారు. కొందరు చెప్పారు. కొందరు చెప్పలేక పోయారు.

పోనీ ఇవన్నీ వదిలేయండి. శ్రీరామచంద్రుడు. శ్రీకృష్ణ పరమాత్మ. శ్రీ ఆదిశంకరాచార్యుల వారు, రామానుజుల వారిపేర్లు తెలుసా అన్నారు ప్రొఫెసర్ గారు.

స్టూడెంట్స్ అందరూ ముక్తకంఠంతో తెలుసు, తెలుసు అని ఆనందంగా అరిచారు.

అప్పుడు ప్రొఫెసర్‌గారు ! మీకు మీతాత ముత్తాతల పేర్లు తెలియలేదు. వారు మీ కుటుంబలోని వ్యక్తులు. మరి వీరి గురించి మీకు ఎలా తెలిసింది అని అడిగారు.

జనం మధ్యలో నుంచి ఒక అమ్మాయి లేచి రెండె చేతులూ జోడించి నమస్కరిస్తూ! అయ్యా! మీరు అడిగిన విజయం అనే పదానికి అర్థం

ఇప్పుడు నాకు తెలిసింది.

మాకు మా పూర్వీకుల పేర్లు తెలియక పోవటం మా అజ్ఞానం శ్రీరామచంద్రమూర్తి, శ్రీకృష్ణ పరమాత్మ. శ్రీ ఆదిశంకరాచార్యుల వారు, రామానుజుల వంటి వారు తమకోసం కాకుండా, సమాజహితం కోసం తపించిన ఋషులు, మునులు, వీరందరూ చిరంజీవులుగా మిగిలిపోయారు.

తమ కోసం, తమ స్వార్థం కోసం బ్రతికే వారు కొంతకాలానికి కాలగర్భంలో కలిసిపోతారు. సర్వే జనా సుఖినోభవంతు అని సమాజ శ్రేయస్సు కోరే వారు మాత్రం ఈ భూమి ఉన్నంతకాలం చిరంజీవులు గానే వుంటారు. విజయం అంటే ఇదే దీనిని మించిన విజయం ఏదీ లేదనుకుంటున్నాను అని ఆ అమ్మాయి ముగిస్తుంటే ఆడిటోరియం మొత్తం చప్పట్లో దద్దరిల్లిపోయింది.

మంచి అంటే చెడు లేనటువంటిది. మనం తప్పటడుగులు వేయకుండా, దుష్టమార్గంలో పడకుండా మనల్ని ఏదయితే కాపాడుతుందో అదే మంచి, అటువంటి మంచి కర్మలను మనం ఎప్పుడయితే ఆచరిస్తామో అది మాత్రమే మనకు శాశ్వతం.

సాధన ద్వారా మనం మంచి అనేది అలవాటు చేసుకుంటే మనచుట్టూ అంతా మంచే వుంటుంది.

జీవుడు ఈ దేహాన్ని వదిలి వెళ్ళిపోతే అప్పుడు మనకి ఇంక ఎలాటి చిక్కులు వుండవు అని అనుకుంటాము. కానీ అదే పెద్ద చిక్కు. మనయొక్క ఆలోచనలు మనను ముందుకు పోనివ్వవు.

మనం ఏ లోకాలికి వెళ్ళినా, ఎన్ని జన్మలు ఎత్తినా మనల్ని కాపాడేది ఒక ధర్మం, మంచి మాత్రమే.

మనం ఎదుటి వారికి చెడు చెయ్యాలి అనుకుంటే అది తిరిగి తిరిగి ఏదో ఒకరూపంలో మనకే తిరిగి వస్తుంది.

అందువల్లే ఎవరు మనల్ని ద్వేషించినా, పొగిడినా సమంగా భావించినట్లయితే మనలో ద్వేషమూ వుండదు, రాగమూ వుండదు.

ఈ రాగ, ద్వేషాలకు అతీతంగా వుండటం (సాధన ద్వారా అలవాటు చేసుకుని) ఎవరయితే ఆచరిస్తారో వారు బ్రహ్మస్వరూపంగా చెప్పబడుతారు.

❖ ❖ ❖

(44) శ్లో ॥ **అసంగ చిద్రూపమముం విమోహ్యా**
**దేహేన్ద్రియప్రాణ గుణైర్నిబద్ధ్య ।**
**అహం మమేతి భ్రమయత్యజస్రం**
**మనఃస్వకృత్యేషు ఫలోపభుక్తిషు ॥**

ఈ ఆత్మ ఆనందచిద్రూపుడైనను ఇంద్రియములు, దేహము అనే బంధాలతో బంధించబడుతోంది. అంటే జీవాత్మ వేరు, పరమాత్మ వేరు అనే బేధాలు మనస్సు ద్వారా సృష్టించి బంధంలో కట్టిపడేస్తోంది. అందువల్లే నేను, నాది అనే భావాలు ఏర్పడుతున్నాయి.

అంటే జనన మరణాత్మక దు:ఖసాగరంలోకి మనల్ని నెట్టేస్తుంది. ఇదంతా భ్రాంతి, మాయా అనేది మనం తెలుసుకోలేకపోతున్నాము.

ఎప్పుడయితే మనలో మాయ అనేది ప్రవేశించిందో అప్పుడే మనలోకి అహం అనేది బయలుదేరుతుంది. ఈ ఆహంలో నుంచే పొగరు, కోపం, అసూయ, ద్వేషం అనే దుర్గుణాలు మనలో ప్రవేశించి మనల్ని ఒక్కొక్క మెట్టు దిగజారేలా చేస్తాయి.

**ఉదా:** మనల్ని ఎవరయినా హింసించే మాటలు అంటే వాటిని పదేపదే తలచుకుని బాధపడుతూ వుంటాము. నిరంతరం ఇలాంటి పనికిమాలిన విషయాలకు ప్రాధాన్యత ఇచ్చి బాధపడే వారికి దు:ఖం మాత్రమే మిగులుతుంది.

మన వున్నతికైనా, లేదా పతనానికయినా కారణం మనమే.

క్రూరులు, ద్వేషస్వభావం కలవారు, అధములు, నీచులు మొదలయిన వారు ఎన్ని జన్మలు ఎత్తినా వారిలో కొంచెం కూడా మార్పురానట్లయితే వారిని ఎన్ని జన్మలు ఎత్తినా అదేరకం మనస్తత్వం కలవారి కుటుంబాలలో జన్మించటం జరుగుతుంది.

అంటే ఇలాంటి వారు ఎక్కడ పుట్టాలి. ఏ జాతిలో పుట్టాలి, ఏ వాతావరణంలో పుట్టాలి, అనేది వారి, వారి, కర్మలను బట్టి ఆ భగవంతుడే నిర్ణయం చేసి వారికి తగ్గవిధంగా వారిని పుట్టిస్తాడు.

దుర్మార్గులు అవతలవారి మంచితనాన్ని లోకువగా తీసుకుని, అది మంచివారి చేతకాని తనంగా భావిస్తూ వుంటారు. అలాగని మంచివారు చెడ్డవారికి ఎదురు తిరిగితే లాభం ఏమీ వుండదు సరికదా మంచివారు చేసుకున్న పుణ్యం తగ్గిపోవటం జరుగుతుంది. అందువల్ల అహంకారమనే అంధకారంలో కొట్టుకుంటున్న వారితో ఢీ కొనటం సంస్కారవంతులకు తగదు.

మాటల యొక్క ప్రభావం చాలా పవిత్రమైనది. సంస్కారవంతులతో కలిస్తే వారి మాటలు, చేతలూ కూడా పవిత్రంగానే వుంటాయి. చెడ్డవారితో కలిస్తే చెడు సంస్కారాలే అబ్బుతాయి.

పాపం వల్ల వచ్చే ఫలం దు:ఖం, పుణ్యం వల్ల వచ్చే ఫలం సుఖం వాటిని దృష్టిలో పెట్టుకుని మనం ఎప్పుడూ మసలాలి. పాపం చేసేసి పుణ్యం యొక్క ఫలాన్ని ఆశించటం వల్ల ఎటువంటి వుపయోగమూ వుండదు.

అయితే ఈ పాప, పుణ్యాలకు మించినది వేరే ఇంకొకటివుంది. అదే జ్ఞానం, ఆజ్ఞానం మనం పూర్తిగా పొందినట్లయితే మోక్షం లభిస్తుంది.

జీవుడు ఒక జన్మనుంచి ఇంకొక జన్మకు పాత శరీరం విడిచి కొత్త శరీరంలోకి మారుతూ వుంటాడు.

(1) బాల్యము, యవ్వనము, కౌమారము, వార్ధక్యము ఇలా నిరంతరం ఈ శరీరం మారిపోతున్నా మనం మాత్రం ఈ శరీరమే నేను అనే భావంతో వుంటున్నాము.

అతిపెద్ద భయంకరమైన శత్రువులయిన కామ, క్రోధ, మద, మాత్సర్యములు అనేవి మనలో పాతుకుపోయి వున్నాయి. ఇవి మనలో వున్న అంతర్గత శత్రువులు. ఇవి బయటకు కనిపించే వాటికన్నా చాలా భయంకరమైనవి. హానికరమైనవి కూడా.

**(1) మనస్సు :** ఆలోచనలు సృష్టించటమే దీని పని.

**(2) బుద్ధి :** బాగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవటమే దీనియొక్క పని.

**(3) చిత్తము :** ఏదయినా ఒక వ్యక్తితో కానీ, వస్తువుతో కానీ అనుబంధం ఏర్పరుచుకోవటమే దీని పని.

**(4) అహంకారము :** డబ్బు, హోదా, అందం, చదువు, పదవులు, ఇవన్నీ ఎప్పుడయితే శరీరంతో అనుసంధానమవుతాయో అప్పుడే దానిని అహంకారము అంటారు.

మనం వీటిని విడివిడిగా చెప్పుకున్నా ఈ నాలుగింటినీ కలిపే మనస్సు అంటారు.

మనకి బయట ఎవరయినా హాని చేస్తే వాళ్ళని శత్రువులు అంటాము. కానీ మనస్సే మనకి ప్రధాన శత్రువు అయితే మన యొక్క బుద్ధిని వుపయోగించి మనస్సుని కంట్రోల్ చేసుకోవాలి.

**ఉదా:** ఉత్తమునికి కోపం వస్తే (వారి యొక్క బుద్ధి నిరంతరం మంచి మార్గంలో ప్రయాణిస్తూండటం వల్ల) ఒక్క క్షణం మాత్రమే వుంటుంది.

మధ్యముని కోపం! ఘడియ వరకూ వుంటుంది.

అధముని యొక్క కోపం 1 రాత్రి 1 పగలు వుంటుంది.

అదే పాపిష్టి వారి కోపం చచ్చే వరకూ వుంటుంది. ఎప్పుడూ కోపంతో

వుండేవారికి, వారి బుద్ధికూడా వక్రంగా వుండటం వల్ల వారు మంచిపనులు చేయరు కాదు కదా, మంచి మాటలు కూడా మాట్లాడరు.

చాలా మంది విషపు పురుగులతో జాగ్రత్త, జాగ్రత్త అంటూ వుంటారు. కానీ నిజం చెప్పాలంటే "ఖలునికి నిలువెల్ల విషముగదరా సుమతీ" అని సుమతీ శతకంలో చెప్పినట్టుగా పాములోను, తేళ్ళలోనూ వున్నది విషం కాదు. అంతకన్నా భయంకరమైన విషం నింపుకున్న వ్యక్తులు అనేకమంది మన ఎరుకలోనే వున్నారు. అహంకారుల యొక్క మాట, చేత కూడా విషం కన్నా భయంకరంగా వుంటాయి.

అసలు ఈ అహంకార మమకారాలకి కారణం నేను దేహం, నేను దేహం అనే అపోహలో వుండటమే.

అదే మనం అహం బ్రహ్మాస్మి అనుకుంటే ఇవేమీ వుండవు. అదే మోక్షానికి కారణం.

**ఉదా:** జీవుడు తల్లిగర్భంలో నవమాసాలూ గర్భనరకం అనుభవించి (మలమూత్రాలలో ఈదుతూ ఆ మలమూత్రాలలో పుట్టిన పురుగులు ఒళ్ళంతా కుట్టేస్తుంటే) ఎటూ తిరగటానికి దారిలేక ఒళ్ళంతా తిమ్మిరెక్కి ఏమీ చేయలేక నరకం అనుభవించి, ఆఖరికి బయటపడటం జరుగుతుంది.

మనం తల్లి యొక్క గర్భంలో ఇంత నరకం అనుభవించి బయటపడినా ఇదంతా పూర్వజన్మ కర్మఫలం అని తెలుసుకోలేక వయసు పెరిగే కొద్దీ మనస్సులో ద్వేషం పెంచుకుంటూపోతే ఆ ద్వేషం యొక్క ప్రభావం మనం ద్వేషించే వ్యక్తి పై కన్నా మనమీదే ఎక్కువ ప్రభావం పడుతుంది. ఆ ద్వేషం నుంచే అనేక రకాలయిన చెడు ఆలోచనలు రావటమే కాకుండా అహంకారం పుడుతుంది. అందులో నుంచే నేను, నాది అనేది మొదలవుతుంది. ఇదంతా మన మనస్సు వల్లనే ఈ భ్రాంతి కలుగుతుంది. ఈ నేను, నాది అనేదే ఒక పెద్ద అజ్ఞానం.

**ఉదా:** ఒక ఎద్దు వుంది. అది అంబా అంబా అని అరుస్తూ వుంటుంది. అంబా, అంబా అంటే నేను, నేను అని అర్థం. ఈ అంబా అన్న మాటతోనే దానికి కష్టాలు మొదలవుతాయి. అది పెరిగి పెద్దవ్వగానే దాన్ని ఎడ్లబండిగా కడతారు. ఖాళీ సమయంలో కాడికి కట్టి పొలం దున్నిస్తారు. ఎండా, వానా అని లేకుండా దాన్ని పనికి వుపయోగిస్తూనే వుంటారు.

ఆఖరికి ఆ ఎద్దు ముసలిదై చనిపోతే దాన్ని కసాయి వాడికి అమ్మేస్తారు. ఆ కసాయివాడు దాని చర్మం ఒలిచి చెప్పులు కుట్టి అమ్ముతాడు. అంతే కాకుండా ఆ చర్మాన్ని డోలుకు ఉపయోగిస్తారు. ఆ డోళ్ళను కట్టెలతో నిర్దాక్షణ్యంగా బాదుతారు.

అప్పటికీ దాని దురదృష్టం పోదు. దాని ప్రేగులు తీసి దూదిని పీకే యంత్రానికి కట్టిదాన్ని వాడతారు.

ఇంక అప్పుడు అది తూహూ, తూహూ (అంటే నువ్వు, నువ్వు) అంటుంది. అప్పటికీ కానీ దానికి విముక్తి రాదు.

అంబా, అంబా (నేను, నేను) అనే అహంపోయి తూహు, తూహు (నువ్వు నువ్వు) అంటే భగవంతుడా చూసేవాడివి, చూపించేవాడివి, నడిపేవాడివి, నడిపించేవాడివి నువ్వే అనే భావం వస్తుంది. ఈ భావన, ఎప్పుడయితే వస్తుందో అప్పుడు అహంకారం పోతుంది.

మన యొక్క అహంకారం నుండి మనం విముక్తులమైన తరువాత మనయొక్క ఆత్మ పౌర్ణమినాటి చంద్రునిలా, నిర్మలంగా, నిశ్చలంగా తనంత తను ప్రకాశించటం జరుగుతుంది.

మనలో ఈ అహంకారం ఏ కొంచెం మిగిలివున్నా అది ముక్తి మార్గానికి అడ్డంకిగా నిలుస్తుంది.

**ఉదా:** ఒక కొలనులో తామరపూలు అందంగా విచ్చుకుని వున్నాయి. వాటిని చూసిన ఒక తేనెటీగ అందులోని మకరందాన్ని త్రాగుతూ ఆనందాన్ని అనుభవిస్తూ హాయిగా ఆనందంగా ఉంది.

అలా ఎంత సమయం గడిచిందో దానికే తెలియదు. సూర్యాస్తమయం అవుతున్న సమయంలో ఆ కలువ యొక్క రేకలు నెమ్మదిగా ముడుచుకోసాగాయి.

ఆ తేనెటీగ తన ఇంద్రియ సుఖాలను అనుభవించటంలో లీనమైపోయి వుండటంతో చీకటి అయింది. తామర పువ్వు పూర్తిగా ముడుచుకుపోయింది. ఈ తేనెటీగ మాత్రం అది గమనించక అందులో వుండిపోయింది. కొంచెం సేపటికి పువ్వు ముడుచుకోవటం గమనించిన తేనెటీగ పోనీలే రేపు వుదయం పువ్వు విచ్చుకోగానే ఎగిరిపోదాం. ఈ రాత్రంతా హాయిగా మకరందం త్రాగి రేపు వెళ్ళిపోదాం అనుకుంది.

ఈలోగా ఒక ఏనుగు వచ్చి వరుసగా కలువలను లాగి మ్రింగేసింది. తేనెటీగ తామరపూవుతో సహా ఏనుగుబొజ్జలోకి వెళ్ళిపోయింది.

ఒక తేనెటీగకు చెక్క కొయ్యను కూడా తొలిగించే శక్తి కలిగి ఉంటుంది. సుకుమారమైన తేనెటీగ ఇంద్రియసుఖములను అనుభవించటంలో ఎంతో ఆనందాన్ని అనుభవిస్తూ తన మృత్యువును తానే తెచ్చుకోవటం జరిగింది.

ఈ రకంగానే మనం ఇంద్రియాలను తృప్తిపరచటం కోసం నిమగ్నమై వుండటంలో మునిగిపోయి భగవంతుణ్ణి స్మరించటం వదిలేస్తున్నాము.

ఈ సృష్టి అంతా ఒక మాయ. మనం అజ్ఞానం వల్ల ఈ మాయలో చిక్కుకుని బయటకు రాలేకపోతున్నాము. బ్రహ్మం మాత్రమే సత్యం. బ్రహ్మమే సుఖము. ఈ బ్రహ్మాన్ని తెలుసుకుని, పట్టుకున్నట్లయితే మోక్షము పొందవచ్చును.

ధృక్, దృశ్యములనే రెండు పదార్థములు కలవు. ధృక్ అంటే బ్రహ్మము, దృశ్యము అంటే మాయ! ఆత్మ అనీ, అనాత్మ అనీ రెండు పదార్థములు వున్నాయి. ఆత్మ అంటే బ్రహ్మము. అనాత్మ అంటే భోగమయి, జ్ఞానము కలిగినట్టయితే మోక్షం గ్యారంటీ అజ్ఞానం వల్ల బంధాలలో ఇరుక్కోవచ్చు.

మనకు అతి భయంకరమైన పెద్ద శత్రువులయిన కామము, క్రోధము, లోభము, ఈర్ష్య, అసూయ అనే మనలో వున్న అంతర్గత శత్రువుల్ని మనం అదుపులో పెట్టుకోకపోతే భగవంతుని చరణారవిందములు చేరలేము.

దీనికి మార్గం నిరంతర అభ్యాసము, వైరాగ్యముల ద్వారా మనస్సులోని అలజడులను నియంత్రించుకుని ఆత్మసాక్షాత్కారం పొందడమే.

❖ ❖ ❖

సద్విషయ పరంపరయే భగవంతునిపై మనకున్న అపారమైన వాఙ్మయం. పరమాత్మను చింతన చేయడానికి మన మహర్షులు, శ్రీరామయణం, భారత, భాగవతాది ఇతిహాసాలను, అష్టాదశ పురాణాలను, వేదావేదాంగాలను, ఉపనిషత్తులను సృజించి మనకు వరదానం చేశారు. ఆ పురాణేతిహాసాల వేదోపనిషత్తుల సారాలను క్రోడీకరించి, సంక్షిప్తీకరించి అపర శివావతార స్వరూపులు 'శ్రీ ఆదిశంకరులు' అనేకానేక రచనలు చేసి భగవన్నుతికి, స్తుతికి పూల వంతెన వేశారు.

అలాంటి పూలవంతెన 'వివేక చూడామణి'. భక్తుడ్ని, భగవంతుడ్ని చేరువ చేసేదే ఈ పూలవంతెన. ఆ 'వివేక చూడామణి' లోని అర్థం పరమార్థం సాధారణ పాఠకులకు యిసుమంత తాత్వికత, ఆధ్యాత్మికతా ప్రయాణంలో వున్నవారికి మాత్రం సుబోధకంగా వుంటుంది.

– వరప్రసాద్ రెడ్డి

అపారమైన భక్తి కలిగిన భక్తునిపై పరమేశ్వరుని యొక్క దయ ఎలా వుంటుందో, అలాగే శిష్యుని యొక్క ఆర్తి మీదే గురువు యొక్క దయ ఆధారపడి వుంటుంది. అంతే కాకుండా గురువు వివేక, వైరాగ్యములతో పాటు ఈ సృష్టిలో అసలు నాశనం లేని వస్తువు ఏది అని శిష్యునికి అర్థం అయ్యేలా తెలియచేసి దేన్ని పట్టుకుంటే మనకు శాశ్వతమైన ఆనందం లభిస్తుందో చెప్తూనే అసలు ఆనందం అనేది మనలోనే వుంది. ఆ ఆనందం మనకి అనుభవంలోకి రావాలి అంటే ముందుగా మనకి వైరాగ్యం రావాలి. ఆ వైరాగ్యం ద్వారానే ముక్తి లభిస్తుంది అనే విషయం మనకి గురుముఖంగా మాత్రమే లభిస్తుంది. అనేది చక్కగా తెలియచేసారు శ్రీ ఆది శంకరాచార్యులవారు.

– శ్రీమతి ద్విభాష్యం కామేశ్వరీ రాణి